


ఆంధ్రప్రదేశ్
Regd. No. [illegible]
సంపుటి 5 సంచిక 6
ఏప్రిల్ 1961
చైత్ర-వైశాఖ 1883 శక.



ఒంగోలుకు చెందిన శ్రీ పి. హనుమయ్య గారి ఒంగోలు జాతి కోడె ప్రథమ బహుమతి పొందింది.




నిజామాబాదు జిల్లా మద్నూరు బ్లాకుకు చెందిన శ్రీ హనుమారెడ్డి గారి ఒంగోలు జాతి కోడె: దీనికి కూడా ప్రథమ బహుమతి లభించింది.

మేలిరకం పశువులు

ఈ మధ్య హైదరాబాదులో జరిగిన అఖిల భారత పశువుల, కోళ్ళ ప్రదర్శనలో బహుమతులు పొందినవి.



ప్రథమ బహుమతి పొందిన అనంతపురం గొర్రె.



ఢిల్లీనివాసి శ్రీ షేర్‌సింగ్ గారి ముర్రా జాతి గేదె: దీనికి ప్రథమ బహుమతి వచ్చింది.

ఆంధ్రప్రదేశ్

సంపుటి 5 | ఏప్రిల్ 1961 | సంచిక 6

చైత్ర-వైశాఖ—1883, శకము

విషయసూచిక

1.	రాష్ట్రంలో పరిశ్రమాభివృద్ధి	...	దామోదరం సంజీవయ్య	...	1
2.	చైత్ర లక్ష్మి	...	బి. ప్రసన్న	...	6
3.	కర్షక పక్షపాతి కవికోకిల	...	కె. వి. రమణారెడ్డి	...	8
4.	రంగాజమ్మ	...	శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి	...	12
5.	శ్రీమద్రామాయణము—ఉత్తరకాండము	...	అత్మకూరి గోవిందాచార్యులు	...	17
6.	మంగళసూత్రములు	...	రా. సు. రాట్కవి	...	20
7.	బియ్యందంపుడు యంత్రం	...	గజపతి రాయవర్మ	...	21
8.	కూపస్థ మాండూక్యం	...	త్రిపురనేని గోపీచంద్	...	22
9.	హంసతూలిక	...	'కిన్నర'	...	33
10.	మహిళాభ్యుదయం	...	కొంపల్లి మల్లిఖార్జునరావు	...	35
11.	భాయీ భాయీ	...	బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి	...	41
12.	కృష్ణయజ్వ అలంకారముక్తావళి	...	సుప్రసన్న	...	42
13.	బహుమతులు గెల్చినవారు	...	— —	...	49
14.	కాఫీదేవత	...	పమిడికాల్వ చెంచు నరసింహశర్మ	...	50
15.	పారిశ్రామిక విశేషాలు	...	— —	...	52

16. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ... — — ... 53

17. ప్రశ్నోత్తరావళి ... — — ... 61

18. ప్రగతి పథంలో ... — — ... 63

19. సంగ్రహా ప్రకటనలు ... — — ... 66

20. ఉత్తరదేశంలో చిన్న పరిశ్రమలు ... ఆర్. ఇ. నారాయణస్వామి ... 68

21. విశేషాలు ... — — ... 70

22. ముఖ్యవార్తలు ... — — ... 71

ముఖచిత్రం : కథాకళి నృత్యం (క్రిందటి నెలలో కేరళనుండి వచ్చి ఆంధ్రప్రదేశ్‌లో ప్రదర్శన లిచ్చిన బృందంలోని ఒకనటుడు)

వెనుకఅట్ట : "చూడవలసిన సుందర ప్రదేశాలు" అనేపేరుతో బొంబాయిలో జరుగుతున్న యాత్రిక ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ భాగం.

చందా వివరాలు

సంవత్సరానికి	—	2 రూపాయల 16 నయాపైసలు
విడి ప్రతి వెల	—	18 నయాపైసలు

Edited & Published by the Director of Information & Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at Yuva Press, Public Garden Road, Hyderabad-1

రాష్ట్రంలో పరిశ్రమాభివృద్ధి

దామోదరం సంజీవయ్య

ఈ రాష్ట్రానికి సంబంధించి రెండవ పంచవర్ష ప్రణాళికలో పరిశ్రమల నిమిత్తం రు. 10.03 కోట్లు మొత్తం కేటాయించబడింది. అందులో 1.67 కోట్ల మొత్తం పెద్ద తరహా, మధ్య తరహా పరిశ్రమలకోసం ప్రత్యేకించబడింది. పరిశ్రమల వంటి ముఖ్యమైన రంగానికి ఇది నిజంగా తక్కువే. మూడవ ప్రణాళికలో ఈ మొత్తాన్ని ఎక్కువగా పెంచాలనే ఉద్దేశం ఉంది. పరిశ్రమలశాఖ మొదట్లో 35.07 కోట్లు కోరినప్పటికి డిమాండు ఎక్కువగా ఉండడంవల్లను, డబ్బు తగినంత లేకపోవడంవల్లను, అన్ని పరిశ్రమలకు కలిపి కేవలం రు. 19.43 కోట్లు, పెద్ద తరహా, మధ్య తరహా పరిశ్రమలకు 6.76 కోట్లు కేటాయించడం సాధ్యమైంది.

ఈ సమీక్షించబడుతున్న సంవత్సరములో మన రాష్ట్రం పారిశ్రామికంగా వెనుకబడి వుండడానికిగల కారణాలను పరిశీలించి వాటిని తొలగించడానికి గట్టి కృషి జరిగింది. భౌగోళిక స్థితి, ప్రకృతి సిద్ధంగావున్న అనేక సదుపాయాలు సువిశాలమైన ఖనిజ సంపద, వీటన్నిటి మూలంగా మన రాజ్యానికి అపారమైన పారిశ్రామికావకాశాలు ఉన్నసంగతి అందరూ అంగీకరించిందే. అయినప్పటికి మన రాజ్యం వెనుకబడి వుండడానికి ఈ దిగువ తెలిపినవి ముఖ్యకారణాలు కావచ్చు.

1. అవసరమైన పారిశ్రామిక వాతావరణం కొంతవరకు కొరవడి ఉండడం.

2. రాజ్యంలో పరిశ్రమలు నెలకొల్పడానికి పారిశ్రామికులను ప్రోత్సహించే అంశాలు లేకపోవడం పైగా నిరుత్సాహపరిచే అంశాలు సహితం ఉండడం.

3. ప్రైవేటు రంగంతో ఎప్పుడూ సంబంధం కలిగివుంటూ గట్టి ప్రోత్సాహాన్ని చేకూర్చడానికి అవసరమైన సాంకేతిక సలహాలు ఆర్థిక సహకారం, అందజేయగల యంత్రాంగం లేకపోవడం.

ఈ మార్గాలలోను, ఇందుకు సంబంధించిన మార్గాలలోను ఈ సమస్యను ఎదుర్కోవడం జరిగింది. మన ఆంధ్రప్రదేశ్‌లో తగు పారిశ్రామిక వాతావరణం ఏర్పరచడానికి, ఇక్కడ కేంద్ర ప్రభుత్వానికి చెందిన పెద్ద ప్రాజెక్టుల్లో కొన్నింటిని నెలకొల్పేటట్లు చేయడం వొకమార్గం. ఇలా ఏర్పరచడంవల్ల మనరాజ్యంలో అనేక అనుబంధ పరిశ్రమలు వర్థిల్లడానికి అవకాశం ఏర్పడి, ఈ రాజ్యానికి దేశ పారిశ్రామిక రంగంలో తగు స్థానం ఏర్పడుతుంది. హైదరాబాదులో రూ. 10 కోట్ల ఖర్చుతో సింథెటిక్ డ్రగ్ ప్రాజెక్టును నెలకొల్పాలని ఈ ప్రభుత్వం కేంద్రాన్ని ఒప్పించడానికి కృషి చేసింది. రూ. 35 నుండి 40 కోట్ల వరకు ఖర్చుకాగల భారీ విద్యుత్ పరికరాల రెండో ఫ్యాక్టరీని హైద్రాబాద్‌లో స్థాపింప చేయడానికికూడా రాజ్య ప్రభుత్వం తీవ్రకృషి సల్పింది. ఈ ఫ్యాక్టరీకి అనువైన స్థలం గురించి సిఫారసుచేసే బాధ్యత అప్పగించబడ్డ భారత ప్రభుత్వానికి చెందిన సంఘంవారికి అన్ని సౌకర్యాలు సమకూర్చ బడ్డాయి. ఇతర రాజ్యాలలో ఉన్నట్లు వాస్తవానికి మనరాజ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన పెద్ద తరహా ప్రాజెక్టు ఏదీ లేనందువలన అట్టి ప్రాజెక్టును ఈ రాజ్యంలో స్థాపించాలని రాజ్య ప్రభుత్వం భారత ప్రభుత్వాన్ని గట్టిగా అర్థించింది. నెలకొల్పబోయే ఇతర కేంద్ర ప్రాజెక్టులను గురించి కూడా ఈ ప్రభుత్వం జాగ్రత్తగా దృష్టిలో పెట్టుకునే ఉంది. వాటిలో దేనినైన ఈ రాజ్యంలో నెలకొల్పాలని కోరేందుకు తగిన ఏ అవకాశాన్నీకూడా జారవిడుచుకోం. ప్రిసిషన్ పరికరాల ఫ్యాక్టరీ పెట్టడానికి సాధ్యమైన స్థలాలను గురించి తగు సమాచారంతో భారత ప్రభుత్వానికి తెలియజేయబడింది.

ఇక నిరుత్సాహపరిచే అంశాలను తొలగించే విషయం — విద్యుచ్ఛక్తి సరఫరాకు ఆంధ్రప్రదేశ్‌లో విధింపబడే రేట్లు చాలా

ఎక్కువగా ఉన్నాయని పారిశ్రామికులు చేసే ఫిర్యాదును ప్రభుత్వం పరిశీలించింది. ఇరుగు పొరుగు రాజ్యాలలో అమలులో వున్న రేట్లకు సరిపోయే రేట్లను మనరాజ్యంలోకూడా ప్రవేశపెట్టాలని నిర్ణయించబడింది. ఇందుకు సంబంధించిన సమగ్రమైన షెడ్యూలు పూర్తికావచ్చింది. ఇదే విధంగా అమ్మకపు పన్ను పరిశ్రమలకు సంబంధించినంతవరకు దానిని తగు విధంగా సర్దుబాటు చేయాలని కూడా ప్రభుత్వం సూత్రప్రాయంగా నిశ్చయించింది. ఈ విషయంలో అవసరమైన వివరాలను తయారుచేస్తున్నారు. భూముల ధరలలో కానవస్తున్న స్పెక్యులేషన్ను అరికట్టడానికి ప్రభుత్వం పారిశ్రామిక ప్రాంతంలో ప్రథమంగా 2,000 ఎకరాల భూమిని కొని, క్రొత్త పరిశ్రమలకు ఆ భూమిని సరసమైన ధరలకు ఇచ్చేటందుకు కూడా నిర్ణయించింది. విద్యుచ్ఛక్తి పంపిణీ విషయంలో కూడా పరిశ్రమలకు అత్యంత ప్రాధాన్యం ఉండేటట్లు ప్రభుత్వం నిర్ణయించింది.

రాజ్యంలో పారిశ్రామికాభివృద్ధి చాలినంతగా జరగని ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం కొన్ని సదుపాయాలు కలుగచేసినంత మాత్రాన చాలదని ప్రభుత్వం భావించింది. పారిశ్రామికులను క్రియాత్మకంగా ప్రోత్సహించి, రాజ్యంలో ఎక్కువగా పరిశ్రమలను నెలకొల్పడానికి వారిలో ఆసక్తిని కలిగించడం ముఖ్యమని ప్రభుత్వం తలంచింది. కార్పొరేషన్లను నెలకొల్పడం ఇందుకొక మార్గం. ఈ కార్పొరేషన్లు అనుకూలంగాను ఆర్థికస్తోమత గలవిగాను ఉండే ప్రాజెక్టులను రూపొందించి వాటిని ఆసక్తిగల పారిశ్రామికులకు ఇవ్వవచ్చును. కార్పొరేషను తగిన సందర్భాల్లో కొంత ఆర్థిక సహాయంకూడ చేయవచ్చు. దీని కనుగుణంగా దిగువ తెలిపిన మూడు కార్పోరేషనులు నెలకొల్పబడ్డాయి.

1. ఆంధ్రప్రదేశ పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషను - దీని అధికారం పొందిన మూలధనం రూ. 3 కోట్లు, ప్రారంభ మూలధనం 1 కోటి.

2. లఘు పరిశ్రమల కార్పొరేషను - దీని అధికారం పొందిన మూలధనం రూ. 50 లక్షలు.

(3) ఆంధ్రప్రదేశ గనుల కార్పొరేషను - దీని అధికారం పొందిన మూలధనం రూ. 50 లక్షలు.

ఆంధ్రప్రదేశ పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషను 16-12-1960 తేదీన రిజిస్టరు అయింది. ఇది అప్పుడే రెండుసార్లు సమావేశమయింది. ఇపుడే కార్పొరేషను కొన్ని ప్రాజెక్టుల స్థాపనగురించి చర్యలు తీసికొంటుంది. లఘుపరిశ్రమల కార్పొరేషను 1-3-1961 తేదీన రిజిష్టరుఅయింది. దీని డైరెక్టర్ల బోర్డు మొదటి సమావేశం త్వరలోనే జరగగలదు. ఆంధ్రప్రదేశ గనుల కార్పొరేషను 23-2-1961 తేదీన రిజిస్టరు అయింది. దీని డైరెక్టర్ల బోర్డు మొదటిసమావేశం 9-3-1961 తేదీన జరిగింది. చాల ప్రాజెక్టులను సత్వరమే ప్రారంభించడానికి ఈ సమావేశంలో నిర్ణయించారు.

పరిశ్రమల స్థాయీ సలహా సంఘం, మూడు ఉపసంఘాలను ఏర్పాటుచేసింది. ఈ సలహాసంఘం ఈ సంవత్సరములో రెండుసార్లు సమావేశమయింది. ఈ సంఘంవారు చేసిన ఉపయోగకరమైన పెక్కు సూచనలను పరిశ్రమలశాఖ డైరక్టరు కార్యాలయంలో పరిశీలింపబడుతున్నాయి.

హైద్రాబాదు, సికింద్రాబాదు నగరాలకోసం ఈ సంవత్సరంలో పారిశ్రామిక సమన్వయ సంఘం ఒకటి ఏర్పాటయింది. ఈ జంట నగరాల్లో పరిశ్రమల కనువైన స్థలాలను కేటాయించి, విద్యుచ్ఛక్తి, నీరు, కార్మికుల వసతి మొదలైన అవసర సదుపాయాలను సమకూర్చడమే ఈ సంఘం ప్రధాన ఆశయం. ఇదే పద్ధతి మీద జిల్లాలలో ఇటువంటి సంస్థలను నెలకొల్పటానికి ఏర్పాట్లు జరిగాయి.

పబ్లికురంగంలో కార్యకలాపాలు అధికం అవుతూవుండడం వల్ల అనుభవజ్ఞులైన మేనేజర్ల కొరతను తీర్చటానికిగాను ఆట్టి పదవులకు తగివుండే కొందరు అధికార్లకు పారిశ్రామిక మేనేజిమెంటులో శిక్షణ ఈయబడుతున్నది.

(1) పబ్లికు రంగంలో పెద్దతరహా పరిశ్రమలు

(ఎ) పరిశీలనలో వున్న పెద్దతరహా క్రొత్తపరిశ్రమలు

ఇనుము, ఉక్కు, దుక్కఇనుము యంత్రాగారం: ముఖ్యంగా కేంద్రానికి చెందిన పబ్లికురంగంలో ఒకచిన్న ఇనుము ఉక్కు యంత్రాగారాన్ని నెలకొల్పవలసిందిగా ఈ ప్రభుత్వం భారతప్రభుత్వాన్ని కోరుతున్నది. ఈ యంత్రాగారానికి కావాల్సిన ముడి ఇనుము, బొగ్గు, సున్నపురాయి ఈ రాజ్యంలో లభ్యమవుతాయనికూడా సూచించాం. అయితే భారతప్రభుత్వంవారు దుక్క ఇనుము కర్మాగారాన్ని నెలకొల్పటానికి ఆలోచిస్తున్నారు. ఈ విషయాన్ని భారతప్రభుత్వంవారికి చెందిన సంఘం ఒకటి ప్రస్తుతం పరిశీలిస్తున్నది. ఆ సంఘంవారు 1960 అక్టోబరు మాసంలో హైద్రాబాదువచ్చి కొంత సమాచారాన్ని సేకరించారు.

సంఘంవారి సూచనలప్రకారం ముడి ఇనుం, బొగ్గు, సున్నపురాళ్ల మచ్చులు ఎక్కువగా పరిశీలనార్థం జంషెడ్‌పూర్‌లో ఉన్న ప్రయోగశాలకు పంపబడుతూ వున్నాయి. ఈ లోగా ప్రయివేటు రంగంనుంచి దుక్కఇనుము కర్మాగారం విషయంలో ఈ ప్రభుత్వానికి ఒక పథకం అందింది. అది పరిశీలనార్థం భారతప్రభుత్వానికి పంపబడింది.

(2) లో టెంపరేచరు కార్బొనైజేషను యంత్రాగారం

రోజుకు 800 టన్నులు ఉత్పత్తిచేసే ఈ యంత్రాగారానికి సంబంధించి ఈ ప్రభుత్వం సమర్పించిన పథకాన్ని ఆమోదించ లేదని భారతప్రభుత్వంవారు ప్రకటించారు. అయితే దాన్ని ఇపుడు తిరిగి పరిశీలిస్తామని వారు మాట ఇచ్చారు. అందుచేత తిరిగి అ ప్రతిపాదన వారికి పంపడం జరిగింది. ఈ ప్రాజక్టుకు ఆర్థిక సహాయాన్నిచ్చి, నడపటానికి భారతప్రభుత్వం వారికి వీలులేక పోయినట్లయితే, సింగరేణి బొగ్గుగనుల కంపెనీవారు ఈ ప్రాజక్టును చేపట్టేటట్లుగా చేయటానికి కృషిచేస్తాం.

(3) షక్కెరనగరు వద్ద చెరకుపిప్పినుండి రోజుకు వందటన్నుల కాగితం ఉత్పత్తిచేసే యంత్రాగారం

ఇందుకు సంబంధించిన ప్లానును పరిశీలించటానికి ప్రభుత్వం నియమించిన సంఘంవారు తమ తాత్కాలిక నివేదికను సమర్పించారు. ప్రభుత్వంతోపాటు నిజాంషుగర్ ఫ్యాక్టరీకూడా ఈ విషయంలో కలుగచేసుకొని అవసరమయ్యే విదేశీ సహకారం, విదేశీరుణాన్ని సంపాదించి యంత్రాగారాన్ని నెలకొల్ప గలుగుతుందని ఈ నివేదికలో సూచించారు. అయితే తర్వాత ప్యాకేజి డీలువిషయంలో ప్రయివేటు కంపెనీ తన సంసిద్ధతను తెలియపరిచింది. కాగితంకోసం కొంత, రేయానుకోసం కొంతగుజ్జును ఉత్పత్తి చేసేటందుకు సుమారు 20 కోట్ల పెట్టుబడి ఖర్చుతో మూడు యూనిట్లు ఈ ప్యాకేజి డీలులో వుంటాయి. ఈ కంపెనీ చేసిన ప్రతిపాదన మనరాజ్య పారిశ్రామికరంగానికి బాగా దోహదకారి కావడంవల్ల, సంఘంవారి తాత్కాలిక సిఫార్సులమీద ఏదైనా నిర్ణయాన్ని తీసికొనేముందు ఈ విషయాన్ని గురించి పరిశీలించాలని నిర్ణయించడమైంది. ఈ విషయంలో అంతిమ నిర్ణయం బహుశా 1961 మార్చి అంతంలోగా తీసికోబడుతుంది.

బి-1 :- ప్రస్తుతం ప్రభుత్వం శాఖాపరంగా నిర్వహిస్తున్న పరిశ్రమలు.

(1) ఆంధ్ర పేపరుమిల్లు
(2) గూడూరు పింగాణి, గ్లాసు ఫ్యాక్టరీ
(3) బోధనులోని పవరు ఆల్కహాలు ఫ్యాక్టరీ

ఆంధ్ర పేపరు మిల్లు

ప్రస్తుతం రోజుకి ఆరు టన్నుల కాగితం ఉత్పత్తిచేసే ఈ మిల్లు ఉత్పాదక శక్తిని, 65 టన్నులవరకు పెంచే విస్తరణ పథకాన్ని అమలులో పెట్టేటందుకు, రూ. 2.93 కోట్ల విలువచేసే యంత్రసామగ్రి కోసం, ఒక విదేశి కంపెనీకి ఆర్డరు ఈయబడింది. ఈ ఎక్కువ ఉత్పత్తి రెండు సంవత్సరాల కాలంలో సాధించబడవచ్చు. ఈ మిల్లు 1958-59 సంవత్సరంలో రూ. 1.83 లక్షల లాభాన్ని గడించగా 1959-60 లో రూ. 3.84 లక్షల లాభాన్ని గడించింది. దీని మేనేజిమెంటు స్వరూపాన్ని జాయింటు స్టాకు కంపెనీగా మార్చేటందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ఆర్టికల్సు ఆఫ్ ఎసోసియేషను, మెమోరాండం రూపొందించబడ్డాయి.

గూడూరు పింగాణి ఫ్యాక్టరీ, గ్లాసు ఫ్యాక్టరీ

ఈ రెండింటిని సమిష్టి జాయింటుస్టాకు కంపెనీగా మార్చ వలసివుంది. గూడూరు పింగాణి ఫ్యాక్టరీ, ఈ సంవత్సరంకూడా తన యథాస్థితిని కాపాడుకుంటూ వచ్చింది. కాని దాన్ని విస్తరింపజేయటానికి చర్యలు తీసుకొనబడుతున్నాయి. ఈ ఫ్యాక్టరీ హై టెన్షను ఇన్సులేటర్లను ఉత్పత్తి చేయగలదా అన్న విషయం పరిశీలించబడుతున్నది. గ్లాసు ఫ్యాక్టరీ ఈ సంవత్సరం ఉత్పత్తి నిరుత్సాహకరంగావుంది. దానికి కారణం కొంతవరకు బొగ్గు నాశిరకంగావుండటం సమయానికి సరఫరా కాకపోవడం. బొగ్గుకు బదులుగా ఆయిల్ బర్నరును వాడుతూ మరికొంత విస్తరింపచేయడంతో ఈ గ్లాసు ప్లాంటు ఇకముందు మరింతగా ఉత్పత్తిని సాధించగలదని ఆశింపబడుతున్నది.

ప్రభుత్వ పవరు ఆల్కహాల్ ఫ్యాక్టరీ

రూ. 9.62 లక్షల ఖర్చుతోకూడిన విస్తరణ పథకం పూర్తి అయింది. దీని ఫలితంగా ఈ ఫ్యాక్టరీ ఉత్పత్తి రెండితలు పెరిగింది. ఈ ఫ్యాక్టరీ ప్రస్తుతం సంవత్సరానికి 15 లక్షల గాలన్లు ఆల్కహాలును ఉత్పత్తి చేస్తున్నది. ఈ ఫ్యాక్టరీ 1959-60 లో రూ. 4.4 లక్షలు లాభం గడించింది. ఈ యేడు ఇంకా ఎక్కువగా లాభాలు రాగలవని ఆశించబడుతున్నది.

ప్రభుత్వానికి మూలధనంలో పెద్ద వాటాగాని, తగినంత వాటాగాని ఉన్న పరిశ్రమలు

నిజాం షుగరు ఫ్యాక్టరీ — ఇందులో ప్రభుత్వానికి 76% వాటా మూల ధనమువుంది. 30-6-1960 తో అంతమయ్యే సంవత్సరంలో ఈ కంపెనీ రూ. 63.11 లక్షల భారీ నికరపు లాభాన్ని గడించింది.

ఈ కంపెనీ డైరెక్టర్లబోర్డులో ప్రభుత్వ సభ్యులే ఎక్కువమంది వున్నారు. ఛైర్మను, మేనేజింగు డైరెక్టరు యిద్దరుకూడా రాజ్య ప్రభుత్వానికి చెందిన అధికారులే.

సింగరేణి బొగ్గుగనుల కంపెనీ లిమిటెడ్ : దీనికి చెల్లించిన మూలధనంలో 53.3 శాతం రాజ్యప్రభుత్వానికి (కేంద్రానికి 40 శాతం వాటావుంది) 1959 లో ఈ కంపెనీ దాదాపు 2.3 మిలియను టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. 1960 లో 2.5 మిలియను టన్నుల్ని ఉత్పత్తి చేసింది. 1959 లో యిది రూ 38 లక్షల నికరపు లాభం పొందింది. డైరెక్టర్ల బోర్డులో ప్రభుత్వ సభ్యులే ఎక్కువ మందివున్నారు. ఛైర్మను, మేనేజింగు డైరెక్టరు యిద్దరుకూడా ప్రభుత్వాధికారులే.

ప్రాగాటూల్స్ కార్పొరేషను: ఈ కంపెనీ వాటా మూలధనంలో రాజ్యప్రభుత్వానికి 35 శాతం వాటావుంది. దీనిలో కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ వాటాలున్నాయి. 1958-59 సంవత్సరంలో రూ. 4.91 లక్షలు లాభంరాగా 1959-60 లో 31-3-1960 నాటికి అంతమయ్యే తొమ్మిది నెలల్లోను ఈ కంపెనీ రూ. 3.34 లక్షల లాభాన్ని సంపాదించింది.

రెండు కోట్ల రూపాయిల ఖర్చు అంచనాతో పెద్ద విస్తరణ కార్యక్రమాన్ని కంపెనీ రూపొందిస్తూంది.

అజం జాహీ మిల్లులు : ఈ మిల్లులవాటా మూలధనంలో రాజ్య ప్రభుత్వానికి 36.63 శాతం వాటావుంది. దీనికి మేనేజింగు ఏజెంటుగా వున్న ప్రభుత్వం కంపెనీల చట్టం నిబంధనల క్రింద 1960 ఆగస్టు 15 వ తేదీన తన మానేజిమెంటును వదులుకున్నది. బట్టల ధర పడిపోవడంతో విషమ పరిస్థితి ఏర్పడినప్పటికీ 1959-60 వ సంవత్సరానికి ఈ కంపెనీ లాభాలు దాదాపు 6½ లక్షల రూపాయలు వుంటాయని ఆశించబడుచున్నది. 1958-59 వ సంవత్సరానికి రూ. 1.22 లక్షలు మాత్రమే లాభాలు వచ్చాయి.

ఆల్విన్ మెటల్ వర్క్సు : ఈ కంపెనీలో ప్రభుత్వం 49.33 మేరకు పెట్టుబడిని పెట్టింది. హైద్రాబాదు ఏజెన్సీస్ ప్రైవేటు లిమిటెడ్‌వారు ప్రస్తుతం దీనికి మేనేజింగు ఏజెంట్లుగా వున్నారు. 30-4-1959 లో అంతమయ్యే సంవత్సరంలో రూ. 7.19 లక్షలు నష్టం రాగా ఈ కంపెనీ 1959-60 సంవత్సరంలో రూ. 5.20 లక్షల నికరపు లాభాన్ని గడించింది.

ఈ కంపెనీ వివిధ విస్తరణ పథకాలనుగూర్చి ఆలోచిస్తోంది. ఈ పథకాలు స్కూటర్లు, తీగెపగ్గాలు, ఖాదీ, రసాయనిక పరిశ్రమల కోసం యంత్రాలను తయారుచేయడం మొదలగువాటికి సంబంధించి వున్నాయి.

హైదరాబాదు రసాయనిక ద్రవ్యాల ఎరువుల సంస్థ: రూ. 25.62 లక్షల మొత్తం మూలధనంలో రాజ్యప్రభుత్వం రూ. 12.85 లక్షలు పెట్టుబడిపెట్టింది. కంపెనీ ప్రతిదఫా నష్టపడుతుండడంవల్ల మొత్తం రూ. 15.3 లక్షలు నష్టం వచ్చినప్పటినుంచీ కంపెనీ వ్యవహారాలను రాజ్యప్రభుత్వం చూస్తుంది. ప్రభుత్వాధికారి ఒకరు దీనికి మేనేజింగు డైరక్టరుగా నియమించబడ్డారు. 31-3-60 తేదీతో అంతమయ్యే సంవత్సరంలో ఈ కంపెనీకి రూ. 1.52 లక్షల నికర లాభం వచ్చింది.

సల్ఫ్యూరిక్ ఏసిడ్, సూపర్ ఫాస్ఫేటులను ఉత్పత్తి చెయ్యడానికి కంపెనీ ఒక విస్తరణ కార్యక్రమాన్ని తలపెట్టింది. ఈ విస్తరణ కార్యక్రమం 1962 నాటికి పూర్తవుతుందని ఆశించబడుతోంది.

(బి) III. *ప్రభుత్వానికి పెద్ద వాటా లేకపోయినప్పటికీ వారికి తగినంత వాటా వుండి, అప్పులద్వారా ప్రభుత్వం సహాయపడుతున్న సంస్థలు.*

సిర్‌పూర్ పేపరు మిల్లులు. —ఈ కంపెనీ వాటా మూలధనంలో ప్రభుత్వానికి 15.7 శాతం వాటా వుంది.

30-6-1960 నాటికి అంతమయ్యే సంవత్సరంలో ఈ కంపెనీకి రూ. 19.5 లక్షల లాభం వచ్చింది. ఈ కంపెనీ మరికొన్ని విస్తరణ కార్యక్రమాలు తలపెడుతూంది.

సర్‌సిల్క్ లిమిటెడ్

ఈ కంపెనీ వాటా మూలధనంలో రాజ్య ప్రభుత్వానికి 19.09 శాతం వాటా ఉంది. ప్రభుత్వం కంపెనీకి రూ. 3.45 కోట్ల అప్పు కూడా ఇచ్చింది. ఈ అప్పు కొన్ని నిర్ణీత వాయిదాలలో తిరిగి చెల్లించవలసి ఉంటుంది. ఈ కంపెనీకి 1956-57 లో రూ. 0.49 లక్షలు 1957-58 లో రూ. 5 లక్షలు లాభం రాగా, 1958-59 లో

రూ. 14.87 లక్షలు 1959-60 లో రూ. 3.60 లక్షల లాభం వచ్చింది.

ఈ వివరణలోని భాగాలలో తెలియపరచిన అంశాల దృష్ట్యా బహుశా భవిష్యత్తులో చాలకాలంవరకు రాజ్య పారిశ్రామికాభివృద్ధి ప్రయివేటురంగంలో జరిగే అభివృద్ధిపైనే ఆధారపడి వుంటుందని గ్రహించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని భారీపరిశ్రమలను నెలకొల్పే విషయంలో పారిశ్రామికవేత్తలు గత నాలుగు మాసాల నుంచి కనబరుస్తున్న శ్రద్ధాసక్తులు హర్షించదగ్గవి. అందులో ఈ క్రింది అంశాలను పేర్కొనవచ్చును.

దాదాపు రూ. 5 కోట్ల పెట్టుబడితో బహువిభాగ ప్రాజెక్టును నెలకొల్పడంకోసం ఒక ఇంజనీరింగుసంస్థ హైదరాబాదులో భూమి సేకరిస్తోంది.

పోలీస్టేరిన్ పరిశ్రమ నెలకొల్పడంకోసం ఒక రసాయనిక పరిశ్రమ సంస్థ లైసెన్సును సంపాదించింది. ఈ పరిశ్రమ బహుశ విశాఖపట్నంలో నెలకొల్పబడవచ్చు. దీనికి పెట్టుబడి దాదాపు రూ. 5 కోట్లు వుంటుంది.

ఆస్బెస్టస్ ప్రోసెసింగు పరిశ్రమను నెలకొల్పే ప్రతిపాదన ఒకటి వుంది. ఇది కడప జిల్లాలో నెలకొల్పబడవచ్చు. దీనికి రూ. 7 నుండి రూ. 8 కోట్ల వరకు పెట్టుబడి ఖర్చుకాగలదు.

మాలియబుల్ కేస్టింగులు, సైకిలు భాగాలు ఉత్పత్తి చేయడానికి మరో సంస్థ లైసెన్సును పొందింది. నూలు మిల్లులు, సిమెంటు ఫ్యాక్టరీలు, పంచదార ఫ్యాక్టరీలు నెలకొల్పడానికి దరఖాస్తులు చాలా వచ్చాయి. చిన్నతరహాగా అయినప్పటికీ విశాఖపట్నంలో ఒకటి, గుడివాడలో ఒకటి పోతఇనుము గొట్టాలను ఉత్పత్తి చేయడానికి పథకాలు ఉన్నాయి. విద్యుద్ డెటొనేటర్ మొదలగు వాటి ఉత్పత్తి కోసం మరో సంస్థ హైదరాబాదులో నెలకొల్పడానికి భావించబడుతుంది. వపరుటిల్లర్ల ఉత్పత్తి పథకానికికూడ అవకాశం వుంది. భారీ సెల్యులోస్ ఎసిటేట్ ఫ్యాక్టరీని నిర్మించే ప్రతిపాదనకూడ ఒకటి వుంది. ఇది పూర్తిగా అభివృద్ధిచెందేటప్పటికి దీనికి దాదాపు రూ. 10 కోట్ల పెట్టుబడి అవుతుంది.

పై అంశాలను పరిశీలించినట్లయితే అద్యతనభావిలోనే మన ఆంధ్రప్రదేశ రాజ్యంలో అనేక పరిశ్రమలు పెంపొందగలవని విదితమవుతున్నది గదా ?

(1961 మార్చి 21 వ తేదీన ముఖ్యమంత్రి రాష్ట్ర శాసనసభలో చేసిన విధాన ప్రకటన)



మనస్సు సామాన్యమైన అవసరాలతో తృప్తిపడి ఉంటానికి ఒక్కసారి నిరాకరిస్తే ఆపైన దానికి హద్దుపద్దు లుండవు. అందువల్ల మనస్సుకు మొట్టమొదటే చక్కని కట్టుబాట్లతోకూడిన అలవాట్లు చెయ్యడం చాలా అవసరం. స్వభావసిద్ధమైన పరిమితులకు కట్టుబడి ఉండాలనే నిరంతర జాగరూకత, నిగ్రహం మనస్సుకు అలవాటు చెయ్యాలి.

రవీంద్రనాథ్ టాగూర్

చైత్రలక్ష్మి

బి. ప్రసన్న

స్వర్గసౌందర్య సంపత్తి జల్లెడఁబట్టి పుడమిపై మరుఁడారబోసెనేమొ !
యుగయుగావిర్భూత మొకదివ్యసంగీత ఝరిలోకమున సుళ్లు తిరిగెనేమొ !
నందనారామ మందార మందానిలమ్మొరసి యీ నేల నిట్టూర్చెనేమొ !
చంద్రమండల సుధాసార శైత్యము క్రమ్మి భూగోళమే గగుర్పొడిచెనేమొ

దేవకన్యల పెదవుల తీయఁదనము
పూవు పూవున మధువుగా పొంగెనేమొ !
అనఁగ నింద్రియ మోహనం బగుచు వచ్చె
సంతసముతోడ * మధుర వసంత లక్ష్మి.

గున్నమావినిఁ జుట్టుకొనియున్న లేఁదీవె పులకరింతల కొక్క ప్రొద్దులేదు
శిలలకే గిలగింత గలిగించు కోయిల పడుచు పాటకుఁ దీటుఁబాటులేదు
తేనెముంపునఁ దిమ్మతిరుగుచు తుమ్మెదరేని పానగోష్ఠికి వేళపాళలేదు
ప్రసవాంగనల వెంటఁబడు గాలిపిల్లల మిడిసిపాటున కాటవిడుపులేదు

విరహిలోకమ్ము నెడపెడ వేటలాడు
కుసుమబాణుని కంటికిఁ గునుకులేదు
ప్రకృతి శృంగార విభ్ర మారంభములకు
నొక నిరుకులేదు మధుర మధూదయమున.

ఆ రావిపండు పండుటాకుల గలగలారావమ్ములో దయారసము పుట్టి
ఈ పల్లవించిన యెండుగొమ్మలలోన నవనవోజ్జీవ సౌందర్యములికి
ఆ మొగ్గ పరువు రక్తాశోకవల్లరి కై సేతలోన శృంగారమొలికి
ఈ దిగ్దిగంతమ్ములేలు పుప్పొడి దుమారమునుండి నవసుగంధములు తెరలి

వివిధ భావమ్ము లొరసి యుద్విగ్నమైన
సుకవి హృదయమ్ము పోలికఁ బ్రకృతియెల్ల
ప్రతిపదంబునఁ దన్మయత్వము భజించె
మధు విశేషమ్ములేక మైమఱపుగలదె ?

---

* మాధురీ చైత్రలక్ష్మి.

పరమ పదమ్ముకోసము ప్రపంచమురోసి యెడారి దారులం
బెరిగిన యోగులీ చిలిపి వెన్నెలలో మదన జ్వరమ్ము ము
మ్మరమయి గింగిరాల్ దిరిగి మౌనముగా దిగజారిరింక నె
వ్వరు తలక్రిందుగారు రసవ న్మధుమాసము సేయు మాయలన్ ?

వృక్షాగ్రంబుల మాటిమాటికి బడాయిం బల్లటీల్గొట్టి దే
హశ్శోభమ్మును దోపనీక మొనగాడై ముద్దుటిల్లాండ్రకున్
జతుః పర్వము జేయుచుండె కపివంశస్వామి యెవ్వండు స్వీ
య క్షుద్రత్వముఁ బైటవేసికొను భార్యాసన్నిధానంబునన్.

తనముఖ వర్ణమా! యెఱుపు దానికిదోడొక తీయదొండపం
డునుగొని వచ్చుచో నెవతెనో పతి కౌఁగిట జేర్చుకొన్న వాఁ
డని యొకకీర సుందరి-గయాళిది-కస్సునలేచిపోయె నె
మ్మనమెటు నిబ్బరించు ననుమాన పిశాచము పూను వారికిన్ ?

నవలావణ్యము రాశిపోసిన వసంతారామ మధ్యమ్ములో
కవి యొక్కండు కవిత్వ వస్తువులకై గాలించి యచ్చోటి పు
ష్పవతుల్ కోమల మాలతుల్ వలపుసూపన్ మ్రానుపాటందె చి
త్రవిచిత్రాంశము లిట్టి వేర్పడక చైత్రంబెట్లు చైత్రంబగున్.

అతఁడేమో రసరాజ్య నాయకుఁడు తానా రాగముంజూపపై
నతసుం డందల మెక్కు రోజులివి యాహా ! యేమి వైరాగ్య ప
ద్ధతి యా తుమ్మెద కల్ల సంపెఁగకు బద్ధద్వేషముల్ మీఱి భా
రత మంతైనది యారపీ సహజ వైరజ్యాలలేనాటికిన్.

అందమెగవోయుచున్న దుద్యాన వీథి
మిసమిసలు గుల్కు శైరీష కుసుమ పంక్తి
అమ్మ యొడిలోన వెన్నెల లారవోయు
పాల పాపాయి చిఱునవ్వు జాలువోలె !



"కర్షక పక్షపాతి" కవికోకిల

కె. వి. రమణారెడ్డి

"ఎన్ని యిక్కట్టులుండిన, నేమియైనఁ
గుడువఁ గట్టను నొకవేళఁ గొదవయైనఁ
బ్రకృతి సామీప్య జీవనభాగ్య మొకటె
యున్న కడగండ్ల మరపించు, నూఱడింపు.

—1924

1950 వ సంవత్సరం మార్చి నెల.... వాల్తేరు.... ఆంధ్రవిశ్వ విద్యాలయ కళాశాలలో చరిత్ర విద్యార్థినైన నేను పరీక్ష వ్రాస్తున్నాను. నా ప్రక్క ఒక తెలుగు విద్యార్థి కూర్చుని ఉన్నాడు. పరీక్షాధికారి పరధ్యానంగా ఉన్న సమయంలో, రహస్యంగా, తెలుగులో 'పాస్టొరల్' పొయిట్రీ అంటే ఏమిటండీ, అని అడిగాడు. ఒక్క క్షణం ఆలోచించాను. కవికోకిల వ్రాసిన 'కృషీవలుడు,' పటుకూరి వెంకటనరసయ్యగారి 'క్షేత్ర లక్ష్మి,' తుమ్మల సీతారామమూర్తిగారి ఖండ కావ్యాలు కొన్ని అని ముక్తసరిగా తేల్చిచెప్పాను. బ్రతికించారు అన్నట్లు తృప్తిపడి, తలవూపి, తిరిగి తన పనిలో తలమునకలై పోయాడు ఆ మిత్రుడు.

నాటికీ నేటికీ నే నిచ్చిన జవాబు సరియైనదేనా అనే సంశయం నన్ను పీడిస్తూనే వుంది. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు "కృషీవలుడు" కావ్యానికి వ్రాసిన ఉపోద్ఘాతంలో "పాశుపాల్యాది గ్రామాంతర వృత్తులవారి అకృత్రిమ జీవిత స్వభావాదుల వర్ణించు కావ్యము"లని పాస్టొరల్ కావ్యాలకు అతి వ్యాప్తిగల నిర్వచనం యిచ్చారు. భాగవతములోని దశమ స్కంథము, విశేషించి, యెఱ్ఱాప్రగడ యొక్క హరివంశ పూర్వభాగము, గీతాగోవిందములను యీ నిర్వచనంలో బంధించారు. కృష్ణుని బాల్యక్రీడలు ఒక యెత్తు; రాస లీలలు మరొక యెత్తు. ఇంకనూ పశుపాలక దశలో వుండిన యాదవులను, పోతనగాని జయదేవుడుగాని విశ్వసనీయంగా నిర్వర్ణించలేదు. ఆ ఘనత ఎఱ్ఱాప్రగ్గడకే దక్కింది. సంస్కృత మూలం గురించి నాకు తెలియదు. కాని ఆంధ్రహరివంశంలో పాశుపల్య జీవితానికి సంబంధించిన అచ్చతెనుగు పదాలను ఎఱ్ఱన గ్రంథస్థం చేయగలిగాడంటేనే ఆయనకు సహస్రప్రణామాలు ఆచరించవలసి వుంటుంది. కాళిందీ తటాన నలుదెసల పొదవుగా నమర్చిన "బలితంపు ములు వెలంగులం గురంబు జతనంబులై యొప్పె పెనుదొడ్ల"లో "వేకువం బోకు మేసివచ్చి" విహితశయనలై యున్న కదుపులను ఆయన ఎంత తెలుగుమీరి వర్ణించాడని! పొదులనుండి దాటుకొని కలిసే బాలవత్సములు, వెదయావుల వెనుదగిలి కన్నుమిన్నెరుగని వృషభములు, తెవులు గొంటులు ....వల్లియలువేసి కోడెలను పట్టి పెనచి కాయూళ్ళజట్టి కారులకు వశము చేసేవారు, చికిత్సించేవారు, చేపెటిగించేవారు.... జలవాహికలు "దధి మథన వ్యాపారంబులం జాలఁ బారీణులగు బాలికలు" "ఘృతతక్ర విక్రయంబు గృహసమ్మార్జనంబు, శిశుసమాశ్వాసనంబు మొదలగు పనులం జిడిముడిపాటు పొలయ మెలంగు గరిష్ఠ కుటుంబినులు"....తరిత్రాళ్లు, చేతి కవ్వములు, దామెన కొయ్యలు ఉట్లు, బానలు, చలిది చిక్కములు, సెలగోలలు...జీవిత విధానం ఒకటి యింత సర్వలక్షణ సంపూర్ణంగా మరెక్కడనైనా చిత్రింపబడిందా? కృషి, పాశుపల్య జీవిత చిత్రణలను "పాస్టొరల్స్" అనే పేరున సంభావించటం తగునా? ప్రాచీన గ్రీకులాటిను సాహిత్యాలలో బయల్వెడలిన ఒకానొక ప్రత్యేక శాఖకు పెట్టిన యీ పేరు నిర్విచక్షణగా అరువు తీసికొనడం సరికాదు. పాశ్చాత్యుల భావనలో దీనికి కొన్ని లక్షణాలు యేర్పడినట్లు తెలుస్తుంది. కాలగర్భాన కలిసి విస్మృతమైపోయిన, లేదా చరిత్రకే చెందని ఒకానొక స్వర్ణయుగానికి సంబంధించిన భావంతోటి, పసుల మేపరుల బ్రతుకును, కృత్రిమ సాంప్రదాయిక రీతుల్లో వర్ణించే కావ్యాలను 'పాస్టొరల్స్' అంటారు. "A Poem, play or the like, in which the life of shepherds is portrayed often in an artificial and conventional manner; also extended

to works dealing with simple, rural and open air life" అని నిర్వచనం. అలెగ్జాండర్ పోప్ యీ నిబంధన చేశాడు. "The first rule of pastoral is that its idea should be taken from the manners of the Golden Age and the *moral formed upon the representation of innocence.*"

పాస్టొరల్ సారస్వతానికి బహుళ ప్రతిష్ఠను తెచ్చిపెట్టినది వెర్జిల్ అనే రోమన్ కవి. ఇతనిది ముఖ్యంగా వెనుక చూపు. తన పసితనాన కర్షకు లనుభవించిన శాంతి సౌఖ్యాలను, తర్వాత వాటికి మూడిన ముప్పులను పోల్చిచూచు కొన్నపుడు నేటి కంటె నిన్న మెరుగు అనిపించింది. పూర్వమెప్పుడో కృషీ వలుడు దివ్య సౌఖ్యాన తేలిపోయాడని ఒక లోకాన్ని కల్పించాడు. దాని పేరు ఆర్కాడీ. అది కలలసీమ కాదు. గ్రీసు దక్షిణ భాగాన పర్వత పరివేష్టితమై కొండచరియలు, పచ్చిక బయళ్లు, చిట్టడవులతోటి గ్రామీణ జీవనుల పాలిటి నందనవనంగా ఉన్న భూమిని ఆయన ఆదర్శీకరించాడు. ఈ ఆదర్శ లోకవర్ణన పోను పోను సంప్రదాయంగా ఘనీభవించింది (1)

అమాయక ప్రజల జీవిత చిత్రణమొక్కటే 'పాస్టొరల్' అనుకొంటే కవికోకిల పాస్టొరల్ కవిగా గణన కెక్కుతాడు. ఆయన "పచ్చపొలాలకాపు." ప్రకృతిమాత స్తన్యంబున ప్రబలినాడు. గ్రామవాసి. కైతవమే ఎరుగడు. పొలముల విహరిస్తూ ప్రొద్దుపుచ్చుతాడు. (2)

"నాకు ఒక కుగ్రామం నివాసం. ఇప్పటివరకూ నా జీవితమంతా ఆ గ్రామంలోనే కొనసాగిపోయింది. పరిసరాల ప్రభావం వల్లనో యేమో నా జీవితంలోను, కవిత్వంలోను గ్రామీణత్వం పరిస్ఫుటంగా అంకితమై ఉంటుంది." (3)

ఈ పరిసరాలలో నిరక్షరాస్యుడై కాపుకూడ కవికాగలడు. సరికదా, కవియైనవాడు ప్రకృతి పూజారి కాగలడు. రామిరెడ్డిగారు, కవి, చిత్రకారుడు; కాపువాడు, కవి; తాత్వికుడు, కవి. బహిరంతర ప్రకృతులకు రెంటికీ న్యాయం కల్పించేవాడు కవి. ప్రకృతిని రంగులలో బంధించేవాడు చిత్రకారుడు. రామిరెడ్డిగారు యీ రెండు కళలను చేబట్టినారు కనుక నే ప్రకృతిని మానవీకరించటానికి మానవుణ్ణి ప్రకృతిలో సముచిత స్థానాన నిల్పడానికి పూనుకొన్నారు.

"రమణీయ వస్తువులు తమంత తామే వర్ణనాయోగ్యము లయ్యును, అవి మానవ చర్యలకు భిత్తికయయి కావ్యవర్ణనలో మిళితమైనపుడు మరింత సుందరముగ నుండును. మానవ నాటక రంగమునకు బాహ్యప్రకృతి పరదావంటిది." (4)

వర్ణాలు, వర్షాలు, వెలుగులు, పూవులు, వాగులు, చేలు చుట్టూ ఉన్నా కాపువాడు యివేమీ ఎరుగనట్లు తన పనిలో తాను నిమగ్నుడౌతాడు. అతనికి "భావలోచనము" లేదు. అది సత్కవీశ్వరుని వద్ద ఎరవు తెచ్చుకొంటేనేగాని "అంతర్లీన కాంతిసరణి" కాపువాని భౌతిక నేత్రానికి కనిపించదు. కవి కాపువాడైనపుడు యీ చిక్కు లేదు. (5)

ఉత్తకవికి అందాలు మటుకే ఎదురౌతాయి; సుఖాలు మటుకే కనిపిస్తాయి గ్రామసీమలో. మెప్పులోపడి లొసుగులు మరచిపోతాడు. ఇంత చక్కని పండులో యీ పురుగు ఎట్లా దూరింది అని ప్రశ్నించడు. తీయన చెడకుండా పురుగును నిర్మూలించడమెట్లాగని ఆలోచించడు. అతడు తాత్వికుడై తేనే తప్ప ఆశ్చర్యార్థకంలోనుంచి ప్రశ్నార్థకంలోకి పయనించలేడు. ప్రశ్నార్థక చిహ్నంనుంచి కార్యం ఫలించినప్పుడే, గుణాగుణ చర్చకు సార్థక్యం కలుగుతుంది. దారిద్ర్యం, అజ్ఞానం, వ్యసనం పీడనవంటి విషక్రిములకు గ్రామ సీమ ఆలవాలమై వున్నదని కవి కోకిల ఆవేదన. ఆయనది పశ్చాద్దృక్కు కాదు. స్వర్ణయుగం ఆయనకు నిన్నటి సంఘటన కాదు; రేపటిది. అది అమాయకత అనే అజ్ఞానానికి గొడ్డలిప్రేటు. జీవనం సంగ్రామంగా పరిణమించింది. మాత్స్యన్యాయం సామాన్యమైంది. ముందు బడినవాడు ముందు; వెనుక బడినవాడు వెనుక.

"మన జీవనము యుద్ధమనగ జెల్లు, దానిలో
నగ్రగామి యొపొందు నధిక ఫలము." (6)

కాబట్టి స్వవృత్తి పరవృత్తి అనే చిన్న చూపుమాని "సర్వతోముఖ కార్యదీక్షత" అలవరచుకోవాలి కర్షకులు. పూర్వులు కత్తులు కలములు, హలములు నడుప నేర్చినట్లు, శౌర్యము, విద్య, బుద్ధి సమార్జించుకోవాలి. కర్షక జనాభిమానమే రామి

(1) Pastoral poems of Virgil: Introduction by Dr. E. V. Rieu.
(2) కవితా ప్రణయిని : ఖండ కావ్యములు. పుట 50 (3) నా కవితాను భవములు : వ్యాసములు. పుట 222 (దువ్వూరి రామిరెడ్డి)
(4) నేటికవిత : ప్రకృతిపూజ. (5) కృషీవలుడు (6) రెడ్డికుల ప్రబోధము : ఖండకావ్యములు (పుట 266)

రెడ్డిగారి మతము. అది పక్షపాతమని యితరు లనుకొంటే అనుకోనీ! ఈ గాఢ విశ్వాసమే ఆయనను జస్టిస్ పార్టీవైపు లాగింది. కర్షక మతావేశాన పడినప్పుడు ఆయనకు భూస్వామికీ రైతుకూ గల తేడా కనిపించలేదు; వ్యవసాయానికి అర్థికరంగాన గల సముచిత స్థానం, పరిశ్రమలకూ వ్యవసాయానికీ ఉన్న సమన్వయ దృష్టి తోచలేదు. కృషీవల జీవితాన్ని సౌజన్యపర సీమగా వర్ణించాడు. రైతుల సంకుచిత స్వభావం, పరిణామ ప్రాతికూల్యం, అల్పబుద్ధి, నైరంకుశ్యం, ఆయన చూపునుండి జారిపొయ్యాయి. "నిర్ఝర సారవేగమున వాక్ప్రసరంబు మాధుర్య సంపన్నంబై ప్రవహించు" నప్పుడు, పుల్లలు, పుడకలు అడ్డు తగలవుకదా !

> నైరికా, నీవు భారత ధాత్రలాత్మ
> గౌరవ పవిత్రమూర్తివి ! శూరమణివి !
> ధారుణీపతి పాలన దండ మెపుడు
> నీ హలంబు కన్నను ప్రార్థనీయ మగునె," (7)

సాంఘిక సౌభాగ్య సౌఖ్యాలకు కృషీవలుడే కారణమట; కృషి సకల పరిశ్రమలకు కీలు చీల అట; ఇది అతిశయోక్తి కావచ్చునేమో కాని అనృతోక్తి కాదు. India is a land of villages- అన్నమాట యీ నాటివరకూ నిజమైన మాట. కాని నాగర జీవనం పరిశ్రమావ్యవస్థ మొదలవుతున్నపుడు వ్రాసిన యీ కావ్యం క్రొత్తధోరణులపై యేవగింపుతోపాటు భయాన్ని వెల్లడిచేస్తున్నది. 19వ శతాబ్ది ప్రథమ పాదంలో, ఇంగ్లండులో పారిశ్రామిక విప్లవం పుంఖృతమైనప్పుడు, ప్రకృతినీ, ప్రశాంతినీ గ్రామాన్నీ ప్రేమించిన రొమాంటిసిస్ట్ కవులలోకూడ యీభయమూ, వైముఖ్యమూ పొడసూపాయి. "It was as if, frightened by coming industrialism and the night-mare towns of industry, they were turning to nature for protection" (Leslie Stephen). నవ్యపాశ్చాత్య నాగరకత పల్లెల మీద దాడి చేసి, "కాల సమ్మానితములైన గ్రామ పద్ధతుల" మీద విముఖత్వము కలుగజేసిందని ఆయన బాధపడ్డారు. (8) ఈ ఆవేదనలో మనమూ కొంత పంచుకోవచ్చు. భారతీయ గ్రామీణ వ్యవస్థలో సల్లక్షణాలు కొన్ని లేక పోలేదు గ్రామపంచాయితీలు, వీధి బడులు, ఒద్దిక నిష్కాపట్యము మున్నగు పడిపోయాయి. కాని గ్రామీణ వ్యవస్థ దేశాభివృద్ధికి గుదిబండకూడ. "కాల సమ్మానితము" లైనంత మాత్రాన అన్యాయము ఆధారంగా లేచిన వర్ణ వ్యవస్థవంటి సాంఘిక సంస్థలు కాళ్ళకు చుట్టుకొని పురోగతికి అడ్డుపడిన శిథిలాలను నిలుపుకోనడం అవివేకం. వృత్తులు జన్మను బట్టి నిర్ణీతాలు కాకుండా అవకాశం, సామర్థ్యంవంటి వాటినిబట్టి స్వీకార్యాలైనప్పుడు సంతోషించ వలసిందేకాని, విలపించ నవసరములేదు. ఇక కుయుక్తులు, వ్యాజ్యాలు, ఘోర్జరీలు పెచ్చు పెరిగాయి అంటే అది నాగరికత తప్పుకాదు. ధన వ్యవస్థవచ్చిపడి గ్రామజీవన సౌఖ్యాన్ని హరించిందని రామిరెడ్డి గారి ఫిర్యాదు. ఆదాయాలేమో పెరుగలేదు. అవశ్యక పదార్థ సంఖ్యయేమో పెరిగింది. Civilization is multiplication of wants అని యీ నడుమ జయప్రకాశ నారాయణ వంటి నాయకులు నిర్వచనాలిస్తూ, వాంఛా నిర్మూలనమే సౌఖ్యానికి రాజపథమని బోధిస్తున్నారు. Back to the village అనే నినాదంతోటి ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. రామిరెడ్డి గారి భావనకూడ యీ తెగకు చెందిందే. కాని తమ పసితనపు అసమగ్రమైన అవగాహనను జీవన సాయంకాలవేళ సరిదిద్దుకొని యీ మూర్ఖ పద్ధతిని ఖండించారు. "నగ్నయదార్థలోక గతి" ని చూచి తమ పూర్వాహంకారాన్ని విడచి కర్షక సంతాపానికి నిజమైన కారణాన్ని కనుగొన్నారు. గ్రామాలను దోచి నగరాలను మేపుతూ వ్యవసాయోత్పత్తి ధరలను నిబంధించి పరిశ్రమోత్పత్తి ధరలను పెంచుతూ ఉన్న పరాయి దొరతనపు స్వార్థదృష్టి మూలకారణంగా కనిపించింది.

> "దొరతన మొక్కవంక; తెగదోచు వణిగ్గణ మొక్క-
> వంక; ఈ తిరుగలిరాళ్ళ మధ్యఁబడి దీనులు రైతులు
> నుగ్గునూచలై తఱిగిరి నిస్సహాయతను ..."

> "అడ్డులేని మార్గ మాసించు పాలన
> మంచి సెబ్బరనెడు మాటలేదు;
> కాకి నోరు గొట్టి గద్దకువైచును,...."

> "సమర కాలంబునందైన శాంతినైన
> కర్షకుల నెత్తుపీల్చు నిక్కచ్చి విడదు;

---

(7) కృషీవలుడు. (8) కృషీవలుడు - కావ్యములు : పుట 159.


డిప్రెషన్ అంప కోఁత పండ్రెండు సనులు
ఇఁక సమీక నిర్బంధములెన్ని యేండ్లో?" (9)

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 'కృషీవలుడు', రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత "రెడ్డి కుల ప్రబోధం" వ్రాశాడు. బ్రిటిష్ పాలనలో తొలినుండి చివరివరకు యుద్ధాలులేని కాల మేది? ప్రత్యక్ష ప్రమాదాలు ఉన్నా లేకున్నా, భారతదేశ ఆర్థిక వ్యవస్థ, బ్రిటిష్ పాలనలో యుద్ధకాల వ్యవస్థలాగే వుండి పోయింది. దాని నిజస్వరూపం తెలిసి రావటానికి, కర్షక కవికి యిరవై అయిదేళ్లు పట్టింది. ముసలితనం ప్రారంభ మయ్యే సరికి దృష్టి సమగ్రం కాసాగింది. తెలిసికొన్న దానిని ఆయన చాటినాడు. తన కుర్రతనపు టాలోచనలను బహిరంగ సభలో ఖండించినాడు.

వాస్తవానికి యింత చేరువగా వచ్చిన పద్యాలలో కావ్యాంశ లోపించిందని కొందరు కనిపెట్టారు. "ఒక్కొక్క చోట జానపద నాగరిక జీవితాలను తారతమ్యము చెప్పి నప్పుడూ, విశేషాన్నుంచి సామాన్యాన్ని సమర్థించి నప్పుడూ వచనములో వ్రాస్తేనే బాగుండేదేమో ననిపిస్తుంది. (10)

ఆర్థిక శాస్త్ర సిద్ధాంతాలు, తత్త్వశాస్త్ర సామ్యవాదాలు - వీటిమీదికి ఆయన దృష్టిపోయిందట. రంగు రంగుల ప్రకృతి వర్ణనముగాక దరిద్ర కృషిక జీవిత సంబద్ధాలైన ప్రకృతి విశేషాలను చిత్రించటము వీరికి నచ్చలేదు. ఈ విమర్శకుల చూపు ఎంత సంపన్నమైంది! వాస్తవ విషయాల ప్రసక్తి వీరికి కిట్టదు. అయితే శాంతి పర్వము వచనములో వ్రాయవలసిందేనా? మత గ్రంథాలన్నీ వచనములో వ్రాయవలసిందేనా? ఏదో ఒక్క పద్యం ఎంతటి మహాకవి గ్రంథంలోకూడ నగ్న సత్యాలను వర్ణించేపట్ల చప్పగా ఉండకపోదు. ఒకవేళ కవిత్వం దాన్ని చిన్నచూపు చూచినా, జీవితం దాన్ని గద్దెనెక్కిస్తుంది. "If art and truth can not live together, then let art die; for truth is life and lies are death," అన్నాడు రోమాఁ రోలాఁ. కవిత్వం అప్పుడప్పుడూ భువికి చేరువగా వచ్చినా ఓర్వలేని విమర్శకులు ఏ యుగానికి చెందిన వారో తెలియదు.

('కవి కోకిల' జీవితకథ నుండి)



చేతనా చేతనాత్మకమైన ఈ సృష్టికి మానవుడు కిరీటము వంటివాడని నా విశ్వాసం. సృష్టిలో అంతర్భాగమైన మానవుడు సృష్టికర్తకు ప్రతినిధిగా రూపొందాడు. అందువల్లనే మానవుడు తన జ్ఞానంలో తన అనుభూతిలో తన భావనలో ఈ విశ్వాసాన్ని ఇముడ్చుకొన గలగడం సాధ్యమవుతూంది.

రవీంద్రనాథ్ ఠాగూర్

(9) రెడ్డికుల ప్రబోధము : ఖండకావ్యములు : (పుట 26)

(10) నవ్యాంధ్ర సాహిత్య వీధులు - తృతీయ భాగము.

రంగాజమ్మ

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

రసవత్ప్రబంధ కావ్యసుమాళి నాంధ్ర భా
　　　　రతి కొసంగిన కవి ప్రకర మొకట
అమృత మాధురులీను "విమల గాంధర్వమ్ము"
　　　　వెన్నతో నేర్చిన వెలదు లొకట
అధరీకృతాప్సరో విధుముఖీ నాట్యవై
　　　　భవలన్న పేర్గన్న యువతు లొకట
హృదయముత్తూతలూగింప జాలిన యట్టి
　　　　గాన కల్పన కళాకారు లొకట

హితపురోహిత సామంతతతి యథోచి
తాసనాసీనులై మహోత్సవ దిదృక్షఁ
గనుల పండువు సేయుచు తనరుచుండె
విజయరాఘవ ధారుణీ విభుని కొలువు.

వాసవవైభవుండు బుధవందిత సచ్చరితుండు భగ్యసిం
హాసన సంస్థితుండగు ధరాధిపుడంతట ముఖ్యమంత్రిచే
నా సభలోని యెల్లరకు స్వాగతమున్ బలికించి సర్వ వి
ద్యాసము పేత కొక్క వనితామణి కిచ్చె నమూల్యపీఠమున్.

సింగారమ్ముల ప్రోవు; నృత్యకళకున్ జీవమ్ము; సాహిత్యపున్
రంగమ్మందున ప్రౌఢ; దివ్యగుణశీల ప్రాభవోపేతయున్;
సంగీతమ్మునకున్ సరస్వతి; అశేష ప్రజ్ఞకున్ స్థానమై
రంగాజమ్మ తనర్చె నిస్తులతనూలావణ్యరోచిస్సులన్.

ఆ చిఱునవ్వులో దోచు వెన్నెలలలో
　　　　మనసు జీకటులెల్ల మాయమగును
ఆ చిన్ని పాటలో వీచు తెమ్మెరలలో
　　　　హృదయ భారములెల్ల చెదరిపోవు

ఆ నాట్యఫణితిలో నందెల రవళిలో
ప్రీతితో నెడద యుఱ్ఱూతలూగు
ఆ మోము సొగసులో అమృత మాధురులలో
పరపూతమై మది పరవశించు

తప్తచామీకరమునకు తావి యట్లు
రూప సంపద చదువుల ప్రాపుగాంచె
ఆమె దురదృష్టవశమున నవనికి దిగి
వచ్చినట్టి యొకానొక అచ్చరయగు

అను మిన్నందెడు హర్షనాదముల మధ్యన్ జ్యోతిషుల్ నిర్ణయిం
చినవేళన్ కనకాభిషిక్త నొనరించెన్ రాజనీతిజ్ఞ న
వ్వనితారత్నము నష్టభాషల కవిత్వ ప్రౌఢికిన్ ముగ్ధులై
కనువారెల్లరు మెచ్చ భూవిభుడు రంగాజమ్మ నేతత్సభన్.

పూతమ్మయ్యె మదీయజన్మము, వ్రతమ్ముల్ నోములున్ పండె భా
షాతన్వంగి కృపన్ భవద్విరచిత స్వర్ణాభిషేకమ్మునన్;
చేతుల్ మోడ్చి కృతజ్ఞతా భరితనై సేవించెదన్ మిమ్ము, నా
యాతిథ్యమ్మును స్వీకరింపుడని అభ్యర్థించె భూపాలునిన్.

తరుణి యాహ్వానంబు తలకు మించినది త
థ్యమ్మంచు గుసగుసలాడు వారు
ఇంత గౌరవము గావించిన ప్రభునెడ
తనకృతజ్ఞతచూపె ననెడువారు
తానెంత కవయిత్రియైనను నృపతితో
చనవు హద్దునుమీరె ననెడువారు
ఆ పిల్పులో నెట్టి యపవిత్ర భావమ్ము
నిముడలేదని విశ్వసించువారు

ఇంతకు ప్రధాన మంత్రియు నింగితజ్ఞ
యైన పట్టపురాణియు నాతడరుగ
ననుమతింతురొ లేదొ యటంచు మదిని
సంశయించెడు వారైరి సభను జనులు.

క్షితిపతి సాహితీప్రియత, శిష్టజనస్తవనీయ సద్గుణో
న్నతియు, కళాపిపాస, సుమనస్కతయున్ సరిగా నెఱుంగు నా
సతియు నమాత్యశేఖరుడు సత్వర మా యమ వేడినట్లుగా
నతిథిగ నేగుటే యుచితమంచు వచించిరి సమ్మదమ్మునన్.

శ్రీరమ్య తంజాపురీ రాజ్యపాలన
ప్రతిభా సమన్విత! స్వాగతమ్ము
నాయక రాజాన్వవాయ పాథోరాశి
సంపూర్ణహిమధామ! స్వాగతమ్ము
సంస్కృతాంధ్రాది భాషాకపీంద్రాశ్రయా
స్థానపీఠాధ్యక్ష! స్వాగతమ్ము
నవరస కావ్యకన్యాపరిగ్రహణోత్స
వ ప్రమోదిత చిత్త! స్వాగతమ్ము

నవ్యకవితా విలాస! మన్నారు దాస
పరమపావన బిరుదాంక! స్వాగతమ్ము
ధన్యురాలు రంగాజమ్మ తావకీన
చరణ పద్మార్చనావకాశంబు కతన.

అని హృదయ ప్రమోదముగ నవ్వనజాయతనేత్ర పల్కి నూ
తన రమణీయతా విలసితంబగు నంతిపురమ్ములోని కా
తని గయికొంచు నేగి యుచితాసనమందుపవిష్టు జేసి నె
మ్మనమలరించె వాఙ్మధురిమన్ రసవత్ఫలపాయసాదులన్.

ఈ రీతిన్ ధరణీశ్వరుండచటి కెన్నే సారులేతెంచి, కాం
తారత్నం బొనరించు సేవలకు నత్యంతంబు హర్షించి, యె
న్నో రాజ్య వ్యవహారముల్ తన అమాత్యుల్ గూడి తామే పరి
ష్కారమ్ముం బొనరింప వచ్చునని యాజ్ఞాపించె నిశ్చింతగా.

తన కావ్య రచనా విధానమ్మును విమర్శ
కాగ్రగణ్యుడు ప్రభువభినుతింప
తన భవ్యగానామృత ప్రవాహము కళా
సంపన్నుడగు రాజు సంస్తుతింప
తన దివ్య నాట్య విద్యావైభవము రసి
కావతంసుడు ఱేడు గౌరవింప
తన జగదేక మోహన రూపలక్ష్మికి
క్షితిభర్త హృదయ మంకితమొనర్ప

నిత్యనూత్న కళారమణీయ యగుచు
తా నొకానొక దేవిగా, తనవసించు
మందిరమ్మొక స్వర్గధామమ్ముగాగ
ప్రభువు తలప రంగాజమ్మ పరిఢవిల్లె.

అతిముఖ్య రాజకార్యముల భారము తోడ
చనుదెంచెడు నమాత్యగనుటలేదు
కనులుకాయలుగాచె ననుచు పట్టపురాణి
చెలికత్తెనంప వీక్షింపలేదు
సకల దేశాగత సుకవీంద్ర గోష్ఠికై
పిలుపు వచ్చిన చెవిఁ బెట్టలేదు
ప్రభుదర్శనార్థులై ప్రజలువచ్చుట తెల్పు
వార్తాహరుడు కండ్లబడుటలేదు

రేలు పవలును క్రొంగ్రొత్త లీలలందు
హాయి గూర్పగ నూత్నదివ్యానుభూతి
విధులు మాని రంగాజమ్మ ప్రేమరాజ్య
మేలె రఘునాథ ధారుణీపాల సుతుడు.

తన రాజత్వము, వంశగౌరవము, బాధాతప్తచేతస్కయౌ
అనుగుం బట్టపురాణి దీనతయు, లోకాదర్శమౌ శీలమున్,
తన బిడ్డల్ వలె చూచుకొన్న ప్రజలన్, ధర్మోపదేశమ్ములన్,
కనడయ్యెన్ నరపాలుడించుకయు రంగాజమ్మ సర్వస్వమై!

నీతి దొలంగి యిట్టు లవనీపతి పట్టపుదేవి మాటయే
చేతమునందు లేక విదుషీమణి యక్కవయిత్రితోడి సం
గాతమునన్ నిరంతర సుఖమ్ముల దేలుచునుండ జూచి చే
జేతుల దెచ్చిపెట్టికొను చిచ్చిది యంచు దలంచె మంత్రియున్.

క్షితిపు మనమ్ము ద్రిప్పుటకు చేసిన యత్నములెల్ల వ్యర్థమై
గతి యికలేక రాణి చెలికత్తెను బంపి యెఱుంగజేసె న
య్యతివకు "నాడుదాని హృదయమ్మును నీవెఱుగంగజాలవో!
పతి నిటకంపి నా బ్రతుకు పండగజేయు"మటంచు దీనతన్.

"ఏ వనితల్ మముందలప నేమి పనో? తమరాడువారు కా
రో? వలపించునేర్పెఱుగరో? తమ కౌగిలిలోన నుండగా
రావిది యేలరా విజయరాఘవ యంచు వచించి బల్మిమై
తీవరకత్తెనై పెనగి తీసుక వచ్చితినా తలోదరీ!

కదలన్ వచ్చును జాగుసేయ"కని రంగాజమ్మ గర్వంబుతో
బదులీయం జెలికత్తె రాణి కడకున్ పర్వెత్తి విన్పింపగా
హృదయావేదన దుర్భరమ్మగుట మూర్ఛిల్లెన్ మహాసాధ్వి, ఆ
పదలన్ ధైర్యము పూను మంత్రి తరణోపాయమ్ము చింతింపగా.

వ్యామోహమ్మున నిన్ను వీడక కుటుంబఖ్యాతియున్ రాజ్య సం
క్షేమంబున్ గణియింపడీ నృపతి యోషిల్లోక చూడామణీ!
సామాన్యాంగనవోలె నీవును నుపేక్షల్ సేయగాఁబాడి యే
భూమీనాథుని మానసమ్ము తిరుగన్ బోధింపగా రాదొకో.

అని నయశాలియైన సచివాగ్రణి చేసిన ప్రార్థనంబు నె
మ్మనమున నాట గాఢముగ మానిని నిర్మల చిత్తవృత్తియై
తన విధి నిర్ణయించికొని ధారుణినాథుని హెచ్చరింప నా
తని హృదయంబు మాత్రము యథాస్థితి నిల్చెను మోహబద్ధమై.

నిరతంబు భవదీయ సురుచిరాకృతి చూడ
 అనిమిషత్వము లభించినది మాకు
చదువులరాణి! నీ సమ్ముఖ స్థితి గల్గ
 వనజాసనత్వమబ్బినది మాకు
త్వద్గాన మధుర శబ్దతరంగముల దేల
 ఖేచరత్వము దొరికినది మాకు
ఓ జగన్మోహినీ! యుష్మదాశ్లేషమ్ము
 శ్రీకంఠ పదవిగూర్చినది మాకు

ప్రణయ సరస కవిత్వ సామ్రాజ్య పట్ట
భద్రులము ధారుణీ రాజ్యభార మేల?
బేలవై నీవె యిట్లు భావించి నావొ!
ఈర్ష్యతో నెవ్వరైన బోధించినారొ!

ఇటులు ధరాధి నాథుడు వచింపగ నిస్పృహ జెంది వెంటనే
దిటవుగ నిశ్చయించికొనె దేశహితార్థము తాను మేను వా
యుట యొకటే యుపాయమని యుగ్మలి ఎంతటి త్యాగశీలయో
కటకట నిండు జవ్వనము కాలపు గర్భమునన్ మునింగెడిన్.

అధ్యాఁ డున్నయప్పు డందఱుఁ బూజ్యులె
లెక్కమీఁద సున్న లెక్కినట్లు
అతఁడు పోవు వెనుక నంద అపూజ్యులే
లెక్క లేక సున్న లేఁగినట్లు

చాటువు

శ్రీమద్రామాయణము - ఉత్తరకాండము

ఆత్మకూరి గోవిందాచార్యులు

శ్రీమద్రామాయణ మాదికావ్యము. అనాది కావ్యము. పూర్వ రామాయణ మారుకాండలు. ఏడవకాండయే ఉత్తర కాండము. మొదటి ఆరు కాండలే వాల్మీకి రచిత మనియు, ఏడవ కాండము నెవరో తదుపరి పూరించిరనియు కొందరి వాదము. ఇది గమనార్హ్యముగు వాదమేకాదు. సంస్కృతమున రామాయణ శైలి, ఆదినుండి అంత్యము వఱకు 7 కాండలలోను వొక్కరీతి గనే నున్నది. ఉత్తరకాండశైలి యనుకరణమని. యపోహబడుట కాధారము లేమియు, సహృదయులకు గోచరింపవు. ఉత్తర కాండమునుగూడ తానే వ్రాసినట్లుగ వాల్మీకియే బాలకాండమున వ్రాసియున్నాడు.

శ్లో॥ అయోధ్యా యాశ్చ గమనమ్ భరతేన సమాగమమ్
రామాభిషేకాభ్యుదయం సర్వ సైన్య విసర్జనం
అనాగతంచయత్కించి ద్రామశ్చ వసుధాతలే
తచ్చకారోత్తరే కావ్యే వాల్మీకి ర్భగవాన్ ఋషిః ॥

(బా. స. 3. శ్లో. 37, 38; స. 4. శ్లో. 2. 3; ఉ. స. 94. శ్లో. 94; శ్లో. 24, 25, 26, 27.) వైదేహిని విసర్జించినంత వఱకును తానే యెఱింగిన సత్య మగుటచే దానిని యధావిధిగ వ్రాసెను. తదుపరిగాథ వాల్మీకి కాలజ్ఞుడయి వ్రాసెను.

ఎప్పుడు

ఉత్తరకాండ, సీత తన యాశ్రమమునందున్న కాలమునందే వ్రాసి ముగించెననుట నిర్వివాదాంశము. కుశలవులు వేదాధ్యయన సంపన్నులై యున్నతఱి వాల్మీకి సప్తకాండములను ముగించి యున్నాడు. (బా. స. 4. శ్లో. 4, 5, 6.)

తమ, ఆశ్రమవాసులును, రాజపుత్రులును, వేదపరినిష్ఠులును, యశశ్వినులును, అమడలును నగు అబాల గాయకులు, తంత్రీలయ సమన్విత రసప్లుత రామాయణమును బఠించిరి.

మునివేషధారులగు నీ బాల గాయకులు, సేవా చరిత్రయే అగు రామాయణము నాదిశేషుడుగూడ నాలించునటుల పాడ గడగిరి.

ఎచ్చట

ఋషులు, ద్విజులు, సాధువులు, మొదలగు సర్వజ్ఞులు గల తావులందు. భవిష్యదర్థమై కాబోలు, తా మందలి సత్యాసత్యము లెఱుంగకయే పాడిరి. గర్భదర్శకులగు ఋషిశ్రేష్ఠులు, ఆ బాల కుల మాధుర్యమయ గానవాహినిలోబడి, జానకీ వికల వ్యావృత రామసత్కథామృతమున దన్మయులై, విస్మితులై వినసాగిరి.

రాముడే వినుట :

ద్వంద్వాతీతులైన మునులైననేమి, పరిణయము నాటినుండియు సీత బడిన యగచాట్లెవరి హృదయమున గలంత గలిగింపవు ? అది అశ్వమేధయాగకాలము, నిర్వహించుచున్నవాడు ధీరోదాత్త నాయకుడైన రామచక్రవర్తి. ధర్మనిర్వహణార్థము, తన జీవిత సర్వస్వ మర్పించిన ధర్మమూర్తి. ఇట్టి చక్రవర్తియే, కుశలవ గానమున. తన హృదయతంత్రుల మేళవించుకొని, ఆత్మావ లోకన మొనరించుకొనినాడు. రామదేహాపర స్వరూపులును (బా. స. 4. శ్లో 11.) గంధర్వ సమానులును, నగు నా ముని బాలకు లేలనో ఆ రామచంద్రుని హృదయాసనాసీనులైరి. ఏ నారదుడు మానవోత్తముడగు ఆ రామచంద్రుని కథను, వాల్మీకి మహర్షి కెఱుంగజెప్పి ఆ శ్రీమద్రామాయణరచనా కారకుడయ్యెనో, గానకళావిశారదుడగు నా నారదుడే, రామాయణ రచనానంతరము కుశలవులను గానకళావిశారదు లగునట్లు తీర్చిదిద్దెను. కుశలవుల కాచార్యుడయ్యెను. రచయిత వాల్మీకి. గానమా నారద గానము. పాడువారా బాలకులు. కథా ఆత్మగాధ. గాయకులా, ఆత్మ ప్రతిబింబములు, జటావల్కలధారులే కాకున్నచో రామునకును కుశలవులకును తారతమ్య మావంతయునులేదు. ఇంక రాముడు గుర్తించుటయం దాశ్చర్యమేమి ?

రామరాజు — జానకీరాణి :

గర్భవతియైన సీత విసర్జింపబడినది. సీత సతియని శ్రీరామ

చంద్రున కెఱుకయే. రావణ సంహారానంతరము, వంశకర్త యగు, లోకబాంధవుని సాక్షిగ, బ్రహ్మాదిదేవతల సమక్షమున, జ్వాలికాపాత్రమైన సీత, నిష్కళంకయని, యాకాశవాణి దిగంతములు మారుమ్రోగించినది. దీనినెల్ల లక్ష్మణుండు పరివీక్షించుచుండ సీత పరిగ్రహింపబడినది. సీత పాతివ్రత్యమును గురించి, శుద్ధవర్తనమును గుఱించి రామున కెట్టి సంశయమునులేదు. ఈ నిస్సంశయము, సోదరులందఱకు, రాముడు సీతావిసర్జనకు పూర్వమే, నివేదించినాడు. సీతావిసర్జనమున కామెయందుగల అవిశ్వాసము కారణమై యుండునని, భరత శత్రుఘ్ను లెవ్వరును, దలంపకుండ లంకయందు సీత అగ్నిప్రవేశము గావించిన యుదంతమెల్ల లక్ష్మణసాక్షిగ, తక్కుంగల సోదరుల కెరుకపఱచినాడు. (ఉ. స 45 శ్లో 6 మొదలు 12 వఱకు) అయితే సీతా విసర్జన మెందుకొఱకు ?

అగ్రజుని వాక్యములు - లక్ష్మణుని సాక్ష్యము, భరత శత్రుఘ్నులకు విశ్వసనీయములు కావుగదా ! అపనింద బలికిన పౌరులను విశ్వసింపజేయవలయును. కీర్తికాముడైన, రామరాజున కిదియే కర్తవ్యమైనది. ఈ కర్తవ్య నిరూపణమే ఉత్తర రామ చరిత్ర. ఇదియే యీ కాండకు ప్రధానము, ప్రాణము. ప్రారంభము. రాముడు ప్రాప్తరాజ్యుడయ్యెను. భరతుని పంపునవచ్చిన సామంత రాజులకు గానుక లనిచ్చి వీడ్కొలిపెను. అగస్త్యులవారిచే రావణ రావణి జన్మగాథల వినెను. ఇందే మునులు, తదితర గాథ లెన్నియో రామున కెఱుకపరచిరి. ఈ వృత్తాంతములే నలుబది రెండు సర్గలైనవి. మిగిలిన సగభాగము మాత్రమే సీతావియోగ, నిర్గమన కథాసంవృతము.

తొలి - మలి - భాగముల సంబంధమేమి ?

పూర్వరామాయణమున, తొలిభాగమున రావణచరిత్రమున సీతాదేవి పూర్వగాథ యంతయు వివరింపబడినది. (నాగటిచాలున లభించుటకు ముందుగల గాథ) జనకసుతయగు నిది షట్కాండలు- ఉత్తరకాండమున వసుంధరా సుత, పూర్వాపర గాథలు రెండును గలవు. సీతాదేవి పూర్వవృత్తాంతమునుండియు రావణ సంహరణమువరకును గల సంబంధమే సప్తమ కాండాదిని నిరూపింపబడినవి. రాజ్యప్రాప్తి మొదలు, రాజ్య విస్తీర్ణము, రాజ్యపాలన, అపవాద సమాప్తివఱకును గల పట్టపురాణి గాథయంతయు గలదు. రావణ సంహరణార్థమై లక్ష్మి అంశ నవతరించిన సీతామహాలక్ష్మి కథ. అవతారాంతము వఱకు చెప్పకున్నచో, అది పూర్తియగునా? ఈ సంపూర్ణ పరిణామమే సప్తమకాండము. తొలి మలిభాగముల సమన్వయమే ఉత్తరకాండము. ఈ ఉత్తరకాండమే లేకున్నచో- రామాయణగాథ. అందలి రచనా చమత్కృతి - రససిద్ధి - శిల్ప నైపుణ్యము కావ్యమాధుర్యము - పూర్తియే కాజాలవు. అసంపూర్ణముగ నుండెడివి. ఆదినుండి తుదివరకు ప్రవహించిన, అప్రతిహత రసప్రవాహమే, ఉత్తరకాండ లేకున్నచో తెగిపోవును.

సీతా విసర్జనమే వాల్మీకమందలి ఏకరస సిద్ధి కాదియేమో !

సీతా విసర్జనము :

కాదు లనదగు లోకు లాడు మాటకు అగ్నిసాక్షిగ గొన్న అర్ధాంగి నడవులపాలు సేయుటయేనా ? ధర్మవిచారణ సేయవలసిన రారాజు, దోషము నిరూపింపకుండ, సత్య మామె కెఱుకపఱచకుండ, ఆమె కోర్కె నెపమున, వరమర్మమున, రాణిని వనవాసినిగ జేయుటయేనా ? "వైదేహీ ? వేడ్కమీర, పుణ్య గంగానదీతీర భూమియున్న మునుల వాడకు దొడ్కొని పోదు నిపుడె" యని లక్ష్మణుడు, మాతృ సమానయగు, వదినగారికి తెల్పెను ? ఈ లక్ష్మణ వాక్యమునం దసత్యము లేదా ? రాజాజ్ఞను నిర్వహించుట సీత ధర్మము. లక్ష్మణుడును పౌరుడే. అగ్రజుని వాక్య నిర్వహణము సోదర ధర్మము. ఇక్ష్వాకు కుల సంజాతుడు రాఘవుడు, సీతయు, మహాత్ముడగు జనక వంశోద్భవ. ఇరువురు భార్యాభర్తలు. భార్యా కారణముగ భర్త, అపవాదు భరింపవలసినవాడు. అపవాదు మోపినది పౌరులు — అపవాదువేయుట తప్పిదమని రాముడు ప్రకటించినంత మాత్రమున, ప్రజలు విశ్వసింపరు కదా ? కామమోహితుడై, పరాంకవర్తినిని, నరేంద్రుడయ్యు చేకొనుటయే కాక, ఆమె వర్తనమును, సమర్థించుచున్నాడీ యన వంశోద్భవుడని ప్రజలు మఱింత గేలిసేయరా ? ప్రజాపవాదమును బాపుకొనలేని రాజు రాజుకాడు కదా ? నిర్దోషిణి యైనను, అపవాద కారకురా లగుటచే, సీతను వర్జించుటయే, రామరాజ కర్తవ్యము. ఇచ్చటనే, ఉత్తరకాండము సజీవమైనది. రసోత్పన్న మగుట ప్రారంభించినది. రాముడు కరుణరస కారకుడైనాడు. దుఃఖ సముద్రమున మున్గిన నన్ను జూడుడు. నావంటి హీనజీవు లెచ్చటను లేరు. ఈ యపదూరునకంటె దుఃఖ మేది ? ఈ యపదూరునకు వెరచి ప్రాణముల నైనను గోల్పోవుదును. మిమ్మైన వీడుదును. జానకిని బాయు విషయమున సందేహ మెట్లుండును ? (ఉ. స. 45 శ్లో. 15-16-17) ఈ కరుణరస వాహిని సీతా విసర్జ

నానంతరము పొంగి పొరలసాగినది. వాల్మీకి యాశ్రమోపవాసమున విసర్జింపబడిన, ఆ మహాపతివ్రత, ఆత్మాక్రందనమున, వాల్మీకి మహర్షియు, కరుణరస స్వరూపుడైనాడు.

"నా యీ జన్మ నా బ్రహ్మ దుఃఖమునకే పుట్టించెనా ? పూర్వ జన్మమునం దెట్టి పాపము నొడిగట్టితినో ? ఏ దంపతుల నెడబాటునకు, కారకురాల నైతినో ? శుద్ధ సమాచార నైన నన్ను గతిని సహోరా జేల త్యజించినాడు ?" అను సీతా విలాపమున శిలలైన ద్రవీభూత మగుటయం దాశ్చర్య మేమి ?

ఇంతగ శోకసాగర నిమగ్నయయ్యు అబలయయ్యు, తాను, రాజీనను మాటమాత్రము సీత మరచియుండలేదు. లక్ష్మణుని వరముగ, భర్తృ విసర్జిత యైన ఆ సీత రామరాజునకు పంపిన సందేశ మెంతటి నృపధర్మ నిష్ఠాపరత్వము చాటించుచున్నది ? నృపతి ధర్మానుష్ఠానమునం గడు జాగరూకత వహింపు మనుము. (నృపతి ర్ధర్మేషు సుసమాహితః. స. 48 శ్లో. నా మొదలు. 18 వరకు) "నృపధర్మానుష్ఠాన పరుడగు, మీ సోదరునితో, సోదరులతో పాటుగ పౌరులనుగూడ జూడుమనుము." "నన్నును పౌరధర్మమునుగూడ నొక్కరీతిగ జూతువు గావున, పౌరులను సోదరులవలె జూడుము" నావలె పౌరుల నెన్నడును విసర్జింపవలదని యీ మాటయందలి ధ్వని. కాలకర్మ వశమున, పౌర సంతతిని విడిచి వెళ్ళవలసి వచ్చిన మాతృ గర్భమునుండి బహిర్గతమగు మమకారపూరిత ధర్మ వాక్యములతో సీత యూరకుండలేదు, భార్య ధర్మ స్వరూపిణి యగు సీత, తద్ధర్మము నెట్లు విడనాడగలదు ?

"రఘునందనా ? నీ వెట్లు పౌరుల యపదూరు నోర్వనివాడవై నన్ను బాసితివో. యట్లు లోకనిందకు నోర్వక స్వశరీరమునైనను పాయుదును. కాని నాకు భర్తయే దైవము. భర్తయే చుట్టము. భర్తయే గురువు. కాన ప్రాణత్యాగ మొనరించియైనను భర్తకిష్టమైన కార్యము జేయవలయును." (స. 48. శ్లో. 16, 17 ఉ.)

అని సీత భర్త నియోజిత ధర్మమే, తన శరీరము కంటెను, పరమధర్మముగ స్వీకరించుచు, వనవాసమున రంగీకరించినది. కాని, "నీ వేమి చెడుపని జేసితివి ? నిన్నేల మహాత్ముడగు రాముడు విసర్జించెను. అని మును లడిగిరేని వారికి నేనేమి బదులు సెప్పుదాన" అను నపవాద భీతి యావహించినది. జాహ్నవీజలముల లోబడి, జీవితము త్యజించుట సమంజసమా యను తలంపు జనించినది. అంతలో, రామరాజ వంశము జ్ఞప్తికి వచ్చినది. రాముని సతి, దశరథుని కోడలు, బలవంతముగ గంగలోబడి ప్రాణములను గోల్పోయినచో, భర్తృ వంశమున కపకీర్తి సంభవించదా ? "నా నాథునికి కళంక మాపాదించిన దాననుగానా" యని ప్రాణేశుని నిర్మలకీర్తి దలపోసినది. సజీవయై వనవాస క్లేశానుభవమే కర్తవ్యముగ నిరూపించుకొనినది. కాని తొల్లింటి వనవాసమున భర్తృ సహచారిణిగ నుండుట స్ఫురణకు వచ్చినది. "మున్ను వనవాసంబున దుఃఖమగ్నయై యున్నను, "రామపాదానువర్తి నినై" యుంటిని. (ఉ. స 48 శ్లో. 5. 6.) అదియే దుఃఖోపశమనమై సుఖకరమైనది. నేడో, యెవ్వరికి నా దుఃఖము జెప్పుకొందును." అనియు సీత కినుకవహించలేదు. "నేను నీ భక్తురాలిని. నీ కెల్లప్పుడు మేలొనర్చుచుండు దాన" నని శ్రీరామభక్తి పరవశయైనది. పతివ్రతా రోదనము రోధసుల మారుమ్రోగించినది. దుఃఖభారమున మాతృపర్యంకమునంబడి పొరలుచున్నది. అపవాద జ్వాలల కాహుతియయ్యు, పతిచే యకారణముగ త్యజింపబడియు, ఏకాకినిగ వనమధ్యమునందు వీడబడియు, ఆ యశోధన, ఆ తపస్విని, పతిభక్తినే వహించినది. భర్తృ క్షేమమే కోరినది. (ఉ. స. 48. శ్లో. 22.)

వాల్మీకి దశరథుని మిత్రుడగుటచే, ఆయన ఆశ్రమోపవాసమున సీతను, రాముడు త్యజించియున్నను, వాల్మీకి మహర్షి మాత్రము, తత్కారణమున, సీత ననుగ్రహించలేదు. తన జ్ఞాననేత్రమున, సీత, అపాపయని తెలిసికొని మునిపత్నుల యాదరణమునందుంచెను.

శ్లో॥ అపాపాం వేద్మి సీతే త్వాం తపోలబ్ధేనచక్షుసా. ఉ. స. 49 శ్లో 14.) "ఇదిగో, అర్ఘ్యము. వగమానుము. నెమ్మదినొందుము. స్వగృహ మునకు వచ్చినట్లుగ మా యాశ్రమ మందుండుము." అని, యా మహర్షి యామె నాహ్వానించెను.

"ఈమె సీత. ధీమంతుడగు రాముని సతి. దశరథుని కోడలు, జనకమహారాజు కూతురు. నిర్దోషియైన, నీమెను రాముడు పరిత్యజించెను. రాజపత్నియనెడి గౌరమున శ్రద్ధాభక్తులతో నీమెను జూడుడు." అని, మునిపత్నులకు, సీతను ఒప్పగించుటతో, వాల్మీకియే కరుణరస ప్రవాహమున తలమున్కలుగ మునిగినాడు. ఈ ఉత్తుంగ కరుణారసవాహిని, సీతానిర్గమన సమయమున, ఆమె మాతృపర్యంకము నెట్లుజేరెనో, అట్లే, కరుణరస సముద్రగర్భమును సేకరించుకొని, యందతర్లీనమైనది. ఇదియే వాల్మీకి తపస్సిద్ధి. రససిద్ధి. కవిత్వసిద్ధి. ఈ సీతా నిర్గమనమున, రామరాజ సతి, సతీతిలకమై ధన్యవాదయైనది. రామరాజు రాజన్యమార్తాండుడై నిష్కళంక కీర్తిదేవతాలింగనమున "ధన్యోఽస్మి — ధన్యోఽస్మి" యనినాడు. సీత యస్తమించినది. రామరాజన్యుని యపకీర్తియు నస్తమించినది.

(సశేషం)

మంగళసూత్రములు

(పాళీభాషనుండి అనువాదము)

రా. సు. రాట్కవి

బుద్ధదేవుండు ‘సావత్తి’ పురమునందుఁ
దగ ‘ననాథపిండకుని’ జైతవనమందు
నొక్కదినమున విహరించుచుండ, దరినిఁ
జేరి యొకదేవదూత ప్రశ్నించె నిట్లు.

సకల శుభముల నెప్డుఁగాంచవలెనంచు
మర్త్యులు నమర్త్యులు వచించు మాటలందు
నధికమైన శుభంబేది యనఁగ బుద్ధుఁ
డపుడు వివరించిచెప్పెఁ సుస్వాంతుఁడగుచు.

మూర్ఖులకు సేవసేయంగఁ బొసఁగదెప్డు
జ్ఞానకోటిని సేవింప మానరాదు
పూజ్యులకు సేవఁజేసిన మోక్షమబ్బు
మానవులకిది యుత్తమ మంగళంబు.

వసతికనుకూలమగుచోట వాసముండి
పుణ్యకార్యంబులను జేయఁబూనవలయు
నాత్మ తత్త్వవిచారంబు నరయవలయు
మానవులకిది యుత్తమ మంగళంబు.

సత్యపథమందు నేగుట సత్కళలను
నేర్చియుంట మంచిపనులఁ గూర్చుచుంటఁ
బరుషవాక్కుల నెన్నండుఁ బలుకకుంట
మానవులకిది యుత్తమ మంగళంబు.

తల్లిదండ్రుల యానతిఁ దప్పరాదు
ఆలుబిడ్డల నెప్డుఁ బాయంగరాదు
కులబలాచారములు వీడఁదలఁపరాదు
మానవులకిది యుత్తమ మంగళంబు.

చేతనైనంత దానంబు సేయవలయు
బంధువులపైనఁ బ్రేమంబుఁ బాయరాదు
పాపకార్యంబులను జలుపంగరాదు
మానవులకిది యుత్తమ మంగళంబు.

పరుల భాగ్యంబుఁజూచి యోర్వమియుఁ దగదు
మునులకెల్లప్డు భక్తితో మ్రొక్కవలయు
విమల ధర్మంబు లెల్ల స్థాపింపవలయు
మానవులకిది యుత్తమ మంగళంబు.

క్రోధలోభమోహములఁ జిక్కవడరాదు
మద్యపానంబు సేయుట మానవలయు
ధర్మమందున నాసక్తి తగులవలయు
మానవులకిది యుత్తమ మంగళంబు.

గౌరవాదరములనెప్డుఁ గాంచవలయు
నున్నయంతలోఁ దృప్తిని నొందవలయుఁ
పరులొనర్చెడు మేలును మఱువరాదు
మానవులకిది యుత్తమ మంగళంబు.

బ్రహ్మచర్యనిష్ఠలనెప్డు వదలరాదు
మంచిపనులకు బుద్ధి నుంకించవలయు
మోక్షమును బొంద యత్నంబుఁ బూనవలయు
మానవులకిది యుత్తమ మంగళంబు.

కలిమిలేములపట్ల నిశ్చలతయున్నఁ
గష్టసుఖములఁ జిత్తంబు కలఁగకున్న
శోకమనుమాట యెవ్వేళ లేకయుండు
మానవులకిది యుత్తమ మంగళంబు.

ఇట్టి ధర్మపథమునందు నెవ్వఁడేగు
వాఁడెపో ధన్యతముఁడు నీవసుధలోన
నతఁడె యెల్లవేళల సౌఖ్యమరయుచుండు
మానవులకిది యుత్తమ మంగళంబు.

★

బియ్యం దంపుడు యంత్రం

గజపతిరాయవర్మ

దేశంలో ధాన్యం ఉత్పత్తికి అగ్రస్థానంలో ప్రసిద్ధిపొందిన జిల్లా పశ్చిమ గోదావరిజిల్లా. ప్రథమపంచవర్ష ప్రణాళికా కాలాన బియ్యం తయారుచేసే మిల్లు సంఖ్య పెరిగినదీ, ఇదే జిల్లాలో. ఇందులో నేర్పరితనం తాడేపల్లి గూడెం ప్రాంతీయ మిల్లు యజమానులది.

జిల్లా రైతాంగంలో ప్రథమశ్రేణికి వచ్చేది తణుకు తాలూకా. తణుకు తాలూకా సత్యవాడ రైతులిద్దరు బియ్యం దంపుడు యంత్రాన్ని కనుగొని రెండు సమస్యల సాధించినారంటే సత్యదూరం కాదు. ఖాదీ గ్రామ పరిశ్రమల కమిషన్ డైరక్టరు (బొంబాయి) శ్రీభట్ దేశంలో ప్రప్రథమంగా ఆ విధంగా యంత్రాన్ని కనిపెట్టిన ప్రఖ్యాతి ఆంధ్రులదే అన్నారు.

దంపుడు బియ్యం పేరిట తెలుపుచేయని మిల్లుబియ్యం దంపుడు బియ్యం అంగళ్ళలో అమ్ముతున్నారనే విషయంలో సత్యం లేకపోలేదు. మిల్లులో ధాన్యం బియ్యంగా మారే పద్ధతిలో గింజలు వేడెక్కి పోషక ద్రవ్యాలు పోగొట్టుకొంటున్నట్లు అందరెరుగుదురు.

కేవలం మనుషులచే దంపించి బియ్యం విడుదల చేయాలి అంటే కొంత వ్యవధి, చాలామంది పనివాళ్ళు కావాలి. పోషకద్రవ్యాలు పోగూడదు.

బియ్యంమిల్లులంత వేగిరం గాకున్నా త్వరితంగా ధాన్యం బియ్యం గామారే ఏర్పాటు - గంటకు 10 మణుగుల ధాన్యం బియ్యంగా మార్చేపద్ధతి—గింజలు వేడి ఎక్కకుండాను. పోషక ద్రవ్యాలు పోగొట్టుకోకుండా ఏర్పాటు—సత్యవాడ రైతులు కనిపెట్టారు.

శ్రీపెన్మెత్స వీరభద్రరాజు సత్యవాడలో భూస్వామి, రైతు. శ్రీ అడ్డాల పార్థసారథి, వరిఘోడు, కాపురం, వ్యవసాయం సత్యవాడలో. వీరిద్దరికృషి ఫలితం మనుషులతోగాని, విద్యుచ్ఛక్తివలన గాని నడిచే యంత్రం— మూడు గంటల్లో యంత్రాన్ని బిగించవచ్చును—దినానికి పదిహేను రూపాయలు మాత్రమేఖర్చు.

ఏప్రిల్ నెలలో జరిగే అఖిలభారత సర్వోదయ సమ్మేళనంలో ఖాదీబోర్డు వారి యంత్రాన్ని ప్రదర్శిస్తా రనుకొంటున్నారు.

అక్షరంబు వలయుఁ గుక్షి జీవనులకు
నక్షరంబు జిహ్వ కిక్షు రసము
అక్షరంబు తన్ను రక్షించుఁ గావున
నక్షరంబు లోక రక్షితంబు

చాటువు

కథానిక:

కూపస్థ మాండూక్యం

త్రిపురనేని గోపీచంద్

రిక్షా, యజమానికి అప్పగించి తన గుడిసెకు బయలుదేరాడు పాపారావు. యజమాని వొకగంట ఆలస్యంగా వొచ్చావు అని బెదిరిస్తే రెండు అణాలు ఆయన చేతిలోపెట్టి బయటపడ్డాడు. రోజుకి అద్దెగా ఇచ్చే రూపాయిన్నరకు తోడు ఇవి.

పాపారావుకి ఆరోజు రెండున్నర రూపాయిలు మిగిలినై. అతని సంతోషానికి మేరలేకుండా వుంది. అతను తన గ్రామంలో వున్నప్పుడు ఇంతడబ్బు ఏనాడూ చూచిఎరగడు. రోజంతా పొలం చాకిరీ చేస్తే మహాఐస్తే రూపాయి ఒచ్చేది. అయితే సంవత్సరానికి ఆరునెలలు పనే వుండేదికాదు. ఇక్కడ పనిలేక పోవటం అనేప్రశ్నే లేదు, ఓపికే వుండాలిగాని.

అయితే అన్నానిదే అతనికి కొంచం కష్టంగా వుంది. కూరా నారా బాగానే ఉంటుంది గాని, వారు నలుగురు కలిసి వొకచిన్న గది అద్దెకు తీసుకొని వుంటున్నారు. నలుగురికీ కాంతమ్మే వండి పెడుతూ వుంటుంది. కాంతమ్మకు దిక్కెవరూలేరు. పాతిక సంవత్సరాలకంటే వయస్సు ఎక్కువవుండదు. తమకు ఇంత వండి, తానింత తిని ఎక్కడికో వెళ్ళిపోతుంది. మళ్ళీ వంట వేళకుగాని రాదు.

కాంతమ్మకు తనంటే ఇష్టము. అందరికంటే వొక మెతుకు తనకే ఎక్కువ పెడుతుంది. ఎవ్వరూ చూడకుండా కాస్త కూర ఎక్కువే వేస్తూవుంటుంది. కాని వొకరితో వొకరికి పొత్తులేని నలుగురు కలిసి వొక ఆడమనిషితో వండించుకొని తినటం అతనికి బాగుండలేదు. ఆమె ఎవ్వరు తమకు వండిపెట్టటానికి. వండితే తల్లి వండాలి లేకపోతే పెళ్లాం వండాలి. ఈమెకూ తమకూ ఏమిసంబంధం అని ఈమెతో వండించుకోవటం?

అతని మనస్సుకి ఏమీ బాగుండలేదు. ఆమె అన్నం వడ్డించటానికి వచ్చినప్పుడల్లా పెళ్ళికూతురుమల్లే తలవంచుకు కూర్చునేవాడు మొదటిరోజుల్లో. నోట మాట పెగిలేదికాదు. ఆమె ఎగతాళీ కూడా చేసేది, "ఈ కోనకోడిని ఎక్కడనుంచి పట్టుకువచ్చారు?" అని.

"మేమూ మొదట్లో అట్టా వున్నోళ్ళమే. నాలుగురోజులు పోనియ్ కోడి కూతకు వస్తదోలేదో నువ్వే చూద్దువుగాని," అనేవారు మిగిలిన ముగ్గురూ.

కాంతమ్మంటే మిగిలిన ముగ్గురికీ చనువే. ఆమెతో సరసాలాడేవారు. ఆమె ఊరుకునేదికాదు. ఎదురుతిరిగి వారు అన్న దానికంటే పదిరెట్లు అనేది.

పాపారావుకి వాళ్ళసంబంధం బొత్తిగా అర్థమయ్యేదికాదు. నాలుగుమెతుకులు కొరికి లేచిపోయి బయట పక్కవేసుకొని పడుకొని నిద్రపోయేవాడు.

వొకరోజు అట్లాగే పడుకుంటే కాంతమ్మ వచ్చి సరసన కూర్చుంది. అతనికి తేళ్ళూ జెర్రులూ పాకినట్లయింది. నిద్ర పోయినట్లు పడుకున్నాడు.

"ఏందయ్యా వొకటే నిద్దర లే కాసేపు కబుర్లుచెప్పు." అని వీపుతట్టి లేపింది కాంతమ్మ.

అప్పటికీ లేవటానికి ఇష్టంలేక, వొక్క మూలుగు మూలిగి, ముణగదీసుకు పడుకున్నాడు పాపారావు.

"కోణంగి చేష్టలు చాలా వున్నయే," అని చక్కలిగింతలు పెట్టింది కాంతమ్మ.

పాపారావు ఏదైనా తట్టుకోగలడుగాని చక్కలిగింత తట్టుకోలేడు. గుక్కలుపట్టి నవ్వుతూ గిజగిజ తన్నుకున్నాడు.

"ఊరుకో లేస్తా" అన్నాడు.

ఆమె వూరుకోలేదు,

"నీకు దణ్ణంపెడతా. ఊరుకో," అని ప్రాధేయపడ్డాడు.

"అట్లా దొరికిరా." అని వొదిలిపెట్టింది.

పాపారావు లేచి కూర్చున్నాడు. రొప్పుతూ, "ప్రాణాలు తీసి వేశావ్," అన్నాడు.

"ఇంతమాత్రానికే?" అని నవ్వింది కాంతమ్మ.

నెమ్మదిగా కబుర్లలోకి దింపింది. అతని సంగతులన్నీ అడిగి తెలుసుకుంది.

"సరేగాని నువ్వెక్కడనుంచి వొచ్చావ్?" అని అడిగాడు పాపారావు.

"ఆకాశాన్నుంచి."

"ఆకాశంలో వుండే చుక్కవా నువ్వు. గాలికి రాలిపడ్డావా?" అని పరియాచికం ఆడాడు పాపారావు.

"అబ్బో చాలాపెరకుందే అబ్బాయి తెలివి!" అని ఆశ్చర్యం వెలిబుచ్చింది కాంతమ్మ.

"పోనీ చెప్పకపోతే చెప్పకపోయావు. వాళ్లు నీ కేమవుతారో చెప్పు."

"ఎవళ్ళు?"

"వాళ్ళు," అని దూరంగా పడుకున్న మిగిలిన ముగ్గురునీ చూపాడు పాపారావు.

"బావలు." అన్నది కాంతమ్మ.

"మరి నేనేమవుతాను?"

"బుల్లి బావవి."

"ఛీ పో," అన్నాడు పాపారావు సిగ్గుతో తల వంచుకుంటూ.

"ఏం? నాకంటే మంచి మరదలు దొరుకుద్దా నీకు?"

"నాకు మరదలే వద్దు." అన్నాడు పాపారావు.

"అదీ చూద్దాంగా ఎన్నాళ్లో?" అన్నది కాంతమ్మ.

ఇద్దరూ కాసేపు మెదలకుండా కూర్చున్నారు. చివరికి పాపారావు ధైర్యంచేసి అడిగాడు. "మాకు అన్నాలుపెట్టి నువ్వు యాడకు పోతావ్?"

"వూళ్లోకి."

"వూళ్లో ఎవరున్నారు నీకు."

"లక్షమంది బావలు," అన్నది కాంతమ్మ. పాపారావు బిగ్గరగా నవ్వాడు.

"ఏం అన్ని ఇవరాలూ అడుగుతుండావు? నన్నేమన్నా అదుపులో పెడతావా?"

"లేదులే. ఊరికినే అడిగా."

ఆమె సమాధానం చెప్పలేదు; కాసేపు ఇద్దరూ మెదలకుండా కూర్చున్నారు. దూరంగా పడుకునివున్న ముగ్గురూ తమనే చూస్తూ వున్నారని గ్రహించాడు పాపారావు. తనకుమల్లే వాళ్ళూ పొట్ట కోసం టౌనుకి వచ్చినవాళ్ళే. అందులో వొకని పేరు శివయ్య. చేతిబండి లాగుతూవుంటాడు. రెండవవాని పేరు వెంకన్న. అతను తనకుమల్లేనే రిక్షా లాగుతూ వుంటాడు. మూడవవాని పేరు ముసలయ్య. కూరగాయలు లాట్లులాట్లుగా కొని తోపుడు బండిమీద వూరంతా తిప్పి అమ్ముతూ వుంటాడు.

వాళ్ళందరూ తనంటే ఇష్టంగానే వుంటారు. కాని వుండివుండి వొకరోజు ఏం వుండు పుడుతుందో సూటిపోటి మాటలు అంటూ వుంటారు. అది మామూలు కాంతమ్మ తనతో వొంటరిగా మాట్లాడినరోజు అయివుంటుంది. తాను కాంతమ్మతో మాట్లాడటం వాళ్ళకు కోపం అని గ్రహించాడు పాపారావు. ఎందుకు వాళ్ళకి అనవసరంగా కోపం తెప్పించటం? కాంతమ్మకి వొంటరిగా కనపడకుండా తప్పుకు తిరుగుతుండేవాడు.

"ఏమిటి ఆలోచిస్తుండావు?" అని అడిగింది.

"వాళ్లు మననే చూస్తున్నారు," అన్నాడు పాపారావు.

"ఏడవనీ," అంది కాంతమ్మ.

అతనికి కొంచెం ధైర్యం వొచ్చింది. "నువ్వు యాడ పుట్టావు? ఈడకి ఎందుకు వొచ్చావు? సవిస్తరంగా చెప్పు," అని అడిగాడు.

"నీకుమల్లేనే పుట్టా. నీకుమల్లేనే వొచ్చా"

"వనవసలుపోక ఉన్నది ఉన్నట్టు చెప్పు."

అతను గట్టిగా అడిగే టప్పటికి, 'ఎంత చెడ్డా మొగాడు మొగాడే' అనుకొని చిరునవ్వు నవ్వుతుంది కాంతమ్మ.

తన వూరు పేరు చెప్పింది. మొగుణ్ని విడిచిపెట్టి వొచ్చానని చెప్పింది. శోభనాద్రి అనే కుట్టుమిషన్ పనిచేసే అతను వాళ్ల వూళ్లో వుండేవాడట. అతనితో లేచి వచ్చివేసిందట.

''మొగుడ్ని ఎందుకు ఇడిచిపెట్టావు?'' అని అడిగాడు పాపారావు "కొట్టేవాడా?''

ఆమె నవ్వి, "నీ తెలివి తగలడ్డట్టే వుంది,'' అన్నది.

"ఏం?"

"కొట్టే మొగుణ్ని ఏ ఆడదన్నా ఇడిసిపెడతుందటయ్యా?" అని అడిగింది.

పాపారావుకు అర్థం కాలేదు. మామూలుగా విడిచిపెట్టబడ్డ మొగుళ్లు మంచివాళ్ళుగానే వుంటారనే సంగతి అతనికి జ్ఞాపకం వొచ్చింది. తన స్వగ్రామంలో చిన్నయ్య అనేవొక రైతు వుండే

వాడు. అతను చాలా మంచివాడు. ఎవ్వర్నీ పల్లెత్తుమాటైనా అనే వాడుకాదు. అతనిభార్య లేచిపోయింది. ఎవ్వరితో ? తాడూ బొంగరంలేని వొక తాగుబోతుతో. అయినా కొంతమ్మ యవ్వారం ఇంకా విపరంగా తెలుసుకోవాలనుకున్నాడు.

"మరెందుకు లేచిపోయావ్ ?" అని అడిగాడు.

"అతను వొట్టిమొద్దు. పొద్దున్నే చద్దిబువ్వతిని పొలంపనికి పోయేవాడు. మళ్ళీ పొద్దుగూకినాక తిరిగొచ్చేవాడు. ఇన్ని వేన్నీళ్లు పోసుకొని అన్నం తిని పడుకొని నిద్రపోయేవాడు. ఏ ఏటికో కోటికో నేను మొద్దునిద్దర్లో వున్నప్పుడు వొచ్చి నా కాలు గీరే వాడు."

కాలుగీరే విధానానికి అతనికి నవ్వొచ్చింది. బిగ్గరగానవ్వాడు.

"అందరూ అంతేలే !" అన్నది కొంతమ్మ చిరునవ్వు ఆపుకుంటూ.

"ఆ సంగతి నీకెప్పుడు తెలిసింది ?"

"టౌనుకి వొచ్చినాక."

"నేను ఎప్పుడన్నా నీ కాలు గీరానా అందరూ అంతేలే అంటున్నావుగాని ?" అని అడుగుదాం అనుకున్నాడు పాపారావు. సిగ్గువేసి మాట మార్చాడు.

"ఇప్పుడు యాడ వుంటున్నాడు ?"

"ఎవడు ?"

"ఆ కుట్టు మిషన్‌వాడు." అన్నాడు పాపారావు. ఎందుకోగాని ఆ కుట్టుమిషన్ వాడిమీద తనకు కోపంగావుందని గ్రహించాడు పాపారావు.

"మరొకదాన్ని పెట్టుకొని ఈడనే వున్నాడు."

"ఈడకు తీసుకువచ్చి నిన్ను విడిచిపెట్టి వేశాడా !"

ఈ ప్రశ్నకు కొంతమ్మ స్వాతిశయం దెబ్బతిన్నది. "ఆడిని నేనే ఇడిచిపెట్టా," అన్నది కోపంగా.

"కాదు ఆడే నిన్ను ఇడిచిపెట్టాడు. నాకు తెలుసు," అన్నాడు పాపారావు.

"నీ కెట్లా తెలుసు ? నువ్వు ఎవరినన్నా యిడిసిపెట్టావా ?"

"ఇడిసిపెట్టినోళ్ళని చూశా ? లేపుకురావటం, యిడిసిపెట్టటం అదే ఆళ్ళపని."

"అబ్బో, పెపంచకం అంతా తనిఖీ చేసినోడికిమల్లే మాట్లాడుతుండవే !" అన్నది కొంతమ్మ. అతని మాటలకు ఆమె లోలోపల మురిసింది.

"ఆ మిషనోడి దగ్గరనుంచి ఈడకు వొచ్చావన్నమాట !"

"మద్దెన వొకకాడ మకాం చేస్తినే !" అన్నది.

"యాడ".

"టౌన్లో సైకిల్‌షాపు పెట్టుకున్నాడే ఈరయ్య ఆడికాడ.

పాపారావుకి జ్ఞాపకం వొచ్చింది ఆ షాపు. వొకసారి తనకు సైకిలుకావలసివస్తే కొంతమ్మ అక్కడ ఇప్పించింది. అతను అద్దె తీసుకోకుండానే ఇచ్చాడు. ఎందుకు ఇచ్చిందీ అప్పుడు తనకు అర్ధం కాలేదు.

సైకిలు ఇచ్చి, "ఎక్కడా కనపట్టం లేదేమే కొంతమ్మ ?" అని అడిగాడు.

"కనపడాల్సిన కర్మ నాకేం బట్టే ?" అన్నది కొంతమ్మ.

"కొత్త పిట్టని ఎక్కడో పట్టినట్టున్నావే ?" అన్నాడు తన వంకకు చూస్తూ.

"కాలవగట్ట మీద," అన్నది కొంతమ్మ.

"వొకసారి కనపడు," అన్నాడు వీరయ్య స్వరం తగ్గించి.

"తీరికవుంటే చూస్తాలే," అన్నది కొంతమ్మ.

ఇదంతా జ్ఞాపకం వొచ్చి, "అడినీ నువ్వే యిడిసి పెట్టావా ?" అని అడిగాడు పాపారావు.

"నిజం చెపితే మాత్రం నమ్ముతావు గనకనా !" అన్నది కొంతమ్మ.

"నమ్ముతా లే."

"నేనే యిడిసి పెట్టా."

"ఎందుకు ?"

ఆమె వొక్కక్షణం ఆలోచించి. "ఏందో అనుకుంటాం గాని అబ్బాయి ఈ మొగాళ్లంతా వొక్కటే. పదిరోజులు ఆళ్లతో కాపరం చేస్తే, ఆళ్ల మొహం చూడబుద్ధి అవదు, అన్నది. ఇది వరకు మల్లే నవ్వులాటలకు కాకుండా ఈ సారి సీరియస్‌గా చెప్పింది. పైకి ఆమె అవాకులు చెవాకులు పేలుతున్నా లోపల చాలా బాధ పడుతూ వున్నట్టు పాపారావుకి సైతం గోచరించింది.

"టౌన్‌కి వొచ్చినాక, మళ్లీ మీ వూరు ఎప్పుడన్నా వెళ్లావా ?"

"ఎళ్లలా"

"అత నెప్పుడన్నా కనిపించాడా ?"

"ఎవడు ?"

"ఆకాలు గీరేవాడు"

ఆ మాటకు గుక్కలుబట్టి నవ్వింది కొంతమ్మ. "వొట్టప్పుడు

కాదు. మొద్దు నిద్దర పోనిచ్చి అప్పుడు గీరేవాడు వాడి జిమ్మడ.''
అని విరగపడి నవ్వింది.

''మొత్తానికి గట్టోడవే.'' అని వొక ప్రశంసా పత్రం పార వేసింది.

''ఇంతకీ అతను కనిపించాడో లేదో చెప్పలేదు,'' అన్నాడు పాపారావు.

"కనిపించకే ? నెలకొక తూరయినా కనిపిస్తాపుంటాడు.''

"ఏమంటాడు ?''

"నన్ను ఇంటికి రమ్మంటాడు. మొదట్లో నన్ను చూసినప్పుడు అతగాడికి నన్ను గుర్తు పట్టటమే కష్టం అయింది. 'వూళ్లో అందరూ నువ్వు చెడిపోయావని అంటుంటే నిజమే అనుకున్నా. నీకేం? బంగారంలా గున్నావు. వొళ్లుకూడా చేశావు' అన్నాడు మొద్దు చచ్చినాడు."

"ఈ మద్దెన ఎప్పుడన్నా కనబడ్డాడా ?"

"నిన్నకాక మొన్నేగా కనపడ్డది. నెలకోసారి ఏదో వొకపని మీద వస్తాడు. నేను కనపడేదాకా కాలవ ఒంతెనమీద కూర్చుంటాడు చూసిగాని ఎళ్లడు."

"ఏమన్నాడు ?"

"మామూలు పాటే. 'నువ్వు ఎళ్లిందగ్గరనుంచీ తిండికూడా సరిగా అమరటం లేదే. కూడు ఉడకేసి పెట్టేవాళ్లుకూడా లేక మొహం వాచి చస్తున్నాను. రావే' అన్నాడు.

"పోనీ ఎళ్లగూడదూ ?"

"నే చచ్చినా ఎళ్లను"

"ఎందుకనేం ?" అని రెట్టించి అడిగాడు పాపారావు.

"నీకెందు కయ్యా ఈ ఆడోళ్ల సంగతులన్నీని," అని కసిరింది కాంతమ్మ. కసరటానికి కసిరిందిగాని వెంటనే పశ్చాత్తాప పడింది.

"అతగాడు నాకు కనిపిస్తే కాలు గీరవొద్దని చెపుతాలే. వెళ్లు," అన్నాడు పాపారావు.

"గీరినా మేలుకొని వున్నప్పుడు గీరమను," అన్నది కాంతమ్మ చెంగు నోటికి అడ్డం పెట్టుకొని నవ్వుతూ.

"నిజంగా నువ్వు మీ వూరు వెళ్తేనే బాగుంటుంది కాంతమ్మా." అన్నాడు పాపారావు నవ్వులు ఆగిన పిమ్మట.

"నాకూ ఎళ్దామనే ఉందయ్యా. ఆ ముసలాడిని చూసినప్పుడల్లా ఎక్కడలేని జాలీ ముంచుకొస్తుంది. అతగాడు అడిగేదల్లా ఇంత ముద్ద ఉడకేసి పెట్టమనేగందా. అడ్డమైనోళ్లకీ ఉడకేసి పెట్టగా లేంది, కట్టుకునోడికి ఆడికి ఉడకేసి పెట్టటానికేం ? కాని నాకు ఆ వూళ్లో ఏమీతోచదయ్యా. ఎళ్ళినా మళ్లీ నాలుగు రోజుల్లో తిరిగి రావాలనిపిస్తాదే. ఎళ్లటం ఎందుకు ? రావటం ఎందుకు ? ఆముసలోడి పుండుమీద కారం జల్లినట్లేగా అయ్యేది. అందుకని నేను ఎళ్లనే ఎళ్లను." అన్నది.

ఇక అప్పటికి ఆసంగతి అపేశాడు పాపారావు. కాని కాంతమ్మ సుఖపడాలంటే మొగుడి దగ్గరకు వెళ్ళటంకంటే వేరు మార్గం లేదని నిశ్చయించుకున్నాడు ఇప్పుడు కాకపోయినా ఎప్పటికైనా తన మాట వింటుందనే ధైర్యంకూడా అతనికి కలిగింది.

ఇక్కడ ఎవ్వరున్నారు ఆమెకు ? ఒంట్లో సత్తువ వున్నన్నాళ్లూ ఆపనీ ఈపనీ చేయించుకొని ఇంత ముద్ద పెడతారు. తరువాత ఆమె ఎవరికి కావాలి ? కుళ్ళిన టొమాటోను విసిరిపారవేసినట్లు ఏ చెత్తగుట్టమీదకో విసిరి పారవేస్తారు.

అన్నిటికంటే ఇంతమంది మొగాళ్ళను చూచిన పిదప కాంతమ్మకు మిగిలింది మొగుడిమీద ఇష్టమే అని గ్రహించాడు పాపారావు. అందుకని వాళ్ళని కలపాలనుకున్నాడు.

పాపారావు ఆలోచనలను కొంతవరకు కనిపెట్టింది కాంతమ్మ. "నా గొడవల్తో నీకెందుకయ్యా, పడుకొని నిద్రపో. ఆలస్యం అయితే పేకువజామున లెగవ్వు. రిక్షా లాగటంకూడా కష్టం అవు తుంది మరి నేను ఎళ్ళొస్తా," అని లేచింది.

"ఎక్కడకు పోతా విప్పుడు ?" అని అడిగాడు పాపారావు.

"ఏట్లోకి" అని సమాధానం చెప్పింది కాంతమ్మ. ఆమె ఈ మాట నవ్వుతూనే అన్నా నిజమే చెప్పిందనిపించింది పాపారావుకి. మాట్లాడక పూరుకున్నాడు.

కాస్తదూరంలో పడుకొని వాళ్లని గమనిస్తున్నవాళ్లల్లో వొకరి పేరు శివయ్య అని చెప్పాను. అతను చేతిబండి లాగుతూ వుంటాడనికూడా చెప్పాను. అతనిని పిలిచింది కాంతమ్మ, "ఓ పెద్దబావా, నన్ను సాగనంపుదువుగాని రా."అని.

"ఎక్కడికే, అత్తోరింటికా ?" అని పరియాచికం ఆడాడు శివయ్య.

"అత్తోరింటికి పంపే అంత ముదనష్టపు వాడివీనూ నువ్వు," అన్నది కాంతమ్మ.

"మరెక్కడికే ?"

"కాటితోపుదాకా పంపొద్దువుగాని. అక్కడవుండే దెయ్యాలని చూస్తే నాకు భయం బావా," అన్నది కాంతమ్మ.

"సరిపద. మరదలుపిల్ల మాట యినకపోతే నోట్లోకి మెతుకు

దూరదు." అని లేచి, పక్కన వేసుకున్న పైపంచ దులుపుకొని, తలకు చుట్టుకొని బయలుదేరాడు శివయ్య.

ఇద్దరూ చీకట్లో కలిసిపోయారు.

పాపారావు ఆలోచిస్తూ పడుకున్నాడు. అతను టౌనుకి వచ్చి ఇంకా నెలరోజులన్నా కాలేదు. అంతా కొత్తగా వుంది. రిక్షా లాగటం ఇంకా అతనికి అభిమానంగానే వుంటూవుంది. నిగ్గదీసి డబ్బు అడగటం చేతగావటం లేదు. అయినా ఇంతవరకు పది రూపాయలూ మిగిల్చి స్వగ్రామంలో వున్న తల్లికి పంపాడు.

డబ్బు అయితే సంపాదిస్తున్నాడుగాని. దానితోపాటు మనస్సులో ఆరాటం పెరుగుతూ వుంది. టౌన్లో ఎవ్వరినీ నా వాళ్లు అని అనుకోవటానికి వీల్లేదు. ఎవ్వరిని నమ్మడానికీ వీల్లేదు. వీలు దొరికితే అందరూ ఆరగికొట్టేవాళ్లే.

ఇటువంటి చోట కాంతమ్మలాంటి ఆడమనిషి ఇన్నాళ్లూ బ్రతకటమే అతనికి చోద్యంగా కనిపించింది. ఆమె మీద అమితమైన జాలి కలిగింది. ఆరోజు మొదలుకొని వారిద్దరి మధ్యా ఇతరులకు అర్థంకాని వొక సంబంధం ఏర్పడి వుంది.

* * *

ఆ రోజు రిక్షా, యజమానికి అప్పగించి ఇంటికి వచ్చేటప్పటికి కాంతమ్మ నేలమీద పడుకొని వుంది. శివయ్య ఇంకా ఇంటికి వచ్చినట్లు లేదు. మిగిలిన ఇద్దరూ తిండితిని బయట చాపలు పరుచుకొని పడుకొని వున్నారు.

"అన్నం పెడతావా కాంతమ్మా ?" అని అడిగాడు.

"పెట్టుకు తినవయ్యా," అన్నది కాంతమ్మ.

అతనికి కష్టం వేసింది. తను వొచ్చేదాకా ఎదురుచూస్తూ కూర్చొని రాగానే అన్నం పెట్టేది. తనకు అన్నం పెట్టటం ఆమెకు సరదాగా వుండేది. తాను అన్నం తింటుంటే ఎదురుగా కూర్చొని ఆ రోజు వూళ్లో జరిగిన సంగతులన్నీ చెప్పేది. 'ఆ వచ్చినాడు కలికాడు' అనేది. అడిగితే ఏ వచ్చినాడో చెప్పేది. ఆ కథంతా ఏకరువు పెట్టేది. ఇవ్వాళ ఎందుకు ఇంత సాజాతగా వుంది ?

"వొంట్లో బాగాలేదా ?"

"బాగాలేదయ్యా"

అతను వెళ్లి కుండలో అన్నం పళ్ళెంలోకి పెట్టుకున్నాడు. పిడతలో వంకాయపచ్చడి వుంది. ఇంకా ఏమన్నా చేసిందేమోనని వెతికాడు.

"ఇవ్వాళ ఏమీ చెయ్య మనసవలేదు," అన్నది కాంతమ్మ కండ్లు తెరవకుండానే.

పచ్చడి కలుపుకు తిన్నాడు. వొక గ్లాసుడు మంచినీళ్లు గటగట తాగేశాడు.

"చల్ల పట్టిమీద వున్నయి," అని నీరసంగా చెప్పింది కాంతమ్మ. పట్టిగ పోసుకొని రెండు ముద్దలు తిని లేచాడు పాపారావు.

"అప్పుడే లేచావేం ?"

"తిన్నాను."

"ఇవ్వాళ వొక్క కూరన్నా వండి పెట్టలేకపోయాను," అని విచారించింది కాంతమ్మ.

"దానికేంగాని, ఏందంట ఈ వంట్లో జబ్బు ;"

"ఏమీలేదు."

"చెప్పవా ?"

కాసేపు ఆలోచించి, "నీతో చెప్పేది కాదులే," అన్నది కాంతమ్మ.

"మరెవ్వరితో చెపుతావ్ ? నీ పెద్దబావతోనా ?"

కాంతమ్మ కాసేపు ఆలోచించింది. ఆ దీపపు వెలుగులో అతని ముఖకవళికలు చూడటానికి ప్రయత్నించింది. అతనికి కోపంవచ్చి అన్న మాటగాలేదు. "అదికెందుకు చెప్పటం ?" అన్నది. "ఆర్చే వాడా, తీర్చేవాడా ?"

ఆమెకు తెలియకుండానే, ఆమె కంఠంలో కన్నీరు పలికింది. ఆమె యీ జీవితంలో అనుభవించిన బాధలన్నీ ఆ ధ్వనిలో పాపారావుకి వినిపించినై. అంతకుముందు ఏ తలనొప్పో కాలునొప్పో అనుకొని కుస్కారించాడు. ఇప్పుడు అట్లా అనిపించలేదు. ఆమెకు దగ్గరగా కూర్చొని, "పోనీ వైద్యుణ్ణి తీసుకొస్తా," అన్నాడు.

"మందులకు రగ్గే జబ్బు కాదులేవయ్యా," అని ఈసడించి వేసింది కాంతమ్మ. "నీకెందుకు ? నువ్వెళ్ళి పడుకో," అన్నది.

అతను కాసేపు ఊరుకున్నాడు. కళ్ళల్లో నీళ్ళు నిలిచినై. ఇలా అన్నాడు.

"నీకు జబ్బుగావుంటే నా మనసు బాగాలేదు కాంతమ్మా. నాకు నిద్దరకూడా పట్టదు. వలాని జబ్బని చెపితే నీ సొమ్మేం పోయింది. ఇవ్వాళ నేను రెండున్నర రూపాయిలు సంపాదించాను. నీతో చెపితే సంతోషిస్తావుగదా అని గబగబా వొచ్చాను. నువ్వు ముసుగేసుకు పడుకున్నావు. జబ్బేమిటంటే చెప్పవు. ఇది నీకేమన్నా న్యాయంగావుందా కాంతమ్మా ?"

పాపారావు మనస్సును చీల్చుకొని వచ్చిన ఈ మాటలకు

కాంతమ్మ ఊగిపోయింది. సంఘంలో వున్న బటాచోరు లందరినీ తృణీకరిస్తూ తిరిగేటట్టు చేసిన శక్తి ఆ క్షణం ఏమయిందో! కన్నీరు వోడికలు కట్టేట్టు ఏడ్చింది. మినుకుమినుకు మంటూ వెలుగుతున్న ఆ కిరసనాయిలు దీపం పాపారావునుంచి ఆమె కన్నీటిని దాచింది. ఆమె మనస్సులో ఏదో నిర్ధారణ చేసుకొని చీరె చెరుగుతో కన్నీరు తుడుచుకొని లేచి కూర్చుంది.

"ఏడుస్తున్నావా కాంతమ్మా?" అని అడిగాడు పాపారావు.

"లేదయ్యా."

"పోనీ చెప్పకపోతే పోయావులే."

"చెప్పగూడదని కాదయ్యా...."

"మరెందుకంట."

"ఇప్పుడు నా కొచ్చింది ఆడోళ్ళ జబ్బు."

"ఏం దది?"

"నాకు నెల తప్పిందయ్యా."

ఒక్క క్షణం పాపారావుకి ఏమీ తోచలేదు. ఈ నెలతప్పటం అనే మాట సంతోషంగా చెప్పిన వాళ్ళను అతను ఎరుగును. ఆడ మనిషి నోట ఈ మాట ఇంత బాధగా వినటం అతనికి ఇదే మొదటిసారి. వెంటనే ఆమె బాధకు కారణం అతనికి తట్టింది.

"ఎవ్వరు? ఎవరు కాంతమ్మా?" అని ప్రాణాలను బిగబట్టి అడిగినట్లు అడిగాడు.

"ఎట్లా చెప్పేది?" అన్నది కాంతమ్మ.

అతనికి ఆమె పరిచయస్తులందరూ వొక్కసారిగా జ్ఞాపకం వొచ్చారు. సైకిల్ షాపు యీరయ్యా?" అని అడిగాడు.

"అవ్వొచ్చు," అన్నది కాంతమ్మ.

"పెద్దబావ శివయ్యా?"

ఆమె వొక్క పెద్ద నిట్టూర్పు విడిచి, "అవ్వొచ్చు," అన్నది. ఇక అతను అడగలేకపోయాడు. అతి ప్రయత్నంమీద మనస్సును సర్దుకున్నాడు. "అయిందేదో అయింది కాంతమ్మా. దీనికి నువిట్లా దిగులుపడి కూర్చోవటం ఎందుకు?" అని అడిగాడు.

"నీకు తెలియదులేవయ్యా."

"ఏంది?" విసుగ్గా అడిగాడు.

"నీ బిడ్డ అయ్య ఎవ్వరంటే ఏం చెప్పేది? బిడ్డని ఎట్లా పెంచేదీ? బిడ్డ పెరిగి 'నా అయ్య ఎవ్వరంటే' ఏం చెప్పేదీ?" అని ఆక్రోశంగా అడిగింది, తన కష్టాలకన్నీ అతనే బాధ్యుడు అన్నట్లు.

పాపారావుకి వొక కొత్తచూపు పడింది. మనస్సు తొలిచింది. కొన్ని సమస్యలు ప్రారంభం అయినప్పుడు నామమాత్రం వుండి క్రమక్రమేణా భయంకర రూపం తాలుస్తయి. అందుకని ఈ కొత్త చూపు బలపడినకొద్దీ భయంవేసింది. తాను స్వగ్రామంలో వున్నప్పుడు ఎవ్వరో రోజుల పసిగుడ్డుని గొంతు పిసికి పొదలో పార వెయ్యటం చూశాడు. ఇంకా పొత్తిగుడ్డలు ఆ బిడ్డచుట్టూ వుండనే వున్నయి. ఏదోవొక సినిమాలో పెరిగిన కొడుకు నా తండ్రి పేరు చెప్పమని తల్లిని బాధించటం చూశాడు. ఒక తల్లి ఇతరుల పాపం బయటపడకముందే కాలువలో దూకి ప్రాణాలు తీసుకోవటం విన్నాడు.

అతనికి ముచ్చెమటలు పోసినై. "మరి ఇప్పుడేం చేస్తావ్?" అని అడిగాడు కాంతమ్మని.

అతని కంగారు చూచి, "ఏదోవొకటి చేస్తాలేవయ్యా." అన్నది కాంతమ్మ.

అంతటితో అతను వొదిలి పెట్టలేదు. "నాకు చెప్పాలి," అని భీష్మించుకొని కూర్చున్నాడు.

"వొక గిద్దెడు పసరు పుచ్చుకుంటే సరిపోయె," అన్నది.

"వొద్దు" అన్నాడు పాపారావు.

"ఏం?"

"అయ్యన్నీ మోటు మందులు. తల్లికి కాళ్లూ చేతులూ పడ వచ్చు. ప్రాణాలమీదకు రావొచ్చు. అంతకీ ఆ బిడ్డ అయ్యపేరు చెప్పాల్సొస్తే నాపేరు చెప్పు."

"నీకేం సంబంధం?"

"నిన్నెరిగుంటమే సంబంధం."

"సరేలే నువ్వెళ్లి పడుకో!"

"ఆ మోటు పనులకు దిగవద్దు."

"నీతో చెప్పకుండా ఏపనీ చెయ్యనుగానీ, నామాట విని నువ్వెళ్లి పడుకో."

పాపారావు చాప తీసుకొని బయటకు వెళ్లాడు. అతనిని వెళ్లనిచ్చి ఆవుర్న ఏడ్చింది కాంతమ్మ. ఆమెకు జీవితంలో ఇంత వరకు పాపారావువంటి మనిషి తగల్లేదు. మగవాళ్లంతా మోస గాళ్లే అనుకుంది. తన దగ్గరకువచ్చే మగవాళ్లంతా వొకే కోర్కెతో వస్తారనుకుంది. అందుకనే మగవాళ్లపట్ల నిరసనభావం పెంచుకొని ఇన్నాళ్లూ బ్రతికింది, ఆ నిరసనభావమే ఇన్నాళ్లూ ఆమెకు ఆధారంగా వుండి బ్రతుకును నడిపింది. ఇప్పుడది వొక్క దెబ్బతో తుత్తునియలైంది. ఈ పాపారావు తనకు ఎవరు? తననుంచి కోరేది ఏమిటి? ఏమీలేదు. అయినప్పుడు తనంటే అతనికి

ఎందుకు ఇష్టం? తను మొయ్యవలసిన నిందను అతను మొయ్యటానికి సిద్ధపడ్డాడు. ఇంతకు ముందు తను ఎరగని జీవిత లక్షణం ఏదో తన అనుభవంలోకి వస్తున్నట్లనిపించింది కాంతమ్మకి. అలాగే పడుకొని నిద్రపోయింది.

* * *

ఆనాటి నుంచీ కాంతమ్మ తన సంగతి ఆలోచించటం మానివేసింది. ఆమెకు గర్భిణి అని మిగిలిన ముగ్గురికీ తెలిసింది. ఆమెను లేకుండాచూచి, ఎగరాళిగా మాట్లాడుకుంటూ వుండేవారు. వారి మాటలు వినలేక, "ఆకలగ బోయేది నాబిడ్డే," అని చెప్పాడు పాపారావు.

"అనగానే సరిపోయిందీ?" అన్నాడు శివయ్య.

శివయ్య ఆమాట అనేటప్పటికి ఎక్కడలేని కోపం వచ్చింది పాపారావుకి. "ఆబిడ మనకు అన్నం వండి పెడతావుంది. అందుగ్గాను ఆబిడకు మనం అన్నం పెడుతున్నాం. అంతే. ఇక ఆబిడ సంగతులు ఎత్తవలసిన పని మనలో ఎవ్వరికీ? అట్లావుంటే మనకి కుదురుతుంది. లేకపోతే ఎవరిదారిన వాళ్లు పోవలసిందే," అన్నాడు.

ఆ మాటతో మిగిలినవాళ్లు భయపడి వూరుకున్నారు. భయం ఎందుకంటే అక్కడ అసలు వుడకేసి పెట్టేవాళ్లే దొరకరు. దొరికినా డబ్బు తీసుకోకుండా ఉడకేసి పెట్టేవాళ్లు అసలు దొరకరు. కాంతమ్మకి ముందు వొక ఆడమనిషిని మాట్లాడుకుంటే, ఆమె ఉడకెయ్యటానికి ఇచ్చిన వస్తువులు ఇంటికి జేరవెయ్యటం మొదలుపెట్టింది.

ఈ కారణంవల్ల వాళ్లు పైకి ఏమీ అనటం లేదుగాని, వాళ్ల అయిష్టాన్ని రకరకాలుగా బయటపెడుతూనే వొచ్చారు. కాంతమ్మ బాధ్యతను తీసుకోవటం వాళ్లల్లో వొక్కళ్లకీ ఇష్టం లేదు. కాని పాపారావు కాంతమ్మ తన సొంతం అయినట్లు మాట్లాడుతుంటే వాళ్లకి వొళ్లు మండేది. ఏ కూర వండటంమీదో, పచ్చడి నూరటం మీదో వంకబెట్టి తమ అక్కసు వెళ్లబోసుకునేవాళ్లు.

"పచ్చట్లో ఇయ్యాళ మిరపగాయలే వేసినట్లులేవేం కాంతమ్మా?" అనేవాళ్లు.

"కూరలో కాస్త కరేపాకుకూడా ఏస్తే బాగుండేది," అనేవాళ్లు.

"ఇవ్వాళ అన్నం తోపతోప చేశావేం?" అనేవాళ్లు.

"అసలు నీ మనసు ఇక్కడ వుంటేగా", అనేవాళ్లు.

వెనక అయితే మాటకు పదిమాటలు అనేది కాంతమ్మ. ఇప్పుడు ఎవళ్లేమన్నా నవ్వుతూ వూరుకునేది.

"నీళ్లాడటానికి ఆస్పటాలికి తీసుకెళ్తాడటగా పాపారావు?" అని అడిగాడు శివయ్య వొకరోజు ఎకసెక్కెంగా.

"అసలాడు ఎడవైతే ఎవడో వొకడు తీసుకెళ్తాడు."

"అయితే నేనే నంటావా?"

"ఛీ నోరుముయ్," అన్నది కాంతమ్మ.

"మరిగత్తే పుట్టబోయే బిడ్డ నాబిడ్డే అంటాడే పాపడు," అన్నాడు.

అతనితో ఇక మాట్లాడి ప్రయోజనం లేదని మెదలకుండా ఊరుకుంది కాంతమ్మ.

"ఎట్లా అయితే ఏంగానీ కొడుకైతేమాత్రం నాపేరు పెట్టుకో మరదలు పిల్లా," అన్నాడు శివయ్య.

ఇట్లా వీలు దొరికినప్పుడల్లా ఏదో వొక విధంగా ఆమెను బాధించటం మొదలుపెట్టారు. ఆమె ఈ విషయాలేవీ పాపారావుకి తెలియనిచ్చేది కాదు.

జరిగిపోతున్నయ్ రోజులు. కాంతమ్మ వంటకూడా చెయ్యలేని స్థితికి వొచ్చింది. ఆ పనికూడా తనమీదే వేసుకున్నాడు పాపారావు. పొద్దున్న అన్నం వండి రిక్షా తీసుకువెళ్లేవాడు. సాయంకాలం అయిదు గంటలకల్లా వొచ్చేసి వంటకు కూర్చునేవాడు. మొదట్లో పాపారావు వంట చెయ్యటానికి ఆమె వొప్పుకోలేదు.

"ఎందుకయ్యా నీకీ కష్టం?"

"ఇందులో కష్టం ఏముంది కాంతమ్మా. టౌనుకి వొచ్చిన కొత్తలో కొన్నాళ్లు నేనే వండుకు తినలా. నాకేం కొత్తగనకనా."

"నిన్నుచూచి నీతోటి వాళ్లంతా నవుతున్నారు."

"నవ్వనీ వాళ్ల పళ్లే బయట పడతై."

"నువ్వియ్యన్నీ పెట్టుకు కూచున్నావు. సగానికి సగంకూడా సంపాదన లేకుండా పోయింది."

"ఇంకెన్నాళ్లలే. నువ్వు నీళ్లోసుకున్నాక ఇంతకుముందు సంపాదించిందానికి మూడు రెట్లు సంపాదించకపోతే నా పేరు మారు పేరున పిలువు."

"నువ్వు ఇంటికి డబ్బు పంపించి ఎన్నాళ్లయిందో గాపకం వుందా? ఇంటిదగ్గరోళ్లు ఏమనుకుంటారు?"

అది నిజమే. ఈ మధ్య పాపారావు తల్లి ఉత్తరంకూడా వ్రాయించింది. గడవటమే కష్టంగా వుంది అన్నది. ఆమె విషయం తలుచుకున్నప్పుడల్లా మనస్సుకి దిగులుగానే ఉంటుంది.

కాని ఏంచేసేట్టు ? ఏ కొద్దిగా పంపుదామన్నా డబ్బు మిగలటం లేదు.

''మాట్లాడవే మయ్యా ?''

"నిన్నే పంపాను కాంతమ్మా" అని అబద్ధం ఆడాడు పాపారావు.

''నీ సంపాదన నాకు తెలియదా ఎట్టా ? ఎక్కడనుంచి పంపావు ?"

''ఒక సేహితుడి దగ్గర అప్పుచేసి పంపా.''

''ఆ అప్పెట్టా తీరుస్తావు ?''

"రెక్కల కష్టం మీన,'' అన్నాడు పొయ్యిమీద ఎసరు పెడుతూ.

''ఏమోనయ్యా నీ సంగతి నాకేం బాగాలేదు. నీ సంగతి నువ్వు చూచుకోవు. నా మానాన నన్ను పోనివ్వవు,'' అని కన్నీరు పెట్టుకుంది కాంతమ్మ.

పాపారావు మనస్సు కలుక్కుమన్నది. "ఇంతకుముందు ఎంత కష్ట మొచ్చినా తుస్కారించి వేసేదానివి. ఇప్పుడెందుకు మాట మాటకీ అట్లా కంట తడిపెట్టుకుంటావు ? నీ కొచ్చిన కష్టమేందో చెప్పు."

కాంతమ్మ లమాయించుకొని, "కష్టం లేకేనయ్యా," అని చిరు నవ్వునవ్వింది.

చీకటిగదిలో అకస్మాత్తుగా దీపం వెలిగి నట్లయింది అతనికి.

''అది సరేగానీ ఇట్లా వొచ్చి నా పక్కన కూచో.''

"ఎందుకంటే ?" అన్నాడు పాపారావు సిగ్గుపడుతూ.

"వొకమాట చెపుతా."

''ఇక్కడికి ఇనపడుతుందిలే, చెప్పు.''

"ఏహచోమంటా వుంటే ?" అని గద్దించింది కాంతమ్మ.

నెమ్మదిగా వెళ్ళి ఆమె సరసన కూర్చున్నాడు పాపారావు.

"నిన్నెందుకు ఆ ఎంకన్నతో పోట్లాడావంట !"

"నీ కెట్లా తెలిసింది ?"

"ముసలయ్య అన్నాడు."

పోట్లాటకు కారణం చెప్పటం ఇష్టంలేక మెదలకుండా పూరుకున్నాడు పాపారావు.

"నువ్వు చెప్పకపోయినా నాకు తెలుసులేవయ్యా."

"తెలిస్తే నువ్వే చెప్పు"

"నన్నేదో అన్నాడని ఆడితో పోట్లాడావు."

"తప్పా ?"

"తప్పో వొప్పో, ఆడసలే కక్షమనిషి. ఆడితో పెట్టుకోకు."

"ఆడికి నువ్వంటే ఎందుకు అంత కోపం ?" అని ఉన్నవాడు ఉన్నట్టుండి అకస్మాత్తుగా అడిగాడు.

"నేనంటే అందరికీ కోపమే."

"ఈడి కెందుకూ అంట."

"వాడికి వుండే కారణం వాడికి వుంది."

"ఏందది ?"

వొకప్పుడైతే చెప్పకపోనేమో ; ఇప్పుడామె చాలా బలహీనంగా వుంది. పైగా చేసిన పనులన్నీ అతనికి చెప్పివెయ్యాలనే కోర్కెతో వుంది. అందుకని చెప్పింది.

''వొకసారి ఆడు వరసగా మూడు రోజులు రిక్షా అద్దె యజమానికి కట్టలేదయ్యా. వొచ్చింది వొచ్చినట్టు తాగేశాడు. రిక్షా యజమాని డబ్బు కట్టందే రిక్షా ఇవ్వనన్నాడు. ఇవ్వాల్సిన డబ్బుకి పోలీసోళ్ళకి రిపోర్టు చేస్తానన్నాడు. ఆడికి పోలీసోళ్ళంటే చచ్చే భయం. అపాట్న వొచ్చి నా కాళ్ళమీదపడి బతిమాలాడు. నాకు జాలేసింది. యజమాని ఇంటికి వెళ్ళి నెమ్మదిగా తీర్చుకుంటాడని చెప్పి రిక్షా ఇప్పించా. అప్పటినుంచీ ఆడికి నామీద కోపం. మొదటి రోజుల్లో అసలు నాతో మాట్లాడేవాడేకాదు."

''నువ్వెళ్ళి అడిగితే యజమాని వొప్పుకున్నాడా ?" అని అడిగాడు పాపారావు, ఆమెవైపుకి చూడకుండా.

''ఎందుకు వొప్పుకోడు ?"

''అతడికీ డబ్బుకీ లంకెగందా.''

''మనిషికి వొక డబ్బే కాదయ్యా, కావల్సినయి ఇంకా చాలా వుంటై. అంతకుముందు వొకరోజు నాకు కబురెట్టాడు. నేను ఎళ్ళలేదు. నా అంత నేనే ఎళ్ళేటప్పటికి మురిసిచచ్చాడు.''

పాపారావు కడుపులో ఎవ్వరో చెయ్యిపెట్టి దేవినట్లయింది.

''ఈ సంగతి ఆడికి తెలుసా ?''

''ముందే తెలుసు. తెలిసే నన్నెళ్ళమని బతిమాలాడు.''

"ఈసారి ఆడు కనపడితే కాళ్ళూ చేతులూ ఇరగ్గొట్టిపారేస్తా."

''అటువంటిపనే చెయ్యొద్దంట,'' అన్నది కాంతమ్మ కోపంగా.

''ఇక్కడి వాళ్ళతో నువ్వు ఎవ్వరితో పోట్లాడినా నేనిక్కడ వుండను నా దారిన నేను పోతా.''

''ఎక్కడికి పోతావ్ ?''

"ఏం ? నాకు కట్టుకున్న మొగుడు లేనట్లు మాట్లాడుతున్నావ్? ఆడి దగ్గరకు పోతా ?"

అంత కోపంలోనూ ఆమె మాటలకు నవ్వొచ్చింది పాపా

రావుకి. ''అదేమో నిన్ను మొద్దునిద్దర పోనిచ్చి కాలు గీరతాడు'' అన్నాడు.

ఆమె అతని కళ్ళల్లోకి బలహీనంగా చూచి నవ్వింది. వొక్క క్షణం కండ్లు తళుక్కున మెరిసినై. ఆ తళుకు ముఖానికంతా వ్యాపించింది. "నిన్ను చూచినప్పుడల్లా నాకు బతకాలని అనిపిస్తుందయ్యా,'' అన్నది.

''బతక్కేంచేస్తావ్ ?'' అన్నా డతను గట్టిగా తనను చుట్టు ముడుతున్న భయాన్ని పోగొట్టుకునేందుకు.

ఆమె మాట్లాడలేదు. కళ్ళల్లో అంతకుముందు మెరిసిన తళుకు ఇట్టే ఆరిపోయింది.

''నువ్వు చక్కగా నీళ్లోసుకో, నిన్నూ నీ బిడ్డనీ తీసుకువెళ్ళి నేనే అప్పగించి వస్తా.''

''నన్నయితే నేను ఎప్పుడెళ్ళినా ఏలతాడు. ఈ బిడ్డ నా కెందు కంటే ?''

''తీసుకొచ్చి నేనే పెంచుకుంటాను.''

''ఆమాటన్నావ్, బాగుంది.'' తృప్తిగా, ప్రశాంతంగా నవ్వు కుంది తనలోతాను.

''ఒకమాట, మళ్ళీ మరచిపోతానేమో, ఇప్పుడే చెప్పేస్తా.''

''ఏందది ?'' అని ఆప్యాయతగా అడిగాడు పాపారావు.

''నన్నొదిలి వొచ్చేటప్పుడు కాలు గీరొద్దని చెప్పు ఆడికి. గీరితే మేలుకున్నప్పుడే గీరమను.''

''అట్లాగే,'' అన్నాడు పాపారావు విరగబడి నవ్వుతూ.

* * *

ఒకరోజు కాంతమ్మకు జ్వరం వొచ్చింది. జ్వరం కొద్దిపాటిదే. కాని ఎంత బ్రతుకుదామని ప్రయత్నించినా ఆమెకు బ్రతకబుద్ధి అవటంలేదు. బ్రతకాలని కోరుకోవటం ఆమెకు చేతగావటం లేదు. బ్రతకాలనే అపేక్షకు ఆధారమైనదేదో ఆమెలో తెగిపోయి నట్లు అనిపిస్తూ వుంది ఆమెకే.

"వైద్యుణ్ణి పిలుచుకొస్తాను," అన్నాడు పాపారావు.

"దేనికి వైద్యుడు ? రేపటికి అదే తగ్గిపోతుంది," అన్నది కాంతమ్మ.

కాదు గూడదని అతను మొండికేసి కూర్చున్నాడు.

"డబ్బెక్కడ తెస్తావయ్యా," అని అడిగిందామె.

"డబ్బు దేముంది ? ఇంటి ఎనకవున్న నల్లకుక్కను కొడితే వొస్తుంది," అన్నాడతను.

ఇక ఆమె అతనిని వారించలేదు. సాయంకాలం అయ్యేటప్పటికి ఎట్లాలేదన్నా వొక్క అయిదు రూపాయిలన్నా సంపాదించా లనే సంకల్పంతో బయలుదేరాడు పాపారావు. యజమాని ఇంటికి వెళ్ళి రిక్షా తీసుకొని బజారుకి వెళ్తూవెళ్తూ కాంతమ్మని వొకసారి చూచి పోదామని వెళ్లాడు.

ఇంటిముందు పోలీసు వున్నాడు. అతనితో శివయ్యా, ఎంకన్నా ఏదో మాట్లాడుతూ వుండటం చూశాడు పాపారావు. గబగబా సరాసరి ఇంట్లోకి వెళ్లాడు. ఆ పోలీసు తన్నంత తీక్షణంగా ఎందుకు చూస్తున్నాడో అతనికి అర్థం కాలేదు.

కాంతమ్మ చాప పరచుకొని పడుకొని వుంది.

''ఎట్లావుంది ?''

''తేలిగ్గానే వుంది.''

ఆమె మొహం చూస్తే నిజంగానే తేలిగ్గా ఉందనిపించిం దతనికి.

''ఇంకా ఎళ్ళకుండా ఈడే కూర్చున్నావేం ?''

''ఎళ్తూ ఎళ్తూ ఎట్లావున్నావో చూచిపోదామని వచ్చా.''

"నా కే ఇబ్బందీ లేదయ్యా. నువ్వు పని పాడుచేసుకోమాక."

''బయటవున్న ఆ పోలీసు ఎవడు ?''

''నాకు జబ్బుగా వుందని ఎవరో చెపితే చూసిపోదామని వచ్చాడు.''

"నువ్వు ఎరుగుదువా ?''

''ఎరక్కేం ? నాలుగుబజార్లూ కలిసినచోట చేతులు వూపు కుంటూ నిలబడతాడు. అతడ్ని ఎవ్వరెరగరు ?''

''మంచోడేనా ?''

''మంచోడే ! ఈళ్ల చేసే పనులకి అతను ఉండబట్టి సరిపో యింది. ఈళ్ళమీద నేను ఎన్ని కేసులు తప్పించాను ! అతను మంచోడు కాకపోతే ఈ పాటికి ఈళ్ళంతా జైల్లో మడ్డికూడు తింటావుండేవాళ్లే.''

ఇంకా ఏదో అడుగుదాం అనుకున్నాడు పాపారావు. అడగ బుద్ధిపుట్టలేదు.

''సరే నే పోతున్నా,'' అని బయలుదేరాడు.

''తొరగా రా,'' అన్నది.

ఎందుకు అన్నట్టు చూశాడు పాపారావు.

''ఏం లేదు. ఎందుకోగాని, నీకు వొక్కసారి చక్కలిగింతలు పెట్టాలని వుంది.''

అతనికి మొదటిరోజులు జ్ఞాపకం వొచ్చినై. తరవాత ఆమె వొకటిరెండుసార్లు చక్కలిగింతలు పెట్టబోయిందిగాని, అతను

అందకుండా తప్పించుకొని పారిపోయాడు. ఇవ్వాళ తప్పించుకో దలచలేదు.

"అట్లాగే పెడుదువుగాని, తొందరగానే వొస్తా," అని చెప్పి బయలుదేరాడు.

బయట పోలీసులేడు. ఎవ్వరూలేరు. ఎవ్వరి పనిమీద వారు వెళ్ళిపోయారు అనుకున్నాడు పాపారావు. అయిదు రూపాయిలు సంపాదించి వైద్యుణ్ణి తీసుకురావాలనే ధృఢసంకల్పంతో రిక్షా బర్రున తొక్కుకుపోయాడు.

ఎంత డబ్బు ఇస్తానన్నా సరే వొక్కమనిషిని కూడా జారిపో నివ్వకుండా రిక్షాకట్టాడు. తాను మామూలుగా వెళ్ళని సందు గొందుల్లోకి కట్టాడు. హైదరాబాద్‌లో కొండగుట్టలు ఎక్కువ. అందుకని ఎత్తు ప్రదేశంమీదకు రిక్షా కట్టమంటే ఎంత ఇస్తానన్నా జంకేవాడు. వాళ్ళు ఎక్కువ ఇచ్చేమాట నిజమేగాని ఇక ఆవాళ రిక్షా తొక్కలేకపోయేవాడు. మొత్తానికి గుండెలు బ్రద్దలు గొట్టు కోవటమే తప్ప సంపాదన వొక్కటే అయ్యేది. ఇవ్వాళ అతను ఇవన్నీ ఆలోచించలేదు. అతనికి కావలసిందల్లా అయిదు రూపా యిలు. రేపేమైనా ఇబ్బందిలేదు. ఎక్కడికి పడితే అక్కడికి, ఎంతకుపడితే అంతకు రిక్షా తొక్కాడు. అతనికి అదృష్టంకూడా కలిసివొచ్చింది. బాడుగలు కుప్పలుతిప్పలుగా దొరికినై. పొద్దున్న అన్నానికికూడా ఎళ్ళలేదు. గుక్కెడు నీళ్ళుకూడా ముట్టలేదు. వొక్క క్షణం బీరుపోకుండా, తొక్కినవాడు తొక్కినట్లేవున్నాడు.

సాయంకాలం అయ్యేటప్పటికి నాలుగు రూపాయిలు చేపట్టాడు. ఇక దొరకాల్సింది రూపాయి, వొక్కరూపాయే ! 'దాని తాతగాడికి అచ్చివున్నానా ? అదే దొరుకుతుంది' అనుకున్నాడు. అతను అనుకున్నట్టుగానే మినిష్టర్లతో పనివున్న వొక పెద్దమనిషి కొండ మీదకు రిక్షా కడితే పది అణాలు ఇస్తానన్నాడు. ఇక కావలసింది ఆరణాలు. మినిస్టర్ల దగ్గరకు వెళ్ళిన పెద్దమనిషి రిక్షా దిగగానే, మినిస్టర్లతో పనై పోయి వస్తున్న మరొక పెద్దమనిషి నారాయణ గూడాకి ఆరణాలు ఇస్తానన్నాడు. పాపారావుకి ఇంకా కావలసిం దేముంది ? పైగా అతను వుండేది చిక్కడపల్లిలోనే. అది నారాయణగూడాకు వొక ఫర్లాంగుకూడా వుండదు. ఆ పెద్దమనిషిని దింపి సరాసరి ఇంటికి వెళ్ళిపోవచ్చనుకున్నాడు. దారిలోనే వొక వైద్యుడుకూడా వున్నాడు. వెళ్లేటప్పుడు ఆయన్ని వెంటబెట్టుకొని తీసుకు వెళ్ళవచ్చనుకున్నాడు. ఆరణాలకు వొప్పుకున్నాడు.

ఆ పెద్దమనిషి రిక్షా ఎక్కాడు. రిక్షా జంయిన వెళ్ళిపోతూవుంది. పాపారావు సంతోషం పట్టలేని పరిస్థితుల్లో వున్నాడు. పొద్దున్నుంచీ అన్నం లేదేమో వొళ్లు తూలిపోతూవుంది. కండ్లు బయర్లుకమ్ము తున్నట్లనిపించింది. కాని వాటిని పట్టించుకునే స్థితిలోలేడు పాపా రావు. ఎంత తొందరగా వెళ్ళటానికి వీలుంటే అంత తొందరగా వెళ్ళటమే అతని పని.

రిక్షా నారాయణగూడా జేరింది. ఇంకెంత రెండు ఫర్లాంగులు అనుకున్నాడు పాపారావు. వొక్క వూపులో జేరిపోవచ్చు అను కున్నాడు. వేగం హెచ్చించాడు. రిక్షాలో కూర్చున్న మనిషికి కొస్త ఎండదెబ్బ తగిలినట్లుంది. లేకపోతే మినిస్టరు దగ్గరకు వెళ్ళిన పని కాలేదేమో ! సొమ్మసిలి జేరగిలబడి కూర్చున్నాడు రిక్షాలో.

ఆగమేగాలమీద వెళ్తున్న పాపారావుకి నాలుగు బజార్ల మధ్య పోలీసు నిలబడి వుండటం కనబడింది. కాంతమ్మ చెప్పినట్లు అతను క్షణం తీరికలేకుండా చేతులు వూపుతూ నిలబడివున్నాడు. అతను ఇంటిదగ్గర తాను చూచిన పోలీసే అనిపించింది పాపా రావుకి. తనను తీక్షణంగా చూస్తున్నట్లే అనిపించింది. తల తిరుగ నారంభించింది. ఎదురుగా కారు వస్తుంటే తప్పుకుందాం అనుకున్నాడు. తప్పుకున్నానే అనుకున్నాడు. కాని తప్పుకోలేదు, కారు రిక్షాకు గుద్దుకుంది. రిక్షా విరిగి కూలబడింది. అతనికి వొక్క విషయమే జ్ఞాపకంవుంది. ఆ కారు నల్లగా చీంబోతులా గుంది. తనికి అసహ్యంవేసింది.

అతనికి స్పృహ వచ్చేటప్పటికి పోలీసుస్టేషన్లో వున్నాడు. అతనిని లాకప్‌లో వుంచారు. రిక్షా విరిగింది. అంతే ఎవ్వరికీ పెద్ద దెబ్బలు తగల్లేదు. రిక్షాలో కూచున్నాయన తుంటి మాత్రం కొద్దిగా జారింది. పాపారావుని వారం రోజులు జైల్లో వుంచారు. ఆ వారం రోజులూ కాంతమ్మని తలుచుకొని కన్నీరు పెట్టు కున్నాడు. తనకోసం ఎవ్వరన్నా వస్తారేమో అని చూశాడు. రాలేదు. ఆ వారం రోజులూ కంటిమీద కూరుకులేదు. చిక్కి శల్యం అయిపోయాడు, బొడ్డు తడుముకుంటే తను సంపాదించిన డబ్బు డబ్బుగానే వుంది. నాలుగు రూపాయిల పదణాలు. అయిదు రూపాయిలు అవటానికి ఇంకా ఆరణాలు తక్కువ. ఆవుర్న పడ్డాడు. అక్కడ అతనిగోడు వినిపించుకునేది ఎవ్వరు ?

ఏడో రోజు అతన్ని జైలునుంచి విడిచిపెట్టారు. అతడు రంయిన ఇంటికి బయలుదేరాడు. ఈ పాటికి కాంతమ్మ జబ్బు నయమయ్యే వుంటుం దనుకున్నాడు. నయం కాకపోతే మాత్రం

ఏం? తాను వెళ్తున్నాడు గదా! ఇక ఆమెను ఏ ప్రమాదమూ ఉండదు.

అతను ఇంటికి చేరుకునే టప్పటికి తనుండే ఇంటిచుట్టూ, చుట్టుపక్కల వుండే అలగాజనం పోగయ్యి వున్నారు. ఆ జనాన్ని చూస్తే ఏదో జరిగిందని భయం వేసింది పాపారావుకి. జనాన్ని తోసుకొని ఇంట్లోకి నొర చేపల్లే, చురకత్తల్లే వెళ్లాడు. వెళ్లినవాడు వెళ్లినట్టుగానే నివ్వెరపోయి నిలబడిపోయాడు.

లోపలకు అడుగు పెట్టగానే అతనికి వినబడింది, పసిపిల్లవాడు కేరు మనడం. అతని కంటబడింది కాంతమ్మ శవం. ఆ శవం చాపమీద పరచబడి వుంది. నిండా గుడ్డ కప్పబడి వుంది. అతనికి అంతా అర్థమయింది. నెమ్మదిగా వెళ్ళి ముఖంమీద గుడ్డతీసి చూశాడు. ఆ ముఖం చాలా ప్రశాంతంగా వుంది. జీవితాన్ని హాయిగా వెళ్లమార్చుకొని గాఢనిద్రలో మునిగివున్నట్లు వుంది.

“నాలుగు రోజులయింది ప్రసవించి. అప్పుడు స్పృహ తప్పటం, తప్పటం కన్ను మూసేవరకూ మళ్లీ కోలుకోనే లేదు,” అన్నది వొక భాగ్యశాలి,

“పిల్లవాడికి ఏ ఇబ్బందీ లేదుగా!” అని అడిగాడు.

“లేదు. బాగానే వున్నాడు.”

అతను వొక్కక్షణం చుట్టూ పరికించి చూశాడు. తనతోటి వాళ్లంతా అక్కడే వున్నారు. శివయ్య దూరంగా కాళ్ల ముడుచుకొని కూర్చుని వున్నాడు. పిల్లవాడి పక్కన కూర్చుని వోదారుస్తున్నాడు ముసలయ్య. ముఖాన గుడ్డ కప్పుకొని శవం పక్కనే కూర్చొని వున్నాడు వెంకన్న. ఆమె మంచితనం అప్పుడప్పుడే వాళ్లకి అర్థం అవుతున్నట్లు వుంది.

ఎవరో “దహన ప్రయత్నాలు చెయ్యటం మంచిది,” అన్నారు.

పాపారావు మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఆ క్షణం అతనిని చూస్తే అందరికీ భయమే వేసింది. ముసలయ్య పిల్లవాణ్ణి దించి నెమ్మదిగా అతని దగ్గరకు వెళ్లి, “ఏమంటావ్ మరి?” అన్నాడు.

“ఆమెకు ఇక్కడ దహనం జరగటానికి వీల్లేదు,” అన్నాడు పాపారావు. అతని గొంతు దేవాలయంలోని గంటలకు మల్లే ఖంగున మ్రోగింది.

అతను బయటకు వెళ్లి వొక జల్లబండి తీసుకువచ్చాడు. క్షణంలో దానికి గుడిసె కప్పాడు. శవాన్ని ఆ గుడిసెలో పెట్టాడు. చంటివానిని ఎత్తుకొని బండి ఎక్కాడు.

“పోనివ్వు.” అన్నాడు బండివాడితో.

అతను అడిగిందానికి సహాయం చెయ్యటంతప్ప ఎవ్వరూ పెదవి కదల్చలేదు. బండి వెళ్తుంటే నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడ్డారు.

బండి కాంతమ్మ అత్తవారి వూరు వెళ్ళి ఆమె ఇంటిముందు ఆగింది. ఎవ్వరో బంధువులు వచ్చారని తలుపు తీసుకొని గబగబా బయటకు వచ్చాడు కాంతమ్మ మొగుడు. నిలువుగుడ్లువేసి చూస్తూ నిలబడ్డాడు. పాపారావు టూకీగా విషయం చెప్పాడు. “నువ్వెప్పటికైనా తిరిగి వొస్తావనుకున్నానుగాని, ఇట్లా వొస్తావని అనుకోలేదు కాంతం,” అని బోరున ఏడ్చాడతను.

కర్మకాండ ముగిసింతర్వాత, పిల్లవాడి సంగతి ప్రశ్నకు వచ్చింది. ‘పిల్లవాణ్ణి ఎవ్వరు పెంచాలి’ అని. కాంతమ్మ భర్తది కూడా అడదిక్కులేని సంసారమే. ఆ కారణం వల్లగానీ, పిల్లవాడి తండ్రి పాపారావనే నమ్మిగానీ, వూళ్లో పెద్దలు ఆ భారం పాపారావు మీద వేశారు.

పాపారావు మనసారా ఆ భారం మొయ్యటానికి అంగీకరించాడు. మొదట్లో ఇందుకు కాంతమ్మ భర్త అంగీకరించలేదుగాని, పెద్దల సలహామీద పాపారావు ఇష్టానికి వొదిలివేశాడు.

ఏడూరు పూర్తయింది. పిల్లవాణ్ణి తీసుకొని పాపారావు టౌనుకి బయలుదేరాడు. ఊరి పొలిమేరదాకా సాగనంపాడు కాంతమ్మ భర్త. అప్పుడప్పుడూ వచ్చి చూచిపోతానని చెప్పి వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

పిల్లవాణ్ణి పొత్తిగుడ్డల్లో పెట్టుకొని ముందుకు నడిచాడు పాపారావు. ‘పుట్టబోయే పిల్లవాణ్ణి నేను పోషిస్తాలే’ అని తాను అన్నప్పుడు ‘ఆ మాట అన్నావ్, బాగుంది’ అన్న కాంతమ్మ మాటలు జ్ఞాపకం వచ్చి అతని వొళ్లు ఉప్పొంగింది.

హంసతూలిక

'కిన్నర'

చూడుమని యిచ్చితిని, పిచ్చివాడవై గ్ర
హింపనేరక నను సంశయించినావు,
సాహసింపక గెల్తువే చావు పుట్టు
కల నెఱుంగని రాయంచ తళుకు సెజ్జ?

ముట్టుకొనిచూడు మిదియెంత ముద్దులొలుకు
చున్నదో, సుంత నీ చెంపకొత్తుకొని మ
రింత సుఖపడుమనుచుండ వింతచూపు
చూచెదవు, జంకి పారిపోజూచెదవును!

ఈ మరాళ మంజుల తూలికా మృదుత్వ
మెక్కడిదొ కాదు, నీలోని హృదయ శయ్య
కప్పియున్న తృష్ణాకంటకములు దులుప
బయలుపడ్డ మెత్తదనమ్మె, పట్టిచూడు!

పట్టుమని కోటియేండ్లైన వాడి యెఱుగ
వింత ఆసక్తియేల, వర్జింపుమింక
కాల నియమాల శుష్కసుఖాల సెజ్జ,
నీకు నీవప్డు పాలమున్నిటి వగుదు!

విరాళం

ఈమధ్య జబల్పూరు, ఇతర పట్టణాలలో జరిగిన అల్లర్లకు గురయిన బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం రు. 51,116 ల విరాళాన్ని మధ్యప్రదేశ్ గవర్నరుకు పంపడానికి నిశ్చయించింది.

అల్లూరి సీతారామరాజు చరిత్ర

ఆంధ్రవీరుని అద్భుత జీవితము

అన్ని వివరాలతో

సచిత్రంగా వర్ణింపబడినది

(రచయిత: యఱ్ఱమిల్లి నరసింహారావు)

★

ఆర్టుపేపరుమీద మనోజ్ఞంగా ముద్రింపబడిన

ప్రభుత్వ ప్రచురణము

వెల: రూ. 2-75 న. పై.

పోస్టేజి అదనం

ప్రతులకు: సమాచార పౌరసంబంధముల శాఖ

ఆంధ్రప్రదేశ ప్రభుత్వం,

హైదరాబాదు - 1

మహాభ్యుదయం

కొంపల్లి మల్లికార్జునరావు

(గతసంచిక తరువాయి)

[భోజనాలయ్యాయి. అందరూ హాల్లో కూర్చుంటారు.]

కామేశం: అమ్మా! మీరు అజ్ఞాత స్త్రీగా వచ్చి అలాజాలంగా మా సంసారంతో కలిసి యీ అంధుని కండ్లు తెరిపించారు.... కానీ మీ మాటలు, మీ స్నేహ సహకారాలు నిజంగా అయస్కాంతంలా ఆకర్షిస్తున్నాయి తల్లీ!

రమ: ఏదయితేనేంగానీ కొడిగట్టి క్షీణించిపోతున్న జ్యోతిని కదిలించి సముద్ధరించేందుకు భగవంతుడు పంపిన దూతే అయ్యారు సుగుణా!

సుగుణ: (నవ్వుతూ) అమ్మా, నేను దూతనూ కాను, దయ్యాన్నీ కాను.... నేనూ మీలాంటి మనిషినే! ఒక ప్రభుత్వపు వుద్యోగిని.... నన్ను ముఖ్యసేవికంటారు.... యీమె గ్రామసేవిక. సవందాలో వుంది మా సేవిక.

రమ: ఆఁ! యిదో పెద్ద వంశంలా వుందే! సేవిక వంశం. (అంటూ నవ్వుతుంది.)

సుగు: (నవ్వుతూ) అవునమ్మా! యిది ఒక వంశం లాంటిదే! యీ ప్రక్క గ్రామంలో మా ఆఫీసు వుంది. అందులో పని చేస్తుంటాము. యీ గ్రామాలలో వున్న స్త్రీల సంక్షేమ కార్యక్రమాలు, శిశు సంక్షేమ కార్యక్రమాలు సముద్ధరణే మా పని.

పార్వ: స్త్రీ సంక్షేమం అంటే ఎలా నెలకొల్పుతారు చెప్పండి! యీ గ్రామీణ స్త్రీలలో విద్యా సంస్కారాలు సున్న. యిక వారిలో విశాల భావాలుండి, వాస్తవిక విజ్ఞానం కలిగి అర్థం చేసుకొని మీరు తోడ్పడతారని భావిస్తారా!

సుగు: ఏం?

పార్వ: వారికీ యిల్లే వైకుంఠం. ఎప్పుడూ యిల్లు వదలి బయటకు రారు. వైకుంఠ ద్వారం తీస్తే ముక్తి పోతుందని. అథవా బయటకు వచ్చినా తమ తమ సంసారాల గొడవలు, తమ అంతస్తులు, తమ నగానట్రా పొగిడింపుచు, యితరుల అంతస్తులు చూసి యీర్ష్య చెందటంతప్ప అన్యుల స్థితిగతులు తెలుసుకునేందుకు వారికేమి ఆతుర్దాగానీ అభిలాషగానీ వుండదు.

సుగు: మీరు చెప్పినదానితో నేను నూటికి నూరుపాళ్లు ఏకీభవిస్తాను. కానీ దానికీ కొన్ని కారణాలున్నాయి. మొదటినుండి మన సమాజం స్త్రీకి ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచింది. ఆ గిరిగాటి యిటు అటు రాకూడదు. వస్తే ఆమె జీవితంలో అభియోగాలకు ఆస్కారాలు ఎక్కువవుతయి. అందుకే స్త్రీలలో స్నేహ సౌభ్రాత్రాలు, యితరుల సంక్షేమాలను తెలుసుకోవాలన్న వాంఛ దూరమయింది. యిది మనం సిద్ధయించుకున్నాం తాత్కాలికంగా! అంతే!

కామే: అలా అని స్త్రీని పురుషునిలా వీధువెంట తిరిగే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు యిస్తే....

సుగు: చెప్పండి! అర్ధోక్తిలోనే ఆగిపోయారే! (కొంచెం ఆగి) మీ భావనేదో నేనే చెప్తాను.... స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు యిస్తే స్త్రీ చెడిపోతుందనేగా మీరనబోయింది. బాబూ! బహుశా మీరు పురాణాలు, భారత, భాగవతాది మహాగ్రంథాలు చదివే వుంటారు. పురాణయుగంలోకూడా స్త్రీకి ఏమాత్రం స్వాతంత్ర్యం వుంది దర్పణంలా వెల్లడిస్తున్నాయి. చూడండి! కణ్వమహాముని శకుంతల వివాహంలో ఆమె యిచ్ఛ వచ్చినట్లు అంగీకరించాడు. ఆమె వరుణ్ణి కోరుకునేందుకు, స్వాతంత్ర్యంగా తిరిగేందుకు అనుమతించింది అనాటి సమాజం. రానురాను యీ సిద్ధాంతాలన్నీ మనం తయారుచేసి రుద్దుకుంటున్నవితప్ప

ఎవ్వరూ ఏనాడూ శాసించిన శిలా శాసనాలు కావు. ఈ ఒక్క వుదాహరణే కాదు. మన వేదాలు, ఉపనిషత్తులు అన్నీ ఎటు చూచినా ఆనాటి స్త్రీకి ఎంత ఉచ్ఛస్థానం వుంది విశదీకరిస్తు న్నయి. ఆనాటి స్త్రీలు చెడిపోయినట్లు భావిస్తున్నారా ! పోనీ యీనాడు గుమ్మం దిగని స్త్రీలంతా భర్తల చెప్పుచేతలలో మెలుగుతున్నట్లు నటిస్తున్నవారిలో అంతా సచ్చరిత్రులే వున్నారా !

రమ : అవునన్నయా ! చెడపడం, చెడిపోవడం అనేవి విడివడని జంట పదాలు; వాటికి అవినాభావ సంబంధం వుంది. కొబట్టి ఆ బాధ్యత ఏ ఒక్క స్త్రీ పైనిగానీ, పురుషుని పైనిగానీ వుండదు. ఏమంటారు సుగుణగారూ !

సుగు : మీరు పల్కింది యదార్థం. స్త్రీకి ఆత్మగౌరవం, పురుషునికి సంఘ గౌరవం అత్యావశ్యకం. యీ రెండుకూడా వారిద్దరి సత్‌హృదయాలు, సంబంధాలపైనే ఆధారపడ వుంటయి. అయినా సంఘంలో పురుషునిపాత్ర ఎంత వుందో స్త్రీకి అంతే వుంది. కానీ సంసారంలో పురుషునికన్నా స్త్రీకే బాధ్యత ఎక్కువ. చూడండి ! కలిమి వుంటేనే కలకల లాడుతూంటా మనేదే సమస్యకాదు. అంతులేని అర్థమున్నా అర్ధాంగి అణకువ ఆలోచనల మీదనే ఆ కుటుంబపు సౌఖ్యాలు ఆధారపడి వుంటాయి. పిసినిగొట్టు భర్తయినా, పులిలాంటి ఆలితోవున్నా ఆ సంసారపు సౌఖ్యం నరకంలోకన్నా తక్కువేం కాదు. భార్యా భర్తలు రెండు పట్టాలలాంటి వారు. వారి అన్యోన్యాను రాగాలపైనే జీవితనౌక నడుస్తుంది. ఏ ఒక్కరి విముఖతతో నైనా రైలుబండిలా బోల్తా కొడ్తుంది.

కామే : అది నిజమేనమ్మ ! కానీ మరీ అంతంతమాత్రపు సంసారాల్లో ఆలుమగల అన్యోన్నత అనురాగాలే ఆనందదాయకం కల్గిస్తాయా !

సుగు : అందుకు మీరు వ్యతిరేకిస్తారా, కానీ భర్తకు ఆర్థిక పరిస్థితుల్లోకూడా భార్య చేదోడు వాదోడుగా వుండొచ్చుగా !

పార్వ : ఏదో మీరు చదువుకున్నవాళ్ళు, ప్రపంచ పరిస్థితుల్ని తెలుసుకున్నవా రయితే సరే ! నీబోటివాళ్ళు ఏం చెయ్య గలరు చెప్పండి !

సుగు : మీబోటివాళ్ళయినా పరవాలేదు ! ఇంకా అక్షర జ్ఞానం నోచనివారయినా మార్గాలున్నాయి, ఆసక్తే వుండాలిగాని.

రమ : అయితే చదువు సంస్కారాలులేని స్త్రీల విషయంలో....

సుగు : చదువులతో సంబంధంలేని సంపాదన లున్నాయి రమా !

రమ : అలాగా !....

సుగు : అవునమ్మా ! యీ గ్రామంలో కుట్టుపని కేంద్ర మొక టుంది. బహుశా మీకు తెలిసే వుంటుంది.

పార్వ : అవును ! ఎప్పుడో మంత్రిగారు వచ్చిన రోజున వెళ్ళాం కాదూ !

రమ : అవును !

సుగు : ఆ కుట్టు కేంద్రం ముఖ్యంగా స్త్రీల అభివృద్ధి పథకాల క్రింద స్థాపించబడింది. అది పూర్తిగా మహిళాభ్యుదయానికే తోడ్పడుతుంది. అందులో ఒక పంతులమ్మ వుంది. ఆమె నానా రకాల కుట్టుపనులు నేర్పుతుంది. గ్రామీణ మహిళలంతా నేర్చుకోవచ్చు. మీరు ఆమెకు కానీ యివ్వాల్సినపని లేదు. యింకా విశ్రాంతి సమయాల్లో మీ స్వంత బట్టలుకూడా కుట్టుకోవచ్చు. అలా మీరు కుట్టుపనులు నేర్చుకుని ఆమె పెట్టే పరీక్షలో వుత్తీర్ణు లయితే మీకు బ్లాకునుండి అప్పుగాను, సగం ధరకే ఒక మిషన్ యిస్తారు. ఆ మిషనులో మీ బట్టలు కుట్టు కొని ఆదాయం చేసుకోవచ్చు. ఇంకా ఓపికంటూ వుంటే యిరుగుపొరుగుల బట్టలు కుట్టి డబ్బు సంపాయించవచ్చు. వాటివల్ల ఆదాయం పెరుగుతుందేగానీ తరగదు గదా !

రమ : నిజమే !

సుగు : యింతేకాదమ్మా ! యింకా అంబరుచర్ఖాలంటూ వున్నాయి. అవికూడా మహిళల ఆదాయానికి తోడ్పడుతాయి. అవి నేర్చు కుంటూన్న రోజునుండి ఆదాయం లభిస్తుంది. శ్రమకు ఓరిస్తే యింటికి సరిపోయే బట్టలన్నీ కూడా దానిమూలంగానే సంపా దించుకోవచ్చు. పైగా గుమ్మం దిగకుండా సంపాదించేవే యివన్నీ.

కామే : కానీ సుగుణగారూ ! యివన్నీ బాగానేవున్నాయి ; కానీ గంపెడు పిల్లలతో సంసారాన్ని యిటు యీ పనులు నెర వేర్చడం అంత తేలికా !

సుగు : మీరు చెప్పింది నిజమే బాబు ! కానీ సంసారంలో పేచీలన్నీ యీ సంతానం మూలంగానే కల్గుతున్నాయి. యీ డజన్లు, అరడజన్లు సంతానం లేకుంటే భర్త సంపాదనే సరిపోతుందేమో !

పార్వ : అందుకని సంతానం వుండకూడ దంటారా !

సుగు : అబ్బే ! శివ ! శివ ! ఆడపుటక పుట్టి అంత మాటంటానా! కానీ ! ఆ సంతానంకూడా ఒక మోతాదులో వుంటే ఎన్ని

రకాల ఆనందాలు కల్గిస్తుందో చూడండి! పిల్లలు జాస్తయే సరికి తల్లి దండ్రుల సంపాదన చాలక బాధపడటం, పైగా యింతమంది పిల్లల్ని కనినందున నిజంగా ఆ స్త్రీ ఎంతో బలహీనమయి పోతుంది. దానిపిల్ల ఇక పిల్లలకు డబ్బా పాలు. ఆమెకు బ్లడ్ ప్రెషర్. యిక ఆయనగారి సంపాదన పిల్లల డబ్బా పాలకు, అర్ధాంగి మందులకు సరి. యిక వాళ్లు పెరిగితే చదువులు.... యిక ఆడపిల్ల లయితే వివాహసమస్యలు — కట్నాలు....యివన్నీ తోచక దిగులు....దీనిపైని చికాకు.... ఆ పైని మనోవ్యాధి....ఏమేమో!....

రమ: అందుకని....

సుగు: అందుకనే ఒక మోతాదులో అంటే ముగ్గురికిపైని యిక ఆపవచ్చునంటాను, ఏమంటారు.

కామే: అదేంమాట తల్లీ! పిల్లల్ని యివ్వడం ఆ భగవంతుని అనుగ్రహంకానీ....లేనివారికి కావాలంటే మాత్రం కల్గుతున్నారా!

సుగు: ఉ....ఉ....ఉ! యింకా మీరు వేదాంతమే మాట్లాడుతున్నారు. మానవకృషి, భగవంతుని అనుగ్రహం రెండూ అవసరమేకదూ బాబూ! ఏవి లోపించినా....ఫలింపవుగా!....

కామే: అందుకని.

సుగు: మానవుడు కృషిచేయాలి సంతాన నిరోధానికి.

రమ: ఆ!

సుగు: అవునమ్మా!

పార్వ: సంతాన నిరోధం పాపం కాదూ!

సుగు: కని, పెంచి, తృప్తికరంగా పోషించలేక వారిని మలమల మాడ్చటం పాపం కాదూ? చెప్పండి!

కామే; అయితే మరి దానికి మార్గాలు....

సుగు: ఎన్నో వున్నయి. యీ ప్రక్క గ్రామంలో బ్లాకుకు సంబంధించిన ఆసుపత్రి వుంది. దాన్ని 'ప్రాధమిక ఆరోగ్య కేంద్రము' అని అంటారు. అక్కడికి వెళ్తే మీకన్నీ విశదమవుతయి.

రమ: సుగుణగారు! మీరు చెప్పినవన్నీ బాగానేవున్నాయి కానీ. కాస్త విజ్ఞాన సంపత్తి గల్గి. విశాలదృక్పథంలో ఆలోచించ గల్గిన వారికే అవగాహన అవుతయి. కాని...సాంసారిక స్త్రీలు వాటిని తప్పక హేళన చేస్తారు....పైగా....గుమ్మంలోకికూడా రానివ్వరు మిమ్మల్ని. తెలుసా (నవ్వుతుంది)

కామే:
పార్వ:
సుగు: [నవ్వుతారు]

సుగు: నువ్వు చెప్పినదాన్లో సందేహంలేదు రమా! కానీ....ఆ విజ్ఞానాన్ని, ఆ విశాల భావాలను వాళ్ళలో విస్తరింపజేయడమే నా ముఖ్యోద్దేశం.

రమ: మీరేమీ అనుకోనంటే ఒక్కమాటంటాను: కోపం రాదుగదా!

సుగు: నాకా!

గ్రా. సేవిక: మా సుగుణమ్మగారు ఎంతో శాంతమంతులమ్మా! అడగండి.

రమ: ....

సుగు: ఊఁ!....అడగండీ!

రమ: యీ స్త్రీలలో మీరు చైతన్యం కల్గించడానికి బహుశా మీ ఆయుర్దాయం చాలదేమో అని అనిపిస్తుంది!

సుగు: ఉ....ఉ....ఉ! చూడండి రమా! మీబోటి విద్యాగంధం గలవారు గ్రామాని కిద్దరు లభించినా సంవత్సరంలో యీ బ్లాకు గ్రామాలలోని స్త్రీలలో అనంత చైతన్యం తీసుకొనిరావచ్చు. తెలుసా!

రమ: ఆ!

సుగు: అవునమ్మా! ఆశ్చర్యమేముంది.

పార్వ; ఏలాచేస్తారు చెప్పండి!

సుగు: ప్రతి గ్రామాన 'మహిళా మండలి' స్థాపించాలి....

రమ: మహిళా మండలా!

సుగు: అవును! ఆ మండలిలో కాస్త విజ్ఞానం కలవారిని అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా, సెక్రెటరీలుగా ఎన్నుకుంటారు మిగిలిన సభ్యులు. మధ్యాహ్నం తీరిక సమయాల్లో యీ మండలి సమావేశమయి యితర స్త్రీల సంక్షేమాలను చర్చించడం. ప్రపంచపరిస్థితుల్ని కొద్దోగొప్పో అర్థంచేసుకోవడం, నేర్చుకోవచ్చు. దీనిలో కుట్టుపనులు, యితర చేతిపనులుకూడా నేర్పబడుతాయి. యివన్నీ యీ గ్రామసేవిక వచ్చి ఎల్లప్పుడూ మీతోనే వుండి యివన్నీ నేర్పుతుంది. దీనితోబాటే మన ఆర్థిక స్థాయిని ఎలా పెంపొందింప జేసుకోవాలి. నిత్యజీవితంలో మనం పిల్లల్ని ఎలా పెంచాలి అనే విషయాలుకూడా నేర్చుకోవచ్చు. ఈ మండలి ముఖ్యోద్దేశ్యం గ్రామీణ స్త్రీలలో నూత్న చైతన్యాన్ని రేకెత్తించి, తోటి స్త్రీల సాధకబాధకాలను అర్థం

చేసుకోవడం, చేతనయినవరకు సహాయపడడం. దానివలన ప్రతి మహిళలోకూడా ఒకవిధమైన సమతత్వ భావన ఏర్పడుతుంది. ఇంకా 'ప్రయోజన స్త్రీలకు చదువులు చెప్పేందుకు రాత్రి పాఠశాలలు స్థాపిస్తారు. అందులో ఒక పంతులమ్మ వుంటుంది. ఆమెకూడా శాస్త్ర విజ్ఞానం కల్గిన ఆ గ్రామ మహిళే వుంటుంది. ఆమె రోజు రాత్రిపూట తోటి మహిళలలో నిరక్షరాస్యతను నిర్మూలన చెయ్యడము. నేటి ప్రపంచ పరిస్థితుల్నిగూర్చి కూడా విశదీకరిస్తుంది.

రమ : ఆ ! అలాగా ! అయితే యింకేం ! నిజంగా యీ పథకాలన్నీ మా గ్రామంలోనే ప్రథమంగా ఏర్పాటు చెయ్యాలి సుగుణా !

సుగు : మీ సహాయం, సహకారం వుంటే ఎంత సేపు.

కామే : సుగుణగారూ ! మీ పథకాలన్నీ అద్భుతంగా వున్నాయమ్మా ! నిజంగా సమాజంలో చలనము, చైతన్యాన్ని కల్గించే యీ పథకాలకు, సేవచేస్తున్న మీకు మన జాతి ఎంతో అభినందనా లర్పించవచ్చు.

సుగు : మీలాంటివారి ఆశీర్వచనాలుంటే చాలు బాబు ! రమ, పార్వతి ! మీరు తప్పక నాకు యీ పథకాలలో సహాయం చెయ్యాలి.

పార్వ : నా సహాయమా !

సుగు : చదువుకున్నవారు మీరు కాకపోతే ఎలా ! ఏమంటారు ! (అంటూ కామేశానికై చూస్తుంది)

కామే : అవును పార్వతీ ! నిజంగా ! నువ్వు, రమా యీ మహిళాభ్యుదయానికై సుగుణగారికి సహాయం చెయ్యడమే కాదు. మీరూ పాటుపడాలని నా అభిమతం.

పార్వ : అలాగే !

కామే : ఏమమ్మా రమా ;

రమ : అలాగే నన్నయా !

సుగు : శుభస్య శీఘ్రం ! యింకేం పదండి....నలుగుర్ని పరిచయం చేసుకొని యీరోజే మహిళా మండలి స్థాపిస్తాం !

రమ : అలాగే ! పదండి....లేవమ్మా వదినా !

పార్వ : అందరూ వెళ్తే యిల్లు !

రమ : అబ్బ ! నీ కెప్పుడూ యింటి గొడవే ! అన్నయ్యా ! కాస్త చూస్తూండన్నయ్యా ! త్వరగా వస్తాంగా !

కామే : అలాగే పారూ ! వెళ్లండి !

* * *

విరామం

* * *

(స్త్రీలంతా కూడుతారు.)

సుగు : అమ్మా ? యిక్కడ కూడినవాళ్ళలో నాకన్నా పెద్దలూ చిన్నలూ అందరూ వున్నారు. కొన్నికొన్ని విషయాల్లో నాకన్నా మీకే ఎక్కువ తెలిసివుండొచ్చు. కానీ కొన్ని విషయాలు నాకే హెచ్చుగా తెలిసివుంటాయి.

రమ : ఏలాగైనా మీరు చదువుకున్నవారు....పైగా ప్రపంచ జ్ఞానం కలవారుగా ! మాకన్నా మీకే ఎక్కువ తెలిసివుంటాయి.

పార్వ : నిజమే సుగుణా !

సుగు : తెలుసుకోవాలని యిచ్ఛవుంటే అందరికీ తెలుస్తయమ్మా ! అదేం బ్రహ్మ విద్య కాదు. అయినా ఒక్క విషయం ఏమంటే భూమిమీద పుట్టడంతోనే ప్రాణి పని పూర్తయినట్లు కాదు. స్త్రీగానీ, పురుషుడుగానీ తమ జీవితం, తమ సౌఖ్యం, తమ బాగోగులు చూచుకోవడంతోనే తమ బాధ్యతలు పరిసమాప్తికావు. కనీసం యిహంలో కాకపోయినా పరంలోనయినా ముక్తి సంపాదించాలంటే కొన్ని ఆదర్శాలను, నియమాలను ఆదర్శంగా తీసుకొని కృషి చెయ్యాలమ్మా !

శోభ : అమ్మాయి ! మీరు చెప్పింది బాగానే వుంది !....కానీ.... పురుషులు ఆ ఆదర్శాలను అనుసరించేందుకు స్తోమత, తీరుబడి రెండూ వుంటాయి....కానీ స్త్రీలకు ఎలా చెప్పు ఎప్పుడూ చాకిరితోనే సరిపోతుంది !

సుగు : మంచి ప్రశ్నే వేసారు ! కానీ ఒక్కమాటంటే కోపం రాదుకదా !

శోభ : కోపమా ! ఎందుకు ?

సుగు : అయితే చూడండి ! మన స్త్రీలలో ఒక్క చెడ్డ అలవాటుంది....ఏమిటంటే....మధ్యాహ్నం కాలక్షేపంకోసం ఎక్కడో చేర్తారు. అక్కడ పుక్కిడి పురాణాలు, ఎల్లమ్మనుగూర్చి, పుల్లమ్మనుగూర్చి....నానారకాలు చెప్పుకోవడాలు....నవ్వులు ....హేళనలు....ఎగతాళి చెయ్యడంతప్ప ఏమీలేదు....వాటి వలన ఎవ్వరికైనా కించిత్తు ఆదాయం వుందా చెప్పండి !.... ఆ పుల్లమ్మ ఏంచేస్తే ఎవరికెందుకు ?

రమ : బాగా చెప్పారు సుగుణా !

సుగు : ఆలాంటి వృథా కాలయాపన బదులు భుక్తి, ముక్తి లభ్య

మన్యేపి చేసుకుంటే స్త్రీ సమాజానికంతా లాభదాయకమే కాదా!....అనవసర పిచ్చాపాటీలతో చివరకు మిగిలేవి లిగూలు, పోట్లాటలు తప్ప మరేం లేవు. ఏమంటారు శోభా దేవిగారూ!

శోభ: నిజమే!

సుగు: అలాంటి తీరిక సమయాల్లో మహిళలంతాకూడా ఎన్నో నేర్చుకోవచ్చు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్ని అర్థం చేసుకోవచ్చు. పైగా కుట్టుపనులు, రకరకాల చేతిపనులు నేర్చుకున్నందున యిల్లాలు యింటిని స్వర్గంగా మార్చుకోగల్గుతుంది. అంతేకాదు....యింటిల్లిపాది జనం ఒక్క పురుషుని రెక్కల కష్టంపైన ఆధారపడి పీడించడం మన కాచారమై పోయింది. అతనెంత బాధపడుతుంటాడో మన కర్థం కాదు. యింకా కొంతరితో భర్త అవి కొనియ్యలేదు యివి చేయించలేనన్న సాధింపులు....నిజంగా ఆ సంపాదనకు అతనెంత బాధ పడుతున్నాడో, అతనిలోని శక్తిని ఎలా కరిగించి వెస్తున్నాడో అర్థం చేసుకోలేం!....అలాంటి పురుషులకు మనం చన్నీళ్లకు వేన్నీళ్లలా ఎందుకు సహాయ పడకూడదు... అతనికి మన సహకారం ఎందుకివ్వకూడదు? చెప్పండి!

రాజమ్మ: నిజమే!....కాని....మార్గాలు....

సుగు: మార్గాలకేం తల్లీ! ఎన్నోవున్నాయి. గడప దిగకుండానే సంపాదించేవే ఎన్నో వున్నాయి. వాటినన్నిటిని మనం నిండు హృదయంతో ఆలోచిస్తే అన్నీ అర్థమవుతాయి. అన్నీ అలాంటివేగాదు. చూడండి!....కొందరు స్త్రీలు పిల్లల్ని కనే వరకే నేర్చుకుంటారు....శ్రద్ధ తీసుకుంటారు....పిల్లలు పుట్టిం తర్వాత యిక వారిని ఏదో విధిలేక సాకినట్లుగా చూస్తారు.... తండ్రీ వారి జాగ్రత్త తీసుకోక, తల్లీ వారి జాగ్రత్త తీసుకోకుంటే వారి భవిష్యత్తేంకావాలో ఆలోచించండి!....ధనవంతులైతే డబ్బు పారేస్తే మనుష్యులు చూస్తారనుకొని....వారి ఆనందాల్లో వా రుంటారు....కానీ తల్లికి బిడ్డలమీదున్న మమత, శ్రద్ధ పనివాళ్లకుంటుందా చెప్పండి!...నిజంగా తల్లిదండ్రుల భావి జీవితం బిడ్డల పురోభివృద్ధిపైనే ఆధారపడి వుంటుంది.... వారినెలా పెంచాలన్నదీ ఒక విద్యే....అలాంటివన్నీ విప్పి చెప్పేందుకే మేము యిక్కడికి వచ్చాం....అవన్నీ మనం మహిళా మండలి ద్వారానే నెరవేర్చగలం.

రాజ: ఓ! అలాగైతే యింకేం! మేమందరమూ సిద్ధమే!

ఏమోయ్ సుశీ!

సుశీల: యింకా అలస్యం ఎందుకు సుగుణగారూ! మీరు చెప్పిన పద్ధతుల్లో మేము యీనాటినుంచి నడుచుకునేందుకు కంకణం కట్టుకున్నట్టే!....

సుగు: మంచిది....మీ అందరికీ నా ధన్యవాదాలు....కానీ యీ మహిళా మండలి కార్యక్రమాన్ని మీరు ఎన్నుకోవాలి!

శోభ: అయితే యింకేం! యిదుగో సుగుణమ్మగారూ! మా గ్రామంలో చదువుకున్నవా ళ్లెవరైనా వున్నారంటే వారు.... రమ....పార్వతి, సుశీల....వారి అండన మేము మెంబర్లుగా వుంటాం....ఏమంటావు రాజమ్మా!

రాజ: యిక అనేదేముంది! అంతే!

సుగు: సంతోషమమ్మా!

* * *

విరామం

* * *

(అనాడు మండలి వార్షిక దినోత్సవం. సుగుణావాళ్ళ కొరకై, రమ, పార్వతి, సుశీల, మిగిలిన మెంబర్లు ఎదురు చూస్తూ వుంటారు. సుగుణ, Assistant Women Welfare Officer, B. D. O, సమితి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు యీ గ్రామం వస్తారు.)

రమ:
సుశీల: } నమస్తే! సుగుణా!
పార్వ:

సుగు: నమస్తే!

రమ: మీకొరకు ఎదురుచూస్తున్నాం సుగుణా!

సుగు: మంచిదమ్మా!....వీరు శ్రీమతి శకుంతలాదేవిగారు మన జిల్లా 'స్త్రీ, శిశు సంక్షేమశాఖామాత్యురాలు.'

అందరూ: నమస్తే!

సుగు: యీమె రమ, మండలి ప్రెసిడెంట్....యీమె సుశీల వైస్‌ప్రెసిడెంట్...యీమె పార్వతి సెక్రెటరీ!

శకుం: నమస్తే!

సుగు: వీరు మన పంచాయితీ సమితి అధ్యక్షులు.

అధ్య: నమస్తే!

అందరూ: నమస్తే!

సుగు: వీరు బి. డి. ఓ. గారు!

బి. డి. ఓ: నమస్తే!

అందరూ: నమస్తే!

సుగు : మరి...మీరు...

రమ : మా అన్నయ్యగారే! (అంటూ నవ్వుతుంది)

సుగు : తప్పు తప్పు! వారిప్పుడు...సమితి Vice-President హోదాలో వచ్చారు తెలుసా! అన్నయ్య అని అనకూడదు!

రమ : ఓహో! ఆలాగా! అయితే నమస్తే!

అందరూ : (నవ్వుతారు.)

సుగు : యిక మన కార్యక్రమం ప్రారంభిస్తామా!

పార్వ : ఓ! అంతా రెడీ!

* * *

(సభావేదిక దగ్గర. రమ సభావేదిక పైకి వచ్చి)

రమ : ఈనాటి యీ సభకు మన పంచాయితీ సమితి అధ్యక్షులను అధ్యక్షత వహించవలసినదిగా మన మహిళా మండలి తరపున కోరుచున్నాను.

అధ్య : (సభాస్థలికి వస్తాడు.)

(అందరూ చప్పట్లు కొడ్తారు....పూలమాల ఒక చిన్న పాపతో వేయిస్తారు....అప్పుడు అందరూ చప్పట్లు కొడ్తారు.)

రమ : సోదర సోదరీమణులారా! సంవత్సరానికి పూర్వం యిదే రోజున యీ గ్రామ జీవిత పరిస్థితులకు, యీనాడు యీ గ్రామ పురోభివృద్ధి పరిణామాలకు అస్తిమశకాంతర భేదం వుంది. ఆనాటి అక్షరాస్యుల సంఖ్య నూటికి పట్టున పదిలేదు. యీనాడు ఆనాటికి 75 అక్షరాస్యులు తయారయ్యారు. మహిళలలో.... బూజుపట్టిన పద్ధతుల్లో కళ్లు మూసుకొని రాళ్లూ, గుళ్లూ, పొదలూ, గుట్టలూ అడ్డువస్తున్నా, తలవాచే బొప్పులుకట్టి బాధ పడుతున్న జీవితపథంలో ప్రయాణం చేస్తుండే అలవాటు అబలలది. సహభావన, సామరస్యంతో, స్త్రీ సమాజాభివృద్ధికై యితోధికంగా పోరాడి సస్యశ్యామలాన్ని సముద్ధరిస్తున్న సబలలు యీనాటి యీ గ్రామీణ మహిళలు. అంతే తేడా!.... దీనికంతా మూలకారకురాలు మా ముఖ్యసేవిక కుమారి సుగుణ. వారు ధన్యజీవులు....వారి అపార సేవ, బోధనలే యీ అమాయక జీవితాలలో జ్యోతులై దినదిన ప్రవర్ధమానంగా ప్రకాశిస్తున్నాయి. వారి పవిత్ర సేవ, సహకారం మూలాన్నే యీనాడు ప్రారంభింప బడుతున్న యీ భవన నిర్మాణం కొనసాగింది. ఈ భవనాన్ని యీ మహిళా మండలి సభ్యులందరూ శ్రమకోర్చి ధన సహాయం, శ్రమదానంతో పూర్తిచేశారు.... యిందులోనే ఒక లైబ్రరీ, రేడియోకూడా ఏర్పాటు చేయ కలిగాము....ఈ అభివృద్ధి కార్యక్రమాలలో తెరమరగున వుండి ఆర్థిక సహాయం చేసిన గ్రామ పురుషు లందరికీ మా మండలి తరపున ధన్యవాదాలు. ఇక సుగుణగారు తమ అమూల్య సందేశాన్ని అందరికీ అందజేస్తారు.

సుగు : (లేచి గద్దెపైకి వస్తుంది. అందరూ చప్పట్లు కొడ్తారు.) తల్లులారా!....చంద్రులారా!...మీ అనంత దీక్షకు, అనర్గళ కృషికి నా తరపున, మా సమితి అధికారవర్గం తరపున ధన్యవాదాలు...కుమారి రమ చెప్పినట్లు పూర్వపు యీ గ్రామ స్థితికి యీనాటి గ్రామ పరిస్థితికి ఎంతో తారతమ్యం వుంది. దీనికంతా మూలకారణం యీ గ్రామ స్త్రీలలోని ఉత్సాహం. ముందంజ ఉంచేకాని మా గొప్పతనం లేదు...అది మా విధి....ఈ ప్రదర్శనశాలలో అలంకరించిన యీ వస్తువులన్నీ యీ మహిళా మండలి తయారుచేసినందుకు, మీలో యింత చైతన్యం కల్గినందుకు నిజంగా అందరూ ఎంతగానో మెచ్చుకున్నారు....మీ అనర్గళకృషికి నా అభినందనములు తెల్పుతూ యింతటితో ముగిస్తున్నాను.

అధ్య : (అందరూ చప్పట్లుకొడ్తారు...లేవగానే)...ఈనాడు యీ బ్లాకులో యీ గ్రామమే ఆదర్శ గ్రామంగా ఎన్నుకున్నందుకు శ్రీ కామేశంగార్కి, కుమారి రమ, సుశీల, శ్రీమతి పార్వతి గారల కృషికి, యీ గ్రామ పురుషులకు స్త్రీలకు నా తరపున, పంచాయితీ సమితి తరపున ధన్యవాదాలు...కానీ యీ ఒక్క గ్రామంలో కల్గిన యీ చైతన్యాన్ని మీ అందరి సహాయంతోనే కుమారి సుగుణగారు మిగతా గ్రామా లన్నిటిలోనూ యిదే రీతిగా చేయగలదని ఆశిస్తూ...నాకు సోదరిలాంటిది గనుక దీవిస్తున్నానుకూడా!. యిక తర్వాత కార్యక్రమాలు శ్రీమతి పార్వతి చెప్తారు,

పార్వ : తర్వాత కార్యక్రమాల్లో పంచాయితీ సమితి అధ్యక్షులు సాంస్కృతిక ప్రదర్శనాలకు ప్రారంభోత్సవం చేస్తారు. అందులో కుమారి రమ వ్రాసిన 'మహిళల ముందంజ' అనే నాటిక ప్రదర్శింపబడుతుంది. దీనికి పూర్వం శ్రీ బి. డి. ఓ గారు...మహిళా మండలి వారి రేడియోకు ప్రారంభోత్సవం జరుపుతారు...తర్వాత స్త్రీ, శిశు సంక్షేమశాఖామాత్యురాలైన శ్రీమతి శకుంతలాదేవిగారు బహుమతి ప్రదానం చేస్తారు...

* * *

! సమాప్తం !

భాయీ భాయీ

బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి

మంజీరామరకతశా
టిం జీరాడెడి మధురులచే మరి వీరల్ !
శింజానతుంగభద్రా
మంజులహారిదోగు భావమాన్యులువీరా !!

2

వీరచే ! వీరు ! గోదావరీ రసాలు
కృష్ణద్రాతులు—నొక్క పుక్కిటను బట్టి
పాటబాడు కళాభోగపరిణత మతు
లొక్క రథమెక్కి కదలినారోయి ! ఓయి !!

3

నరనరాల జీర్ణించిన పరమవాంఛ—
తరతరాల కష్టించిన తరుణకాంక్ష—
తీరివచ్చెనురా ! నురి, కోరివచ్చె
రా ! మహాంధ్రము నీది. నీకే, మిరాశి !!—

4

భాయీభాయీగను ఇక
హాయిగ నీ కోంద్ర నీవు అదునెరిగి కృషిఁ
జేయవలెఁ ! నరకమ్ములు
త్రోయఁవలె ! నందనమ్ముతో తులదూగఁ !!

5

సాగెనురా ! ఆంధ్రప్రభ
లాగవురా ! నందికొండలాటి వృషభముల్ !
మూగిరి ముక్కోటులు, ఢి
ల్లీగళఘంటికలు సనదు లిచ్చెను నీకున్ !!—

కృష్ణయజ్వ అలంకార ముక్తావళి

సుప్రసన్న

తెలుగు భాషలోనే కాక సంస్కృతభాషలో కూడ నరస భూపాలీయ నామము గల యలంకార శాస్త్ర గ్రంథ మున్నట్లు శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు పూర్వము భారతి (ఫిబ్రవరి 1939)లో వెల్లడించిరి. ఈ గ్రంథమున కాంధ్ర గ్రంథముతో రచనా విషయమున నంతగా సంబంధము లేకపోయినను, గ్రంథములు రెండును ఒకేకాలమునకు చెందినవి. ఈ రెండు గ్రంథముల కృతిపతులును నరస భూపాలురే. కాని ఇరువు రొక్కరు కారు. ఒకరు తోరగంటి వంశమువారు. వేరొకరు గొబ్బూరి వంశమువారు. మూర్తి కవికృతి తోరగంటి నరసరాజున కిచ్చినది.

కృష్ణ యజ్వకృతమైన అలంకార ముక్తావళి యను నరస భూపాలీయమునకు రామాభ్యుదయము కృతిగొన్న గొబ్బూరి నరసరాజు కృతిపతి. ఈ ఇరువురు నరసరాజులును అళియ రామరాయల మేనల్లుండ్రే. ఈ కారణమువలన నీకృతులకు సమకాలీనత సంభవించుచున్నది. కాని ఒక కృతిని చూచి వేరొకకృతి వ్రాయబడినదని చెప్పుటకు ప్రబలమైన దృష్టాంత మేమియు లేదు.

అలంకార ముక్తావళి యొక్క ప్రతి యొక్కటి అడయారు లైబ్రరీలో 73051 (29 కె 18) నంబరుగల తాళపత్ర ప్రతి కలదు. దీనికే నాగరి లిపిలో వేరొక ప్రతి కాగితములమీద నిటీవల వ్రాయించినది గోచరించుచున్నది. (టి. ఆర్. 383; 64843). తాళపత్రప్రతి తెలుగు లిపిలో వ్రాయబడినది. నూటనాలుగు కమ్మలున్నవి. వ్రాత స్పష్టముగా రెండు వైపులా వ్రాయబడియున్నది. గ్రంథ మచ్చటచ్చట కొంచెము శిథిలమై యున్నది. సంస్కృతాలంకార శాస్త్ర గ్రంథములలో చాల ప్రముఖమైన యీ గ్రంథము వేరొకచోట కానవచ్చినట్లు తెలియరాలేదు.

ఈ గ్రంథమును ప్రతాపరుద్రీయమున కనుకృతిగా చెప్పినచో కేవలము అధ్యాయములన్నియు నొకానొక కృతిపతిని గూర్చి రచించుటయుండదే. కాని కావ్యము యొక్క రచనా క్రమ మంతయు మిక్కిలి స్వతంత్రమైనది. ప్రతాపరుద్రీయము ననుసరించి వ్రాయబడిన లక్షణములు దీనియందున్నవి. దానికన్న నొకవిధముగా నిది విస్తృతమైనది. మూర్తి కవిరచనము కేవలము ప్రతాపరుద్రీయము ననుసరించినది యగుటవలనను కృష్ణయజ్వకృతి ప్రతాపరుద్రీయ మార్గమునకు చెందినను, స్వతంత్రమైనది యగుటవలనను ఈ రెండు కృతుల నడుమ జన్యజనక భావమును స్థాపించుటకే వీలు కల్గదు.

కృష్ణయజ్వ ఇంటిపేరు సుష్టువారు. తండ్రిపేరు సూరిభట్టోపాధ్యాయుడు. ఈతనిది వాధూలగోత్రము. దీనియందు ఈతనిని గూర్చి యే వివరములు తెలియవచ్చుట లేదు.

"సోహం తత్తనయః సుష్టు కృష్ణయజ్వసుతః సతాం
సర్వశాస్త్రరహస్యజ్ఞః సర్వాలంకారకోవిదః"

అని తన పాండిత్య విశేషమును గూర్చి ప్రశంసించుకొన్నాడు. కావ్యము యొక్క గద్యలో నిట్లుచెప్పుకొని యున్నాడు, "ఇతి శ్రీమద్వాధూలకులతిలక సుష్టువదాంక సూరిభట్టోపాధ్యాయతనయ కృష్ణయజ్వ విరచితే అలంకార ముక్తావల్యాపర పర్యాయే నరసభూపాలీయే వర్ణగణ వివరణం నామ ప్రథమ ఉల్లాసః" ఈ విధముగా నారుల్లాసములయందును తదుల్లాస విషయమును చెప్పుచు గద్యను రచించి యున్నాడు. ఈ గ్రంథారంభము ప్రతాప రుద్రీయమువలెనే సరస్వతీస్తుతితో

ప్రారంభింపబడినది.

"వందారు త్రిదశేంద్రమౌళి మహిత శ్యామాశ్మ రశ్మిచ్ఛలో
దంచచ్చంచల చంచరీక రుచిరం మేధా మృణాలోద్భుతే
సేవ్యం సత్కవిభిః పరంశ్రుతి శిరోభూషా విశేషోజ్జ్వలం
వన్దేకీర్ణ నఖాంశు కేసరచయం వాణీ పదాబ్జద్వయం"

ఈ గ్రంథము నందారుల్లాసము లున్నవి. ప్రథమోల్లాసమున వర్ణగణ వివరణమున్నది. ఇది సాధారణముగా నలంకార శాస్త్ర గ్రంథములయందు కానరాని విషయము. వ్యాకరణ శాస్త్రమునకు సంబంధించినది. రెండవ యుల్లాసము శబ్దార్థ ప్రతిపాదకమైనది. మూడవ యుల్లాసమున ధ్వని విశేష వివేచనము చేయబడినది. శబ్దార్థ ప్రతిపాదనము చేయునప్పుడు అభిధాలక్షణ వ్యంజ్యనాశక్తులను గూర్చి తద్భేదములను గూర్చి ద్వితీయోల్లాసమున చర్చించి మూడవదానియందు ధ్వన్యభావ వాదమును ఖండించి ధ్వనిని స్థాపించి తద్భేదములను చర్చించి యున్నాడు. చతుర్థోల్లాసమున కావ్యవిశేషములను గూర్చి వివరమున్నది. కావ్యములు ఉత్తమ మధ్యమాధమ భేదమున మూడు విధములనియు వానిని నిరూపించి చాటు ప్రబంధములైన ఉదాహరణ, చతుర్భద్ర చక్రవాళాది కావ్యములు నిరూపితములైనవి. దృశ్యకావ్య లక్షణముకూడ దీనియందే నిరూపింపబడినది. పంచమోల్లాసము నాయకలక్షణ నిరూపణ ప్రధానమైనది. నాయకుని మహాకులీనత్వాది లక్షణములు, నాయికలందుగల యనేక భేదములు వివరింపబడినవి. చివరిదియైన యారవ యుల్లాసమున రసనిరూపణము చేయబడినది. రసమునుగూర్చిన వివిధమతముల చర్చించి వ్యక్తివాదమును బలపరచి రససంబంధములైన విభావానుభావవ్యభిచార్యాది భావముల నన్నింటిని విపులముగ చర్చించి యున్నాడు. శృంగారరసము యొక్క భావభేదములను లక్ష్యలక్షణములతో వివరించి యొక్కొక్క రసములను ప్రాయికముగా పేర్కొనదగిన విభావాదులను చెప్పియున్నారు. భావోత్పత్తి, భావశాంతి భావశబలతను గూర్చియు చెప్పినాడు.

స్థూలముగా గ్రంథముయొక్క స్వరూప మిట్టిదని చెప్పవచ్చును. కావ్యముయొక్క నిర్మాణలక్షణమును పరిశీలించినప్పుడు ప్రతాపరుద్రీయమునకు దీనికిని భేదము దృశ్యమానమగును. ప్రతాపరుద్రీయముయొక్క విషయపరిధి దీనికన్నను విస్తృతమైనదిగా గోచరించును. విద్యానాథుని కృతిలోనున్న శబ్దార్థాలంకారములు గుణదోషములు నాల్గయిదు ప్రకరణముల విస్తారముగలవి. వానియొక్క ప్రసక్తియే యీ గ్రంథమునందు లేదు. గుణదోష శబ్దాలంకారము లీగ్రంథమున తొలుతనుండి శిథిలమైన ట్లనుమానించుటకొక శ్లోకము పిలిచ్చుచున్నది.

అలంకార ముక్తావళిలోనున్న వర్ణగణ వివేకమును గూర్చిన చర్చ ప్రతాపరుద్రీయములో కానరాదు. మిగిలిన యైదుల్లాసములలోని విషయము విద్యానాథ కృతియందును కానవచ్చును.

విద్యానాథుని రచనకును, కృష్ణయజ్వ రచనకును ముఖ్యమైన భేదమొకటున్నది. విద్యానాథుడు ప్రాచీన లాక్షణికుల మతములనన్నింటి నవలోకనచేసి తన నిశ్చయములను సంగ్రహముగా స్ఫుటముగా వివరించియుండ, కృష్ణయజ్వ యాయా మతములను వివరించి వాని భేదములను సమీక్షించి వానిని ఖండించి తననిర్ణయమును చెప్పును. ఇది యొకవిధముగా వ్యాఖ్యానమువంటి రచన. విద్యానాథుడు తన గ్రంథమున నాటకప్రకరణమున లక్ష్యముగా నొక నాటకమును రచింపగా కృష్ణయజ్వ నాటకమును రచింపక ఉదాహరణమును, చక్రవాళమును, చతుర్భద్రమును లక్షణము వివరించు పట్టుల గొబ్బూరి నృసింహ పరముగా లక్ష్యముగా రచించెను. ఈ దేశీయములైన ప్రబంధములను విద్యానాథుడు క్షుద్రప్రబంధములుగా పేర్కొనగా, కృష్ణయజ్వ చాటుప్రబంధము లనెను.

ఈ విధముగా ప్రతాపరుద్రీయము తోడనే కృష్ణయజ్వకృతికి జన్యజనక భావము లేదని యనుకొన్నప్పుడు, ప్రతాపరుద్రీయముతో ప్రత్యక్ష సంబంధముగల నరసభూపాలీయమగు నాంధ్రకావ్యాలంకార సంగ్రహమునకు దీనికిని నామసామ్యము తప్ప వేరుగా జన్యజనక భావము నారోపించుటకు వీలగుపడుట లేదు. భట్టుమూర్తి కృతిని కృష్ణయజ్వ విని యుండవచ్చును. లేదా చూచియు నుండవచ్చు ననుట కాధారము లేకున్నను అభ్యంతరములేదు. కృష్ణయజ్వకృతిని భట్టుమూర్తి చూచి యుండడేమో ? చూచియుండినచో నాతని రచనపైన, యలంకార ముక్తావళియొక్క గ్రంథనిర్మాణ ప్రణాళిక ప్రభావము పడియుండవలసినది. కాని ఈ విషయమును నిశ్చయించి చెప్పుటకు వీలు కల్గకున్నది.

అలంకార ముక్తావళియందు గొబ్బూరి నరసరాజు వంశ మిట్లున్నది.

సూర్యవంశము

గొబ్బూరి తిమ్మరాజు

|

గొబ్బూరి కొండరాజు

|

గొబ్బూరి తిమ్మరాజు — నల్గురితర కుమారులు

(భార్య : ఓబమాంబ. శ్రీ రంగరాజు కూతురు)

|

గొబ్బూరి నృసింహుడు (కృతిభర్త) — గొబ్బూరి జగన్నాథుడు

రామాభ్యుదయమునందు వీరి వంశ మిట్లే యున్నది. దానియం దింతకన్న యనేక వివరములున్నవి.

కంకాళ చోళుడు (మూలపురుషుడు)

రంగరాజు

|

తిమ్మరాజు

|

కొండనృపాలుడు

|

తిమ్మరాజు (భార్య : ఓబమాంబ) — వెంగళరాజు — గొబ్బూరయ్య — తిరుమలరాజు — ఓబళరాజు — చిన్ననరసరాజు

తిమ్మరాజు → నరసరాజు (కృతిభర్త) — జగ్గరాజు

ఓబళరాజు → జేబళుడు — కొండరాజు — తిమ్మరాజు — నరసరాజు

అలంకార ముక్తావళి యందు గొబ్బూరి నరసరాయల తమ్ముడు జగన్నాథుడని యుండగా (జాతౌపుత్రౌ నృసింహ క్షితితిలక జగన్నాథరాజాభిధానే) రామాభ్యుదయమందు జగ్గరాజని యున్నది.

ముందుచెప్పినట్లు, తెలుగు నరసభూపాలీయము యొక్క కృతిభర్త తొరగంటి నరసరాజు, రామాభ్యుదయమునకు నలంకార ముక్తావళికి కృతిభర్తయైనవారు గొబ్బూరి నరసరాజు. ఈ ఇర్వురుని ఆత్రేయుడైన ఆరవీటి వంశమునకు చెందిన అళియ రామరాయలకు మేనల్లుండ్రు. వీరి తల్లులు లక్కమ్మ, యోబమ్మలు. ఈతని వేరొక మేనల్లుడు తిమ్మరాజు. ఆతడు పంచమ యోగి విలాసకర్త. (వసుచరిత్ర విమర్శనము. పేజి 120) ఈతడే లక్ష్మణకవి యనువానిచే ప్రసన్న రాఘవ వ్యాఖ్య రచింపజేసెను. ఈ తిమ్మరాజు తల్లియైన కోనాంబకూడ రామరాయల సోదరియే. రామరాయల వలెనే ఆతని మేనల్లుండ్రందరును సాహిత్య పోషకులగుట యాశ్చర్యముగా నున్న విషయము. వారు కేవలము తెల్గుభాషకేకాక సంస్కృత భాషను కూడ పోషించినారు. అలంకార ముక్తావళిని గూర్చి శ్రీమాన్ వి. కృష్ణమాచార్యులవారు బ్రహ్మవిద్య (7 సం. 2 సం)లో తెల్పియున్నారు.

గ్రంథారంభమున సంస్కృత కావ్యసాధారణముకాని కృతిపతి వంశవర్ణనముచేసి యున్నారు.

జయతి తాదృగమానుష పౌరుషో జగతి గొబ్బురి తిమ్మనృపాత్మజః

నరపతిర్నరసింహ ముఖంతి యం నరహరేరపరావతారం బుధాః
భూభృతో యస్యకూటస్థౌ సూర్యేందూ వంశయోః పితుః
మాయిర్విభాతో ధ్వజయోః కలధౌత ఘటావివ.

వంశవర్ణన యనంతరము తన వాక్కు గొబ్బురి నరసింహుని వరించుట యెట్లిదో చెప్పుచున్నారు.

గొబ్బురీ నరస భూప మేవ మే వల్లభం ప్రజతి వైఖరీగిరామ్
కింరిలానిధి మహాస్య కౌముదీ కాన్తమన్యముపయాతు మిచ్ఛతి.
తేనాలంకృతి శాస్త్రసత్తసరణి ప్రవ్యక్తయే ప్రేరితః
సాహిత్యార్ణవకైరవ ప్రణయినాం సంప్రీతయే సంపదామ్
వక్ష్యామిక్రమశోఽత్ర వర్ణగణయోః శబ్దార్థయోశ్చధ్వనేః
వృత్తేఃనేతృరసస్య దోషగుణయోశ్చాలంకృతేర్లక్షణమ్.

ఈ క్రింది శ్లోకమునందు గ్రంథము యొక్క విషయమును గూర్చి చెప్పినారు. ఇందు రసప్రకరణము వరకే గ్రంథము గోచరించుచున్నది. దోషముల, గుణముల, అలంకారముల లక్షణములు కానవచ్చుటలేదు. గ్రంథమింతవరకే రచితమైనదో లేదా మరికొంత శిథిలమైనదో వేరొక ప్రతి దొరికినగాని నిర్ణయించుటకు వీలుకల్గని విషయము.

సత్తపస్సునకు ప్రతిభ ఫలమనియు, ప్రతిభ వలన సత్కావ్య నిర్మాణశక్తి కల్గుననియు నవకావ్య నిర్మితిని పురుషోత్తమ వర్ణనమే ఫలమని చెప్పి ఆ పురుషోత్తమ వర్ణనము తన కావ్యమందెట్లు గోచరించునో చెప్పియున్నాడు "సపరాపర భేదతో ద్విధో ప్రథమోస్మద్వచసామగోచరః అపరస్యపునః పరశ్శతాహ్యావతారా ఇహ నిర్జరాదిషు" "తదహం సముపేత్య భావినః సమతీతానపి తామగోచరాన్ గుణరత్న గణాపరో దధే రవతీర్ణతు బాహుజాన్వయే" అని యా బాహుజాన్వయము నరసింహుని యపరావతారమని చెప్పబడుచున్న గొబ్బూరి నరసింహుని గుణముల నుదహరించుచు స్ఫుటలక్షణ లక్ష్యరూపముగా సదలంకారవమును నిబంధించుచున్నానని చెప్పియున్నాడు. ఈ దృశుడైన యుత్తమ నాయకుని వర్ణనలేనిచో కావ్యమునకు శోభ సమకూడదని కృష్ణయజ్వయభిప్రాయము.

లలితాపి కవేర్న వైఖరీ వచ సాంనేతృగుణోత్కరం వినా
భువి రాజతి సౌరభం వినా కుసుమస్రక్కము భాతి కోమలా
కృతిరుత్తమనాయకాంకితా విగుణాపి శ్రవణావతం సతి
విదుషాం సహజాతి మాధురీకిమునస్కారము పేక్షతే సుధా.

కావ్య ప్రకాశమందు వలెనే దీనియందును కావ్య ప్రయోజనమును గూర్చి చెప్పియున్నాడు.

కీర్తిం యాకురుతేత్ర కార్తిక కన జ్యోత్స్నా ప్రతి స్పర్ధినీం
శక్రశ్రీ సదృశీం శ్రియం దిశతి సంసూతే కలా కౌశలం
చింతాశాంతి ముదంచయత్యపి పరానందం విధత్తేతరాం
కాంతాసమ్మితయా తయా విహరతే కోవాన కావ్యశ్రియా.

ఈ శ్లోకమందు కీర్తి, ధనము, కలాకౌశలము, చింతాశాంతి, పరానంద మున్నవి చెప్పబడినవి. "వ్యవహారవిదే" యన్నది కలా కౌశలమునుగను, "శివేతరక్షతయే" యన్నది చింతాశాంతిగను వివరింపబడినవి.

ఈ కవి గరుడాచలమునందు నృసింహ క్షేత్రమును ప్రశంసించుట వలన వట్రాప్రం తీయుడని యనుమానము కలుగుచున్నది.

శ్రీమద్గారుడ శైల శేఖరమణేః లక్ష్మీనృసింహ ప్రభోః
శ్రీగొబ్బూరి నృసింహ కైతవ భృతో భూలోక చింతామణేః
లాభాదుత్తను, నాయకస్య లలి 'తాలంకారముక్తావళీం'
కుర్వేతస్యగుణైస్సితాంశురుచిరైస్స్యూతాం సుధాపీతయే.

ఈ విధముగా కావ్యాది నిర్వహణము చూచినచో నాంధ్ర గ్రంథ సంప్రదాయము గోచరించు చున్నదికాని, సంస్కృత గ్రంథ సంప్రదాయము కానవచ్చుట లేదు. కృతిపతి వంశ వర్ణనాదికములు ప్రతాప రుద్రీయమున కూడ కానరావు. విద్యానాథుని నాటికి వెలసిన తెలుగు కావ్యముల యందీ సంప్రదాయము తెల్లముగా గోచరింపదు. కృష్ణయజ్వకాలము నాటికి నీ విషయము చాల ప్రచురమైనది.

ఈ కృత్యాది తరువాత ప్రథమోల్లాసము చాల చిన్నది. దీనియందు వర్ణగణ వివరణమున్నది. ఈ భాగమిట్లు ప్రారంభమగుచున్నది.

"ఆదౌ వర్ణా వివిచ్యంతే తత్రాద్యాః షోడశస్వరాః
స్పర్శాస్తు కాదయో మాన్తాః పంచవింశతీ రీరితాః" ఇట్లు ప్రారంభింపబడి వర్ణోత్పత్తి స్థానములు వివరింపబడినవి.

రెండవ యుల్లాస మిట్లు ప్రారంభ మగుచున్నది. "అథ కావ్య స్వరూపం నిరూప్యతే—

శబ్దార్థేకరణం ధ్వనిర్నిగదితోఽస్యాత్మా గుణాలంక్రియే
శ్లేషో పమ్యముఖే దయాది ముకుటాదిః కీర్త్యతే లోకవత్

శయ్యాసేవ పదానురూప సరణిః పాకోపితద్వద్రసా
స్వాదా ద్యానపదుశ్చ రీతిరివసా సోవత్కర్ష కృత్సూరిభిః"

అని కావ్య స్వరూపమును నిరూపించి దానికి ముఖ్యములైన శబ్దార్థములనీ యుల్లాసమునందు చర్చించి యున్నాడు.

ఇందు గొబ్బురి నృసింహుని గూర్చిన కొన్ని లక్ష్యములు మనోహరములై యున్నవి.

"జహదహత్స్వార్థా యథా
ఆరోఢుం సుకుమార వైరివనితా వర్గో నిజం యఃపురా
ప్రాసాదం శశికాంత కల్పిత కనత్సోపాన మధ్యక్షమః
సోయం గొబ్బురి నారసింహ నృపతౌ ఆక్రాంతసింహాసనే
ద్రాగారోహతి మేదినీధర మహాశృంగాణి తుంగోపలైః"

శత్రు కాంతలు పర్వతముల మీదకూడ భయపడెడి లక్షణము వలన నారసింహుని ప్రతాపమెంతటిదో తెలియ వచ్చుచున్నది.

ధ్వనిని నిరూపించెడి తృతీయోల్లాస మిట్లారంభమగుచున్నది.

"తతః సహృదయాహ్లాది శబ్దార్థయుగళం కావ్యమితి కావ్యస్వరూపముక్తం । తత్ర శరీరభూతం శబ్దార్థయుగళం నిరూపితం। అథతస్యాత్మభూతోధ్వనిర్నిరూప్యతే। ధ్వనిర్నాస్తీతి క్వచిదూచిరే । తన్నయుజ్యతే ॥"

ఈ విధముగా ధ్వనిభావవాదులను ఖండించి ధ్వనిని స్థాపించి తల్లక్ష్యములతో వివరించినారు. ఈతని రచన స్ఫుటమును, తార్కికమును, రుచిరము నైయుండును. వచన రచన చేయుచు వాదించుచు నెన్నియో ప్రమాణముల నెత్తిచూపును.

ఈ విషయము తెలుపుటకు రసాధ్యాయారంభము యొక్క రచన యెట్లున్నదో యెత్తి చూపుదును.

"ఇత్థం నిరూపితోనేతా సప్రపంచ రసాశ్రయః
తదాశ్ర యోరస..........
తత్రరస నిరూపణం
ప్రాగ్యోషిత్ప్ర ముఖైరితోం కురిత తాం రత్యాదిరాలంబనైః
స్థాయీకందలితోఽథ తద్గుణము ఖై రుద్దీపనై రుద్దీపితః
భ్రూవిక్షేపముఖానుభావ విభవైః స్తంభాదిభిః సాత్త్వికైః
(సంచారి) వ్యభిచారిభిః కిసలయీ చాస్వాద్య (మానమ్) రసః"

సరసకావ్యసంగృహీతయా పటుతరనటప్రకటితయా వాసహృదయభావ్యమానయా విభావానుభావసంచారీ సామగ్ర్యా నిర్భరానంద సంవిద్రూపతాం నీయమానో రత్యాది స్థాయీ భావయేవ రసశబ్దేన వ్యపదిశ్యమానః , సహృదయహ్రై రాస్వాద్యత ఇతిరసః తదుక్తమ్। "రసతే స్వాద నార్థత్వా ద్రస్యంత ఇతితేరసాః" తథా "వ్యంజనోపధ సంబంధో యథాన్నం స్వాదుతాం నయేత్ ఏవం నయంతి రసతా మితర. స్థాయిసంశ్రితాః" యథా విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః ఆనీయమానః స్వాదుత్వం స్థాయీభావోరసస్మృతః" ఇతిచ, 'రసస్యోత్పత్తి మాహుః కేచి న్యేజ్ఞప్తిం వివక్షతే। ఏకే భుక్తిం వదాన్యే వ్యక్తిం రసవిదో విదుః' తత్రోత్పత్తి వాదినో రామాదావనుకార్యే కారణక్రమేణోత్పన్నో రసో రామాద్యభేదభావనయా నటేప్రతీయత ఇత్యాహుః। జ్ఞప్తివాదినస్తు రామాదినాయక తాదాత్మ్యాపన్న నట ప్రకటిత కటాక్ష వీక్షణ భ్రూవిక్షేపరోమాంచ గద్గద బాష్ప చింతాప్రభృతి భిర్విభానుభావ సాత్త్విక సంచారి భావై స్సరైవప్రతీతి వద్యను మాపన్నైః అనుమాపకైః స్థాయినో రత్యాదే రనుమితి లక్షణా లౌకికజ్ఞప్తి రేవ సామాజికానాం క్రియత ఇతి ప్రతిపాదయన్తి। భుక్తివాదినస్తు కావ్యనాటక శబ్దవ్యాపార సహకృతేన సహకారిణీకృత విభావాదికేన భావక వ్యాపారేణ నటాది గతత్వ పరిహాణేన సాధారణ తయా సంధీయమాన స్థాయీ ప్రకాశానన్ద సంవిన్మామ్నా భావ నాఖ్య వ్యాపారేణ భుజ్యత ఇత్యాచక్షతే। వ్యక్తివాదినస్తు లోక ప్రసిద్ధై కార్యకారణ సహకారిభిరేవ కావ్యే గుణాలంకార మహిమ్నా నాటకే చతుర్విధాభినయ మహిమ్నాచా లౌకిక విభావాది శబ్దవ్యపదేశ్యై సాధారణ్యేనానుసంధీయమాన స్వగతయేవ సామాజికానాం స్వానుభవ జనిత వాసనాత్మక తయాస్థిత స్థాయి విభావాదిభిరాస్వాద్యతాం గమితః స్వప్రకాశయో రసోవ్యంజ్యత ఇతివర్ణయంతి। తత్ర బహుభిరాశ్రైరభివ్యక్తి పక్షయేవోరరీకృతః."

అతని వచన రచనను చూపించుటకీ యుదాహరణము చాలును. గ్రంథమునిండ ఇట్టి రచన యున్నది. అక్లిష్టమైన యీ వచన రచన శాస్త్ర పాండిత్యము వలన నాయా విషయములు పాఠకులకు తేట తెల్ల మగునట్లు లొనర్చినది. రసమును గూర్చి తొలుత చెప్పి వాదములను సంగ్రహముగా వివరించి వానియందీ వాదము శ్రేష్ఠమని యార్యు లంగీకరించి

రనియు చెప్పెను.

ఇక్లే చూడవ యుల్లాసమున ధ్వనిని నిరూపించి నాల్గవ యుల్లాసమునందు కావ్య విశేష వివేచనము నొనర్చెను. 'ఉత్తమం మధ్యమం కావ్య మధ మంచ త్రిధామతం' అని ఈ యుల్లాసము ప్రారంభమగు చున్నది. గుణీ భూత వ్యంగ్యము నందు స్ఫుట వ్యంగ్యమున కీ కావ్యమున లక్ష్యమిది.

గగనాంత చరోఽఖిలాంగ శుభ్రో నరసింహ ఊలిపాల కీర్తి పూరః సుధియామపి నో దదాతి భిన్నా వపి దుగ్ధాంబునిధి వివేచనాయ.

ఈ యుల్లాసమునందు రూపక లక్షణము నిరూపింప బడినది. కాని లక్ష్య మీయబడలేదు. ఉదాహరణ, చక్రవాళ, చతుర్భద్రముల లక్ష్యములతోపాటు లక్షణము లొసంగబడినవి. ఉదాహరణము యొక్క లక్షణము ప్రతాప రుద్రీయమునందు కలదు. ఈ గ్రంథమునందు దానికన్న విపులముగా లక్షణము చెప్పబడినది. అసందిగ్ధముగా నుండుట కొరకొక లక్ష్యమును కూడ నేర్పరచి యున్నాడు.

"అథ చాటుప్రబంధాః

చాటు ప్రబంధా విఖ్యాతా ఉదాహరణ మాదిమమ్
చక్రవాళం చతుర్భద్రం చతురుత్తర మప్యథా
ఆవలో భోగబిరుద గుణానా మథఖోషణా
విజయ త్యాగరంగాణా మిత్యాద్యాః కవికల్పితాః
సంబోధన విభక్త్యంత ప్రథమాది విభక్తికైః
విచిత్ర ప్రాస విలసత్కలి కోత్కలికా క్రమైః
పద్యేన నవమే నాంతే యుక్తైస్సర్వ విభక్తినా
జయత్యుపక్రమై ర్మాలిన్యాద్యైః ప్రాసవిచిత్రితైః
విలసన్నే ల్పనామాంకైః పదై రష్టా భిరంచితం
ఉదాహరణ మేతచ్చ శుద్ధం మిశ్రమితిద్విధా
ఏకభాషాకత్వం శుద్ధంమిశ్రం భాషాంతరాన్వితమ్.

అని యుదాహరణ స్వరూపమును విపులముగా నిరూపించి శుద్ధ మిశ్రభేదమును తెలిపినాడు. కళికోత్కళికల స్వరూపమును కూడ వెల్లడించి యున్నాడు.

కళికోత్కళికా స్వరూపమ్.

తాళ మాత్రాయతి శ్లిష్ట దళాష్టక సమన్వితమ్
అపిచాద్యం దలద్వన్ద్వా దన్త్యప్రాప విచిత్రితమ్
శ్రవ్యబంధ పదం కావ్యం కలికాం కవయోవిదుః
మాత్రా గణోచితంకా.... తాలం ప్రచక్షతే
మాత్రాదికేషు సామ్యేన స్థితా మాత్రాగణా మతాః
దలమధ్య గతచ్ఛేదో యతిః కవిభిరీర్యతే
సుసహస్తోత్తర దళం వ్యస్తైక దలమం తతః
పసర్గ్యానం కించిద్వా న్యాసమాత్ర సమన్వితం
కలికాలక్షణోపేతం వాక్యముత్కలికాం విదుః
కేచిదుత్కలికాస్థానే కేవలార్యాం ప్రచక్షతే
మాతృకా మంజరీ స్వస్తు విజ్ఞాయా బహుధాభిదా
అస్తేనుస్తుథ మార్యాంవా కవి కర్తృన్వయాన్వితమ్
కుర్యాచ్చాటు ప్రబంధానాం అయం సాధారణో విధిః.

ప్రతాప రుద్రీయములోని కళికోత్కళికల లక్షణము సందేహములకు కారణమైనది. ఇంత విస్పష్టముగా నందు చెప్ప బడ లేదు. ఉత్కళికల స్థానమునందు కొందరార్యా వృత్తమును ప్రయోగింతురను నది చాల క్రొత్త విషయము. మనకు లభించిన యుదాహరణములలో (సంస్కృతము లోనివి) నార్యావృత్తము నుపయోగించినవి లభింపలేదు. ఇందువలన ననేకోదాహరణ కృతులు నష్టములైనట్లు మనము నిశ్చయముగా చెప్పవచ్చును. ఈ గ్రంథములో ఈ లక్షణము తరువాత గొబ్బూరి నృసింహోదాహరణ మున్నది. శ్రీ నిడదవోలు వెంకటరావుగారి యుదాహరణ వాఙ్మయ చరిత్రములో నీ యుదాహరణము చేరలేదు. ఈ యుదాహరణము చివర నీ శ్లోక మిట్లున్నది.

"రచిత మిదం సుష్ఠు పదాంకిత కృష్ణాఖ్యేన యాయజూకేన
శ్రీ గొబ్బూరి నృసింహోదాహరణం జగతి సంతతం జయతాం"

ఇక్కడనే చక్రవాళ చతుర్భద్రములు రచించి ఈ యుల్లాసమును ముగించి యున్నాడు భోగావళి, భోగ విరుదాదుల కొరకు కవుల యితర రచనములను చూడమని కోరినాడు. ఈ విధముగా కావ్య విశేష నిరూపక మైనచతుర్థోల్లాసము ముగిసినది.

పంచమోల్లాసము. ఇది నాయక నిరూపణ ప్రధానమైనది. రస స్వరూపమును నిరూపించుటకు పూర్వము దానికి ప్రధానమైన విభావ నిరూపణము చేయబడినది.

నాయక లక్షణ మిట్లు చెప్పబడినది. "గుణా మహాకులీనత్వ ముజ్జ్వలత్వముదారతా తేజస్వితా మహా భాగ్యం ధార్మికత్వం విదగ్ధతా। పాండిత్యం ధీరతేత్యేవ మాద్యా నేతురుదాహృతాః" అని గుణముల లక్ష్యము లొసంగబడినవి. అవి శబ్ద

గ్రహణమున మహా మహిమాదులను చెప్పియున్నాడు. దాని లక్షణ లక్ష్యములివి.

దేవతాత్మకతా యాసాం మహోమహిమ తామతా—

అస్తంభోద్భూతి ముర్వీసుర జయబల హిరణ్యార్తి విధ్వస్తలీలా
లబ్ధాకృ్యారావతారం వికృతి విరహితం విశ్వరక్షావిధానే
నైక ప్రహ్లాద పోషప్రణిహిత మనసం మానవంతం నితాంతం
లక్ష్మీశ్లిష్టాఖిలాంగం భజత బుధజనా గొబ్బూరి శ్రీనృసింహం.

గొబ్బూరి నారసింహునకు శ్రీలక్ష్మీ నృసింహునకు సామ్యము చెప్పి ఆ దేవతాత్మ లక్షణము వలన రాజునందు మహా మహిమత్వమును స్థాపించియున్నాడు. హిరణ్యార్తి విధ్వంసము, ప్రహ్లాద పోషప్రణిహితత్వము, లక్ష్మీశ్లిష్టాఖిలాంగత్వము మొదలైనవోట్ల యర్థమునందు నృసింహ పరముగను, భూజాని పరముగను మనోహరముగను సంధించి యున్నాడు.

నాయక స్వరూపమును చెప్పు పట్టున నీవిధముగా వ్రాసి యున్నాడు.

యశః ప్రతాప సంపన్న స్త్రివర్గ స్సమదర్శనః
ధౌరేయో గుణశాలీచ నాయకః స ఉదాహృతః

నాయక లక్షణములు చెప్పిన యనంతరము నాయికా లక్షణములు చెప్పబడినవి. ముగ్ధ లక్షణము నీవిధముగా చెప్పి యున్నాడు.

ముగ్ధోద్య ద్యౌవనా లజ్జా జితకామా మృదుఃక్రుధి
కృతాగసి ప్రియేవక్తి నకించిద్రోదితి స్వయమ్

ఉదయ ద్యౌవనత్వమునకు లక్ష్యము

కుచ జఘన దృగన్తే కూరితం పాటిపాదే (?)
కిసలయిత మధోష్ఠే, పుష్పితంచాన నాబ్జే,
భ్రమరితమలకాన్తే యౌవనోద్యాన ముద్య
త్ఫలితమిహ నృసింహక్ష్మా పదా నీరజాక్ష్యాః.

'కిసలయిత మధోష్ఠే' ఇత్యాదులు మరియు రుచిరములైన యభివ్యక్తులు ఈ నాయికలందరు మూడు వందల యెనుబది నాలుగు భేదములని ప్రకరణాంతమున సంగ్రహముగా చెప్పి యున్నాడు..

షష్ఠోల్లాసము రస నిరూపణమునకు చెందినది. రస స్వరూపమును నిరూపించుట కొరకు కవి యెట్లుద్యుక్తుడై దానిని వివరించినది ముందే చూపబడినది. రస స్వరూపము, రస భేదములు భావములు వాని భేదములు లక్ష్య లక్షణములలో నీ ప్రకరణమునందు నిరూపింప బడినవి.

భావస్వరూపమిట్లు చెప్పబడినది.

జానక్యాది వియోగ యోగ జనిత క్లేశాది మద్రాఘవా
ద్యుర్వీశామను కర్తృభిః ప్రకటితై ర్వాగంగ సత్వోద్భవై
ర్భావైః కోమల కావ్యజాలకలితైః వా భావితైః వాసనా
యా సామాజిక చేతసిస్ఫురతి తంభావం విదుః భావుకాః.

ఈ ప్రకరణ మందున్న రెండు లక్ష్యశ్లోకముల నుదాహరింతును.

అవహిత్థా లక్ష్యము.

తవగుణకథ నే కృతేసఖిభిః
నృప నిజహార విలోకనచ్ఛలేన
ముఖ మవన మితం కరోతి కాంతా
స్మిత మధురం పులకోల్ల సత్కపోలం

మనస్సంగ లక్ష్యము

అనుసరతి రాజహంసో
మానస మిత్యాశీ విశ్రుతం జగతి
నరసింహ రాజహంసం
మానస మేవానుయాతిమే చిత్రమ్ :

ఈ విధముగా లక్ష్యశ్లోక రచన చాల మనోజ్ఞముగా, చమత్కారావహముగా చేయబడినది. శృంగార రససంబంధమైన భావములను నిరూపించిన యనంతరము వేరువేరు రసముల విభావాదులను చెప్పి లక్ష్యముల నొసంగి యున్నాడు

తరువాత భావశబలతాదులను నిరూపించి నారు. రససంకరమునుకూర్చి యొక చక్కని శ్లోకమున్నది.

అథ భావమేళన ప్రసంగాద్రస సంకర ఉదాహ్రియతే :-

కాంతాయాః కుచకుంభయోః విరచయన్ కాశ్మీర పత్రాంకురం
శ్రుత్వా శ్రీ నరసప్రభో తవ భటః త్వద్యుద్ధ భేరీధ్వనిమ్
హర్షోల్లాస మనోహరాస్య కమలో రోమాంచ వర్మోల్లసత్
సర్వాంగః కుసుమస్రజా దృఢతరంబధ్నాతి మౌళిం నిజః.

శృంగార రస ప్రవాహమున మునిగియున్న నరసభూభటుడు యుద్ధభేరీరావము వినినంతనే హర్షోల్లాసముతో రోమాంచమే

సర్వాంగ కవచముకాగా కుసుమస్రజముచేత తన మౌళిని బంధించుచున్నాడు. శృంగార వీరరసముల సంకర మీ శ్లోకము నందున్నను దాని యందము గొప్పగా నున్నది. యుద్ధ భేరీరవ మెంతటి ప్రేరణ కల్గించినదో, నరసభూవరుని భటుని యందెంత ప్రతాపమో యీ శ్లోకమునందు వ్యక్తమగుచున్నది.

ఇంత యుత్తమ గ్రంథము తెలుగు రాజుల పోషణలో తెలుగు కవిచేత విరచింపబడినది, యింతకాలముగా ప్రకటింప బడక పోవుట చాల విచారకరమైన విషయము. ఇందు కేవ లాలంకారిక విషయములేకాక చారిత్రిక విషయములుకూడ లభింపవచ్చును.

సమ కాలిక ములైన సంస్కృతాంధ్ర నరసభూపాలీయ ములను గూర్చి తరచి గాని నిశ్చయముగా పోలికలను గూర్చి చెప్పుటకు వీలులేదు. "ఈ రెంటికిని జన్య జనక భావము లేకు న్నను సాదృశ్య రేఖకల"దని శ్రీ మానవల్లి వారు వ్రాసిరి. ఆరేఖ యెట్టిదో మఱియొకసారి వ్రాయుదును.

ఇంకను తెలుగు దేశములో పరిశోధించినచో దీనికి ప్రత్యం తరములు లభింపవచ్చును. నేనూ హించినట్లు ఇంకను రెండు మూడుల్లాసములు కూడ వానివలన లభింప వచ్చును. పరిశోధ కులు ప్రకాశకులు మనవిని శ్రద్ధతో పరిశీలింప వలయును.

బహుమతులు గెల్చినవారు

ప్రథమ, ద్వితీయ త్రైమాసిక బహుమతి బాండ్ల డ్రాలలో గెలిచిన వారి పేర్లు, చిరునామాలు కొన్ని క్రింద ఇవ్వబడినవి.

ప్రథమ త్రైమాసిక డ్రా

1. శ్రీ హెచ్. కె శ్రీనివాసరావు. ఎజి 740236 రు. 500.
   మునిసిపల్ ఉన్నతపాఠశాల,
   తాడిపత్రి, అనంతపురం జిల్లా.

2. శ్రీ బాబూలాల్ సంఘి ఎఎ 848928 రు. 1000.
   C/o యం. బి. సంఘి,
   బట్టల వ్యాపారం, పత్తర్ ఘట్టి, హైదరాబాదు.

ద్వితీయ త్రైమాసిక డ్రా

1. శ్రీ నెమ్మి చిన్న నాగన్న, ఎఎ 853944 రు. 1000.
   మార్కెటింగ్ అసిస్టెంట్, బ్లాక్ నంబర్. 8.
   న్యూ మునిసిపల్ క్వార్టర్స్,
   దోమలగూడ మార్కెట్ దగ్గర, హైదరాబాదు.

2. శ్రీ టి. నరసయ్య. ఎఎ 895273 రు. 1000.
   అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీరు,
   12-1-36, పాతమల్లేపల్లి, హైదరాబాదు.

3. శ్రీ భోగవిల్లి వెంకటసత్యనారాయణ, ఎసి 091188 రు. 500.
   రిటైర్డు జిల్లా రిజిస్ట్రార్,
   నర్సింగరావుపేట, అనకాపల్లి.

4. శ్రీ రేవాభాయ్ మోతిలాల్ చౌహాన్, ఎసి 351050 రు. 50.
   కేరాఫ్, ఎక్జిక్యూటివ్ ఇంజనీరు ఆఫీసు,
   సబర్ కాంత డివిజన్ (ఆర్ &బి)
   పి. డబ్ల్యు. డి., హిమాయత్ నగర్.



కాఫీ దేవత

పమిడికాల్వ చెంచునరసింహశర్మ

సాఫీగా నినుఁ గొల్చువారలకు నిచ్చల్ మానసాంతర్ వ్యథల్
మాఫీ సేయు ప్రభావమున్నదని సంభావించుచున్ ప్రీతినై
కాఫ్లరైనను నిన్ను వీడరు మహాక్షామంబులందైన నో
కాఫీదేవి! త్వదీయ దివ్యమహిమల్ గన్గోఁగ శక్యంబటే ?

ఎన్ని దినంబులేని భజియింపఁ, గనంబడ రన్యదేవతల్,
నిన్నొకసారి ప్రీతి మది నిల్పినయంతట పూగవర్ణ భా
స్వన్నవ మోహనాకృతి నెసంగుచు నాత్మసఖీజనంబుతోఁ,
గన్నుల విందుగా నెదుటఁ గన్పడు చుండుదు వెప్పుడైనను౯.

ఏ దేవతా నామ మెపుడు దల్పనివాఁడు
నీ నామము౯ మది నిల్పియుండు;
ఏ వస్తు నిర్మాణ మెప్పు డెఱుంగని వాఁడు
నీరూపు నిర్మింప నేర్చియుండు;

ఏ గౌరవోన్నతి నెప్పు డొందనివాఁడు
నీ గౌరవ ఖ్యాతి నెగడియుండు;
ఏ యోషధీగుణం బెపుడు గాననివాడు
నీ గుణోజ్జ్వలత వర్ణించు చుండు;

ఏ పదార్థంబు గొననేని నేడ్చువాఁడు-
చింతిలఁడు 'ఖర్చు' నీ కొఱ కెంతయైన;
ఏ తపశ్శక్తిఁ గంటి వీ వింత మహిమ ?—
వినుత సుగుణావలంబ! కాఫీపరాంబ!!

విస్మరించిన నిన్నొకవేళ నపుడె
శీర్షవేదనఁ గూర్చి శిక్షింతు వీవు:
తుదకుఁ గాకాసురుని బోలె వెదకి వెదకి
దిక్కుఁ గానక నీ కాళ్ళ మ్రొక్కుచుండ్రు!

నినుఁ దొల్త భక్తిఁ గొల్వని పురోహితులకు
సాగదు పిళ్ళారిసామి పూజ;
మున్ను నిన్ సేవింపకున్న డాక్టర్లకు
జరుగ నేరదు చికిత్సాపథంబు;

తొలి నీపదార్చనల్ సలుపని వక్తల
కభివృద్ధి గన దుపన్యాస పటిమ;
నీపూజ మొదట పూనిన కవీంద్రావళి
కమరదు మధుర భావానుభూతి;

గడియ గడియకుఁ బ్రీతి-నీ 'యడుగులకును
మడుగు లొత్తుచు' భజియింప కుడిగె నేని,
అపుడె-భవదీయ చటుల రోషాగ్ని శిఖలఁ
గ్రాగిపోవదె "నవ్యనాగరిక జగము"?!

వ్రతములు, పితృకార్యములున్,
క్రతువులు, దేవార్చ నాదికర్మలు-నీ స
మ్మతిపైఁ జేసిన జరుగున్;
స్వతంత్రముగఁ జేయఁ బూన, సాగ దొకటియున్!!

చేతఃప్రీతి ఘటించుచున్, బ్రజలకున్ జేదోడు వాదోడుగాఁ
బ్రాత స్సాయములందెగాక సత మారాధింప నొప్పారు ప్ర
ఖ్యాతిం జెందితి వీవు; నీకుఁ గల 'యాత్మాకర్షణం, బోజగ
న్మాతా! యే తెలుగింటు లేనిఁ గనిరే? మర్యాద లట్లుందిరే!?

ఒక్కసారి యైన నుదర పేటిక నిన్నుఁ
జేర్చుకొన్న భాగ్యశీలు నిల్లు
విడువ, వింక వానిఁ గడతేర్చునందాఁక
అమిత కరుణ, భక్తులందు-నీకు!!

పురుహూత భూమిదానము
పరమము దానములయందు బహువస్తుతతుల్
ధరణీ తలమున యందును
విరళంబై యెపుడు నుద్భవించుట కతనన్.

— *భీమఖండము*

పారిశ్రామిక విశేషాలు

భారీ విద్యుత్పరికరాలు

రెండవ భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీని దక్షిణాదిన నెలకొల్పే విషయంలో స్థలం గురించి కేంద్ర ప్రభుత్వం ఇంకా పరిశీలిస్తూనే వుంది. రామచంద్రపురం స్థలం గురించి కేంద్రం అడిగిన అదనపు వివరాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది.

సున్నిత పరికరాలు

రాష్ట్రంలో దీనిస్థాపనకు అనువుగావుండే స్థలాల వివరాలను రాష్ట్రప్రభుత్వం పంపింది.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్

1960 డిసెంబరు 12న యీ కార్పొరేషన్ రిజిష్టరు చేయబడింది. ఇప్పటికి రెండు సమావేశాలు జరిగాయి. గాస్ సిలండర్ల ప్రాజెక్టును నెలకొల్పేందుకు ఒక దరఖాస్తును పంపింది. ఇతరత్రా నాలుగు ఫ్యాక్టరీలు స్థాపించడానికి వివరాలను తయారు చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ గనుల అభివృద్ధి కార్పొరేషన్

ఇది 1956 భారత కంపెనీల చట్టంక్రింద 23-2-61న రిజిష్టరయింది. దీని పెట్టుబడి రు. 50 లక్షలు.

ఆంధ్రప్రదేశ్ లఘుపరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్

ఈ కార్పొరేషన్ రు. 50 లక్షల పెట్టుబడితో 1-3-61 న రిజిష్టరు చేయబడింది.

ఇనుము,ఉక్కు కర్మాగారం

ఈ విషయం ఇంకా కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో వుంది.

లోటెంపరేచర్ కార్బొనైజేషన్ ప్రాజెక్టు

పునః పరిశీలన నిమిత్తం కేంద్రప్రభుత్వానికి పంపటం జరిగింది.

గుజ్జు వినియోగం

రాష్ట్రంలోని పంచదార ఫ్యాక్టరీలలో తయారవుతున్న గుజ్జును పూర్తిగా వినియోగించుకునే సమస్యను ప్రభుత్వం పరిశీలిస్తోంది.

ప్రైవేటు రంగం

దిగువ పేర్కొన్న భారీ పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌లో స్థాపించడానికి కేంద్ర ప్రభుత్వం లైసెన్సును ఇచ్చియున్నది.

1. పోలిస్టెరిన్.
2. పోత యంత్రాలు.
3. సైకిలు భాగాలు.
4. చక్కెర, వస్త్రపరిశ్రమ యంత్రాలు వగైరా.

కొత్త పరిశ్రమలకు దరఖాస్తులు

సిమెంటు, పంచదార ఫ్యాక్టరీలు నెలకొల్పుతామని వచ్చిన పెక్కు దరఖాస్తులను కేంద్రప్రభుత్వానికి పంపటం జరిగింది.

సింగరేణి గనుల కంపెనీ

సింగరేణి బొగ్గు గనుల ఉత్పత్తి పెరిగింది. 1961 జనవరిలో ఉత్పత్తి 2.21 లక్షల టన్నుల. గత సంవత్సరం అదే నెలలో వున్న ఉత్పత్తి 2.08 లక్షల టన్నులు.

నిర్బలులయిన గని కార్మికులకు బుట్టల తయారీలో శిక్షణ నిచ్చేందుకై సింగరేణి కంపెనీ ఒక పునరావాస కేంద్రాన్ని తెరువబోతోంది. కొత్తగూడెంలో స్థాపించదలచిన యీ కేంద్రంలో జట్టుకు 30 మంది వర్కర్ల చొప్పున రెండు జట్లను తీసుకుని మూడు మాసాలపాటు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణా కాలంలో ఉచితవైద్య సహాయంతోపాటు నెలకు రు. 30 లస్టయిఫండ్ ముడుతుంది.

ఇసుక ప్రోగుచేసే పథకం ప్రథమదశ అమలుకు సిద్ధంగా వుంది. ఇసుక పోగుచేసే కేంద్రాలనుండి సింగరేణి గనులకు ఇసుకను నాలుగుమైళ్ళ పొడవున ఆకాశంలో తీగెలద్వారా చేరవేసే కార్యక్రమం తయారయింది. ఈ పథకం మొత్తానికి రు. 55 లక్షల వ్యయమవుతుంది.

ప్రాగాటూల్స్ కార్పొరేషన్

2 కోట్ల రూపాయల వ్యయంతో ప్రాగాటూల్స్ విస్తరణకు ప్రయత్నాలు జరుగుతున్నై. వీరి ముఖ్యమయిన పనికి అనుబంధంగా వుండే పరిశ్రమలను అభివృద్ధిజేయడానికి ఫ్యాక్టరీని నెలకొల్ప వీలుగా హైదరాబాదునగరం వెలుపల 370 ఎకరాల స్థలాన్ని వీరు కొనబోతున్నారు.

(మిగతా 60 వ పేజీలో)

ప్రపంచ ఆరోగ్యదినోత్సవం

(1) ప్రమాదాలు, వాటి నివారణ

ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాల (7-4-1961) నినాదం "ప్రమాదాలు, వాటి నివారణ". ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ ప్రమాదాల సంఖ్య మితిమీరి పోతున్నది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే పెక్కు ప్రమాదాలు సంభవించకుండా నిరోధించవచ్చు. ఈ దారుణ హత్యాకాండను ప్రజల దృష్టికి తెచ్చి అనవసరమయిన ప్రమాదాలను, ప్రాణ నష్టాన్ని అంత మొందించడానికి వారి సహకారాన్ని ఇనుమడింపజేసే ఉద్దేశంతో యీ నినాదం ఎన్నుకోవటం ఎంతో సహేతుకంగా వున్నది.

శిశువు ప్రపంచంలో కాలిడి శ్వాస పీల్చటం ఆరంభించిన దాది చుట్టూ ప్రమాదాలు పరిభ్రమిస్తూనే వుంటాయని చెప్పటం కద్దు. ఒక విధంగా, మానవ జీవితమంతా కూడా ప్రమాదానికి వ్యతిరేకంగా జరిగే నిరంతర పోరాటమే. వీటిలో ఎక్కువగా తప్పుడు నిర్ణయంవల్లగాని, లేక అంతకంటె హీనమయిన శారీరక బల హీనత మూలంగాగాని లేదా అజ్ఞానంచేతగాని ముందువెనుకలు చూడకుండా లేనిపోని తెగింపుల ఫలితంగా జరుగుతుంటాయి. కనుక నివారించ వీలయ్యే "ప్రమాదం" అనే జాడ్యానికి రక్షణ శారీరక, మానసికమయిన విద్య పొందటమే.

ప్రమాదాలు ఎందుకు, ఎలా జరుగుతాయి?

ఎడతెగకుండా మనల్ని వెన్నంటే అనర్థకాలన్నింటిలోకి ప్రమాదం బహు సాధారణ మయినదిగా తయారయింది. దీన్ని గురించి మనకు తెలిసిందికూడా చాల తక్కువేమో. అంటువ్యాధులను అదుపులో పెట్టగలిగిన దేశాలలోనే, ప్రజల మృత్యువుకు ప్రధాన కారణాలలో ప్రమాదాలు తృతీయస్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. అంతేగాదు! మనిషికి 45 సంవత్సరాలు వచ్చేంతవరకు, అంటే బాల్యం, యవ్వనం, పరిపక్వ దశలోనూ ఇవి ప్రథమ స్థానంలో తిష్ఠవేస్తాయికూడా.

అయితే యీ ప్రమాదాలు సందర్భవశాత్తూ జరిగేవి కావు. సామాన్యంగా ఒకరకమయిన వాతావరణంలో, సువ్యక్తమయిన పరిస్థితులలో కాస్తో కూస్తో ముందుగా తెలిసే జరుగుతూవుంటై. కనుక ప్రమాదమనేదాన్ని అనేక విధాలుగ పరిశీలించవచ్చు. ప్రాపంచిక పరిస్థితులు, మానవుని చర్యలు వాటికి అనుకూలంగా వుంటున్నై. ఇవిగాక, మన నిత్య జీవితంలో చుట్టూరా తిరుగుతూ మనకు తెలిసిన ప్రమాదాలను ఆమోదించడానికి లేక తప్పించుకోడానికి తీసుకునే నిర్ణయాలపై కొన్ని కారణాల ప్రభావం వుంటుంది. వాస్తవానికి ఎక్కువగా ప్రమాదాలకు లోనయ్యే మానవ నైజాలు. నిర్లక్ష్యం, శారీరక శక్తి కొరవడటం. కాని యీ తప్పిదాలకు అసలు మూలకారణము ఏమిటో కనుగొనటం అవసరం. సంపూర్ణమయిన తీవ్ర నివారణ చర్యలు తీసుకునే ముందే ఆ తప్పిదాలను సవరించవలసి వుంది.

రోగకారణం, రోగలక్షణం, వాతావరణం (భౌతిక, సామాజిక) వీటన్నిటి సంయోగచర్యే వ్యాధిగా ఆధునిక వైద్యశాస్త్రం పరిగణిస్తోంది. వ్యాధి నివారణ కార్యక్రమాలలో పై విషయాలను ఏ రకంగా పరిశీలిస్తారో, అదే పద్ధతిమీద ప్రమాదాలనుకూడా నివారించ వచ్చని ఒక అభిప్రాయం వున్నది.

భూకంపం, సముద్రపు పొంగులు, వరదల వంటివి ముందుగా ఊహించరానివి, వాటిని అదుపులో పెట్టడంకూడా అసాధ్యమే. అయితే మామూలు ప్రమాదాలు చాలవరకు తనకున్న పరిజ్ఞానంతో మానవుడు అదుపులో పెట్టవచ్చు.

మామూలు ప్రమాదాలు, వాటి నివారణోపాయాలు:

ప్రమాదాలు ఎక్కువగా ఇండ్లల్లోనూ, రోడ్లమీద జరుగుతూంటాయి. ఆధునికంగా అమర్చిన గృహంలోని వంటగది, మేడమెట్లు, స్నానాల గది లేక పడక గదులు అతివేగంగా పోయే కారు లేక విమానం, వాలుపర్వతం. తుఫానులో ఓడల కంటే ప్రమాద భరితమయినవి. ఒక్కొక్కప్పుడు బల్లమీద పడేసి వుంచిన ఆస్పిరిన్ ట్యూబు, వేడినీటి పాత్రలు మొదలయిన చిన్న విషయాల మూలంగానే ప్రమాదాలు జరిగి, పిల్లలు మర

జేస్తూ వుంటారు. బహుళ ప్రమాదాల పరిస్థితిని బట్టి గృహరక్షణ సమస్య జాతీయ ప్రాముఖ్యంతో కూడుకున్నదని పేర్కొనటంలో అతిశయోక్తి వుండబోదు. శీఘ్రగతిని అభివృద్ధి జెందుతున్న కొన్ని దేశాలలో గ్యాసు, ప్రేలుడు పదార్థాలు విస్తారంగా వాడటం మూలాన యీ సమస్య ఇంకా భయంకరంగా వుంటున్నది.

ఈ జాతీయ సమస్యలను కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకున్నట్లయితే నివారించవచ్చు. "నిప్పుతో భద్రం", "వేడినీళ్ళ - జాగ్రత్త", "పిల్లల స్నానానికి వేడినీళ్ళకంటె ముందు చన్నీళ్ళు పెట్టు", "వీలయినంతవరకు పిల్లల్ని వంటింట్లోకి రానివ్వద్దు", "మిటలు సురక్షితమయిన స్థానాల్లో పెట్టించాలి", ఇలాంటి చర్యలు తల్లితండ్రులు భద్రంగా చూసుకుంటే ఇంటిలో ప్రమాదాలు జరగటానికి అవకాశం వుండదు. ఈ చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే జీవితాలను కోల్పోకుండా రక్షించుకోవచ్చు.

ఇంటిలో జరిగే ప్రమాదాల తర్వాత, రోడ్డుమీద జరిగే ప్రమాదాలు. ఇవే అధికంకూడా. రోడ్డుపై జరిగే ప్రమాదాలలో పదింటికి తొమ్మిది డ్రైవరు పొరపాటువల్ల, మిగతా ఒక్కటి కారు లోపం వల్లనో, రోడ్డు సరిగా లేకనో జరుగుతూ వుంటాయని మనం వింటున్నాం. మనం తరచు వినే యీ విషయం డ్రైవర్లను వారి బాధ్యతలు గుర్తెరిగేట్లు మేల్కొలపగలదు. కాని రాకపోకల సమస్యలను, ప్రమాదాలను తీవ్రంగా పరిశీలన జరుపుతున్న వారికి ఆ విషయం అంతగా తోడ్పడదు. రోడ్డుమీద జరిగే ప్రమాదాలన్నీ డ్రైవరు, బండి, రోడ్డు, యీ మూడు కారణాలపై ఆధారపడి వున్నాయి. మనం నిర్వచించలేని కొన్ని కారణాలమూలంగా కూడా ప్రమాదాలు జరుగుతూ వుండవచ్చు.

రాకపోకల నిబంధనలను గురించి ప్రజల కెరుకపరచి, రోడ్డుమీద తిరిగే వాహనాలను సక్రమంగా తనిఖీచేస్తూ వున్నట్లయితే, అనేక ప్రమాదాలను తేలికగా నివారించ సాధ్యమవుతుంది. ఈ ఉపాయం చాలా సులువుగా కన్పించవచ్చు. అయితేనేం. నేడు గురవుతున్న భయానక మృత్యు బారినుండి మానవజాతిని అది రక్షిస్తుంది. రోడ్డు నిర్మాణంలో కొన్ని సాంకేతిక సంబంధమయిన లోపాలు వుండటం సహజం. అవి మనం పేర్కొన్న తరగతిలో రావు — అయినా అలాంటి లోపాల సవరణకు తగిన పరిశోధన గావించబడుతోంది.

ఇవిగాక, పొలంలో, మిల్లులలో, అడవులలో మొదలయిన చోట్ల తటస్థించే ప్రమాదాలను కూడా కొద్ది జాగ్రత్త వహిస్తే చాలు, అదుపులో పెట్టవచ్చు.

ఈ సమస్యపట్ల ఆసక్తిగల ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో ప్రజలు సహకరిస్తే దాన్ని సులభంగా ఎదుర్కోవచ్చు. ప్రజా సహకారాన్ని ఇనుమడింపజేయ గలందులకై ప్రపంచ ఆరోగ్య సంస్థ, "ప్రమాదాలు, వాటి నివారణ" అనే నినాదాన్ని యీ సంవత్సరం ఎన్నుకోవటం ఎంతైనా సమంజసంగా వున్నది.

(2) రోడ్డు ప్రమాదాలు-వాటి నివారణోపాయాలు

రోడ్డు ప్రమాదమనేది అందరికీ సంబంధించిన సమస్య. ప్రపంచ ఆరోగ్య సంస్థవారు ఈ సంవత్సరం 'ప్రమాదాలు, వాటి నివారణ విధానం' అను విషయానికి ప్రాధాన్యం యిస్తూ 'ప్రపంచ ఆరోగ్య దినం' జరుపడం ప్రశంసనీయమైన విషయం. ప్రపంచ చరిత్రను ఒకసారి చూచినట్లయితే, ఘోరాతి ఘోర యుద్ధంలో మరణించినవారి కంటె ప్రమాదాలవల్ల చాలామంది ప్రజలు అకాల మృత్యువుకు గురి అవుతున్నారని తెలియగలదు.

సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో సాధించిన విజయాలవల్ల, ప్రపంచ దేశాలలో అపూర్వమైన ఆర్థిక ప్రగతికి దోహదం కలిగింది. జీవన ప్రమాణాలు పెరిగాయి. తత్పర్యవసానంగా జీవితావసర వస్తు సామగ్రులు పట్టణ ప్రాంతాలకూ, పల్లెటూర్లకూ విరివిగా రవాణా అవుతున్నయ్. రవాణా అవసరాల్ని ఆదుకొనేందుకై అనేక రకాల బండ్లు, మోటార్లు, లారీలు ఉత్పత్తి అవుతున్నాయి. పట్టణాల్లో, నగరాల్లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోవడంవల్ల, దాన్ని అదుపులో పెట్టడానికి ప్రస్తుతం వున్న యంత్రాంగం కొంత యిబ్బంది పడుతున్నది. మోటారు రవాణా సౌకర్యంవల్ల ప్రజానీకానికి యెంతో మేలు కలిగినా రోడ్డు ప్రమాదాలలో ధన ప్రాణాలకు నష్టం కలుగుతున్నది. మోటారు రవాణావల్ల మేలు కంటే, కీడే యెక్కువ కలుగుతున్నది. నగరాలలో ఇట్టి పరిస్థితి మరీ దారుణంగా వుంటూన్నది. కొంతకాలం క్రితంవరకును విశాలంగా వున్న రోడ్లు ఇప్పుడు ఇరుకైన చిన్న వీధులుగా మారిపోయినట్లు కన్పిస్తున్నాయి. మోటార్ల మయమైన పట్టణాలలో వాటివల్ల

ప్రమాదాలు జరుగుతూ వుండవలసిందేనా? ప్రాణహాని లేకుండా కార్లను జాగ్రత్తగా నడపడం సాధ్యం కాదా? ఇదే మనల్ని యెదుర్కొంటున్న సమస్య.

ప్రపంచ రహదార్లలో సంవత్సరానికి సుమారు పదివేల మందికి పైగా రోడ్డు ప్రమాదాలవల్ల మరణిస్తున్నారు. రెండు లక్షల మందికి పైగా గాయపడుతున్నారని అంచనా వేయబడింది. ప్రపంచమంతటా జరిగే ప్రమాదాల్ని విచారిస్తే తేలిన విషయమిది. ఇంగ్లాండు దేశంలో ప్రతి 65 నిముషాలకి ఒకరు మరణిస్తూంటారు, ప్రతి రెండు నిముషాలకి ఒకరు గాయపడుతుంటారు. ఒక్కొసారి ప్రమాదాలు ఇంకా యెక్కువే జరుగుతూవుంటాయి. ఒక మోటారు బండి ప్రయాణంచేసే ప్రతి కోటి కిలోమీటర్లకు పశ్చిమ యూరప్ ఖండములో 18 మంది, ఇంగ్లాండులో 10 మంది, అమెరికా సంయుక్త రాష్ట్రములలో 5 మంది మరణిస్తున్నారు. గాయపడినవారు అంగవికలు లవుతున్నారు. 1958 సం.లో రోడ్డు ప్రమాదాలవల్ల ఒక కోటి డాలర్ల మేరకు ఆర్థిక నష్టం కలిగిందని తేలింది. ప్రపంచ దేశాలన్నిటిలో కలిసి, రిజిస్టరైన ప్రతి మోటారు బండికి ఈ నష్టాన్ని వాటా లెక్కపెడితే, ఆ మొత్తం ప్రయివేటు మోటారుబండ్లు కట్టే రోడ్డు పన్నును సమానమవుతుంది. అన్నిదేశాలలో కలిసి, ప్రతి గంటకు పది లక్షల డాలర్ల విలువగల ఆస్తి నష్టం అవుతున్నదని అంచనా వేయబడింది. ఉత్తర అమెరికాలోనే మోటారు ప్రమాదాలవల్ల కలిగే నష్టం సగటున అవి ప్రయాణంచేసే ప్రతి మైలుకు ఒక సెంటు (అనగా డాలరులో నూరో వంతు) అవుతుంది. అంటే మొత్తం 7.25 బిలియన్ డాలర్లు అవుతుందన్నమాట. ఇంగ్లాండులో సాలుకు 50 కోట్ల డాలర్లు, జపానులో 9 కోట్ల డాలర్ల నష్టమవు తున్నవి. సాంఘికరీత్యా చూస్తే రహదార్లలో జరిగే ప్రమాదాలు చాలా విషాదకరమైనవి. వీటి దుష్పరిణామాలు కేవలం ఒకరిద్దరు వ్యక్తులకు మాత్రమే పరిమితమై వుండడం లేదు. అనేక కుటుంబాలు వీటి దుష్ఫలితాలు అనుభవిస్తున్నాయి. కనుక రోడ్డు ప్రయాణాలు ప్రమాద రహితంగా చేయుటకు సమాజంపైన, ప్రభుత్వంపైన గురుతరమైన బాధ్యత వున్నది. ఈ బాధ్యతను గుర్తించి, తదనుగుణంగా ప్రవర్తిస్తేనే రహదార్లపైన ప్రమాదాలవల్ల కలిగే ధన ప్రాణ నష్టాలను ఆర్థిక, సాంఘిక, మానసిక నష్టాలను సాధ్యమయినంతవరకు తగ్గించుటకు వీలుకలుగుతుంది.

ప్రమాద కారణాలు :

సాధారణంగా డ్రైవర్లు, బండ్లు, రహదార్లు - యీ మూడు అంశములవల్ల ప్రమాదాలు జరుగుతాయి. రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి. రోడ్డుప్రమాదాలు నివారించాలంటే ఈ మూడు అంశములను జాగ్రత్తగా సమన్వయం చేయాలి. వీటిల్లో ఏది సరిగా లేకపోయినప్పటికీ అనేక కష్టనష్టాలు కలుగుతాయి. ఇది మన గతానుభవంవల్ల తెలిసిన విషయం. మోటారు బండ్లపై రవాణా యెక్కువ కావడంతో రోడ్లపైన విపరీతమైన వత్తిడి పడుతున్నది. ఈ వత్తిడికి రోడ్లు తట్టుకోలేకపోతున్నాయి. అందువల్ల ప్రమాదాలు కలిగే అవకాశాలు యేర్పడుతున్నాయి.

అనేక సందర్భాలలో డ్రైవరు లోపంవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువ స్పీడుగా నడపడంవల్లకానీ, ప్రమాదం సంభవించనున్న సమయంలో తగు విధంగా బుద్ధిని వుపయోగించి పనిచేయకపోవడంవల్లకానీ ఇవి జరుగుతాయి. అతి స్పీడుగా పోవడం, ఒళ్లు తెలియకుండా నడపడంవల్ల కలిగే ప్రమాదాలు ఇవి. ఒక మోటారు ముందు పోతున్నప్పుడు, దానిని అధిగమించి పోవడం, ఆగివున్న బండిని ప్రమాదభరితమైన విధంగా దాటిపోవడం, సకాలంలో బ్రేకులు వేయకపోవడం, ఇంకో మోటారుకు వెనువెంట అతిదగ్గరగాపోవడం, స్పీడు కంట్రోలు లేకుండా రోడ్డు మలుపులలో మోటారు త్రిప్పడం, నిర్లక్ష్యముగా రోడ్డు, రైల్వే క్రాసింగులను దాటడం డ్రైవరు లోపంవల్ల కలిగే ప్రమాదాలు.

అనేక సందర్భాలలో డ్రైవరులోపం లేకపోయినా, కాలినడకన పోయేవారు, యెద్దులబండ్లు తోలేవారు, మొదలగువారి నిర్లక్ష్యంవల్లా, ప్రయాణీకులు, నడిచే మోటార్లనుంచి చేతులు బయట పెట్టడం, తొంగిచూడడంవల్లకూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్లల్లో తిరిగే పశువులు అకస్మాత్తుగా బండ్లకు యెదురుగా రావడం, అనుకోనివిధంగా అవి ఇటూ అటూ తిరగటంవల్లకూడా చాలా ప్రమాదాలు కలుగుతున్నాయి.

మోటార్లలో వుండే యంత్రలోపమువల్ల కలిగే ప్రమాదాలకు డ్రైవర్లుకానీ, ఇతరులు కానీ ప్రత్యక్షంగా బాధ్యులు కారు. యంత్రాలలో వుండే సాధారణలోపాలు ఇవి :—

1, బ్రేకులు సరిగా లేకపోవడం; 2. టైర్లు పగిలిపోవడం; 3. టైరాడ్; 4. యుబోల్టు; 5, సెంటర్ బోల్టులు విరిగిపోవడం; 6. పుల్, పుష్‌రాడ్ డిస్‌కనెక్టు కావడం; 7. స్ప్రింగు; 8. ప్రొపెల్లర్ షాఫ్టు, బ్రేక్‌పైపు; 9. మాస్టర్ సిలండర్ వాల్వు, 10. స్ప్లిట్ పిన్ విరిగిపోవడం.

అనేక ప్రమాదాల్ని విచారణ చేయగా రోడ్లు సరిగాలేక

హెచ్చుతగ్గులుగా వుండడంవల్ల మోటారు యంత్రములలో ఆ భాగాలు దెబ్బతింటాయి అని తేలింది. పల్లెప్రాంతాల్లో రోడ్లు మరీ అధ్వాన్నం. రోడ్ల నిర్మాణానికంటె మోటారుబండ్ల పుత్పత్తి అభివృద్ధి అయింది. ఇది నిర్వివాదమైన విషయం. ట్రాఫిక్ యెక్కువగా వుండే రోడ్లలో గుంటలు మున్నగు అనేక రకాల అవరోధాలు వుండడం సామాన్యంగా కన్పించే దృశ్యం. మోటారు బండ్లు రోడ్ల మధ్య భాగంలో పోతూ వుంటాయి. వర్షాకాలంలో రోడ్ల ప్రక్కభాగాల్లో పోవలసివస్తే, జారిపోయే ప్రమాదముం టుంది. ఎక్కువ బరువును మోసే తాహతు రోడ్లకు లేకపోవచ్చు. లేదా లారీలు వగైరాల చక్రాలు ప్రమాదకరంగా గిర్రున జారుతూ తిరుగుతాయి. కాలినడకన పోవువారు. మోటార్ల ట్రాఫిక్, యెక్కువ కావడంతో, ఆధునిక రహదార్లలోకూడా మలుపులు టర్నింగులు కంటికి సరిగా కనిపించవు. కనుక రోడ్డు పరిస్థితులు సరిగా లేకపోవడంవల్ల కూడా అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

నిరోధక చర్యలు :

రోడ్డు ప్రమాదాలకు పైన పేర్కొన్న మూడు అంశాలు యేవిధంగా కారణభూత మవుతున్నాయో తెలుసుకొన్నాము. ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవచ్చు. మన భారత దేశంలో డ్రైవరు మోటారును సరిగాలేని రోడ్లపైన, కొండ ప్రాంతాలలో, ఇసుక భూములలో, వైపరీత్యమైన వాతావరణ ములో నడపవలసివస్తుంది. అందుకని, డ్రైవరు పనిలోకి చేరు టకు ముందు అతను తగిన డ్రైవర్ ట్రెయినింగు పొంది మోటారు నడుపుటలో ప్రావీణ్యం సంపాదించి వుండాలి. భద్రముగా వుండేంత స్పీడులో మోటారు నడుపుతూ తన నిర్లక్ష్యం, ఉపేక్షలవల్ల ఇతరులకు యేం ప్రమాదం జరుగుతుందో అనే భయం వుంటే, అనేక ప్రమాదాల్ని నివారించవచ్చని అతనికి బోధపడాలి. ధైర్యంతో, మనో నిబ్బరంతో క్లిష్ట సమయాల్లో, ప్రమాద సందర్భములలో సమయస్ఫూర్తితో మోటారు నడిపే శక్తి సామర్థ్యాలు డ్రైవరుకు వుండాలి. రవాణా లైసెన్సింగు అధికారులు డ్రైవర్లకు లైసెన్సులు జారీచేయునపుడు యీ విష యాలపై మంచి నిగా వుంచాలి. డ్రైవర్లు శారీరకంగా యోగ్యు లుగా దృష్టిలోపం లేనివారుగా వున్నారా లేదా యని తెలుసుకొను టకు అప్పుడప్పుడు వారిని వైద్య పరీక్ష చేయించాల్సి వుంటుంది.

బండ్ల వేగమును పరిమితం చేయుటకై యూరప్ ఖండములో జరిగిన కొన్ని ప్రయోగాలు సత్ఫలితాలు ఇచ్చినాయి. బెల్జియం, జర్మనీ ఫెడరల్ పబ్లిక్, నెదర్లాండ్స్ దేశాలలో ఈ విషయమై కొన్ని ప్రయోగాలు చేయగా, స్పీడును తగ్గించడంవల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గిపోయినాయనీ, ఒకవేళ ప్రమాదాలు జరిగినా, అంత తీవ్రంగా వుండవనీ తెలిసింది. ఈ ఫలితాలు అంతిమమైన వని తేల్చి చెప్పలేము. డ్రైవర్ల ప్రవర్తనలు నిక్కచ్చిగా ఒకే తీరుగా వుండవు. మనిషికీ, మనిషికీ మధ్య యెంతో తేడా వుంటుంది. ఈ విషయమై పశ్చిమ దేశాలలో భారీయెత్తున ప్రయో గాలు జరుగుతున్నాయి. బెల్జియం దేశంలో జనసంచారం లేని ప్రాంతాలలో స్పీడును గంటకు 70 కిలోమీటర్లకు పరిమితం చేస్తూ, పరిస్థితిని 2 నెలల వరకు గమనించారు. ప్రమాదాలు నూటికి 8 వంతులు తగ్గినాయి. ప్రమాదాలవల్ల మరణించినవారు, వికలాం గులు అయిన వారి సంఖ్య నూటికి 17 వంతులు తగ్గింది. నెదర్లాండ్సు దేశంలో కొన్ని నిర్ణీత రోడ్లలోతప్ప, మిగతా జన సంచారం గల ప్రాంతాలన్నింటిలో స్పీడును గంటకు 50 కిలో మీటర్లకు తగ్గించివేశారు. ఫలితమేమంటే రోడ్డు ప్రమాదాల్లో మరణించినవారి సంఖ్య 16.8 శాతానికి తగ్గింది. జర్మనీ ఫెడరల్ రిపబ్లిక్‌లోని నగరాలలో స్పీడును గంటకు 50 కిలోమీటర్లకు తగ్గించివేశారు. అందువల్ల ప్రమాదంలో మరణించినవారి సంఖ్య 18.1 శాతానికి తగ్గింది. పట్టణాలకు దూరంగా జనసంచారం లేని ప్రాంతాల్లో గంటకు నూరు కిలోమీటర్ల వేగం మించకూడదని హద్దు ఏర్పాటు చేశారు. తత్ఫలితంగా ప్రాణహానిగల ప్రమాదాల సంఖ్య సగానికి సగం తగ్గింది. ఆస్తి నష్టమైన ప్రమాదాలు నూటికి 60 వంతులు తగ్గినాయి. రోడ్డు ప్రమాదాలు అరికట్టాలంటే డ్రైవర్లు బండ్లను అతివేగంగా పోనివ్వకుండా చూడాలి.

నిరపాయకరంగా బండ్లు నడపాలని డ్రైవర్లకు మాత్రమే తెలిసివుంటే చాలదు. ప్రమాదాలు జరగకుండా చూడాలంటే ప్రయాణీకులు, కాలినడకన పోయేవారుకూడా ఏవిధంగా ప్రవర్తిస్తే ప్రమాదాలు తగ్గిపోతాయి అనే విషయం వారికి బాగా తెలిసి వుండాలి. తమ భద్రత విషయం పట్టించుకోని వారికి ప్రమాదాల దుష్టఫలితాలు తెలియజేస్తూ కన్పించునట్లుగా కీలక స్థానాలలో అంటే ముఖ్య రోడ్లు కలిసేచోట్లలోను, ప్రజలు బస్సులలో యెక్కు స్థలాలలోను పోస్టర్లు ప్రదర్శించడం అవసరం. రోడ్డు నిబంధనలు, భద్రముగా, రోడ్లు దాటడం, వేగముగా బండి సమీపించునపుడు తీసుకోవలసిన చర్యలనుగూర్చి, కాలినడకన పోయే వారికి ముఖ్యంగా ఇవంటే ఏమిటో తెలియని స్కూలుకు పోవు పసి పిల్లలకు బోధించాలి. స్కెచ్‌లు, చిత్ర పటములు, పోస్టర్ల సహా యంతో ఈ విషయాల్నిగూర్చి ప్రైమరీ, సెకండరీ స్కూళ్ళలో

పిల్లలకు శిక్షణ ఇవ్వచ్చు.

యాంత్రిక లోపాలవల్ల కలిగే ప్రమాదాల్ని, మోటార్ల పగ్గెరాలు బయటికి వెళ్ళుటకు ముందు వాటిని క్షుణ్ణంగా పరిశీలించినట్లయితే నిరోధించవచ్చు. స్టీరింగు కనెక్షనులు, టైర్ల పరిస్థితి, స్ప్రింగు బోల్టులు, విద్యుత్ప్రవాహక స్థితిని విధిగా పరీక్ష చేయాల్సివుంటుంది. ప్రతి మోటారు 3000 లేక 4000 మైళ్ల ప్రయాణం చేసినతరువాత దానిని సక్రమంగా పరీక్షించాలి. పది, పన్నెండువేల మైళ్ళు ప్రయాణం చేసిందంటే, ఆమూలాగ్రం పరీక్షచేయడం శ్రేష్ఠం. మోటారులో ఏదైనా లోపం కనబడిందంటే, మెకానిక్‌చే సరిగా మరమ్మతు చేయించిన తర్వాత కాని దీనిని రోడ్డుపై నడపకూడదు.

వెడల్పు రోడ్డు లేకపోవడం, మోటారు నడుస్తుంటే రోడ్డు సరిగా కనిపించకపోవడం, రోడ్డు మలుపులు, పక్కలు దృష్టికి అందకపోవడం, ఇరుకైన వంతెనలు మున్నగు కారణాలవల్ల డ్రైవర్లకు యెదురుగా వుండేవి స్పష్టంగా కనిపించవు. వీటిల్లో ఏ లోపంవల్లనైనా ప్రమాదం జరిగే అవకాశముంది. అందువల్ల ప్రస్తుతం రోడ్లల్లోవున్న లోపాల్ని తొలగించాలి. ఇక ముందు నిర్మించే రోడ్లల్లో అట్టి లోపాలు లేకుండా కడు జాగ్రత్త వహించాలి. రహదార్లు నిర్మించే ఇంజనీర్లపైనా, ట్రాఫిక్ కంట్రోలు చేసే నిపుణులపైనా యెంతో బాధ్యత వున్నది. ఈ నాడు మనల్ని యెదుర్కొంటున్న ఇబ్బందుల్ని వారు అధిగమించాలి. భావి తరాలవారు ఇలాంటి ప్రమాదాలకు గురికాకుండా, వారి క్షేమం దృష్టిలో పెట్టుకొని రోడ్ల నిర్మాణానికి పూనుకోవాలి. మనకున్న కొద్దిపాటి అనుభవందృష్ట్యా రోడ్డు ప్రమాదాల్ని సంపూర్ణంగా నివారించలేము. అయితే, ప్రమాదాలు తగ్గుముఖం పట్టునట్లు చేయగలం. ప్రమాదాలు ఎంతతగ్గితే మన ప్రాణాలకు అంత మేలు.

మనదేశంలోని ట్రాఫిక్ పరిస్థితులకు, జపాను, పశ్చిమదేశాల పరిస్థితులకు పోలికలేదు. ప్రస్తుతం మనదేశంలో 4,50,000 మోటారుబండ్లున్నాయి. ప్రతిసంవత్సరం వీటిసంఖ్య 35,000లకు పైగా పెరుగుతున్నది. సాలీనా పదిలక్షల సైకిళ్ళు ఉత్పత్తి అవుతున్నాయి. మనదేశంలో ఒక కోటి యెద్దుల బండ్లున్నాయి. వీటికితోడు సాలుకు 2000 బండ్లు తయారవుతున్నాయి. నలభై లక్షల సైకిళ్ళు, ఐదులక్షల మోటారు సైకిళ్ళు మనదేశపు రోడ్లల్లో నడుస్తుంటాయి. ఈ సంఖ్య సాలీనా 10 శాతం పెరుగుతున్నది. మనదేశంలో రోడ్డుపై నడవడానికి అందరికి సంపూర్ణ స్వాతంత్ర్యంవుంది. ఆవులు, కుక్కలు, కాలినడకన పోవువారు, బజారు వ్యాపారులు, సైకిళ్లు, రిక్షాలు, యెద్దులబండ్లు, జట్కాలు, బస్సులు, అతివేగముగా పోవుకార్లు, మనరోడ్లలో నడుస్తుంటాయి. మెల్లగాపోవుబండ్లు, వేగముగా నడుచు బండ్లు ఒకే రోడ్డులో నడవడం ఒకసమస్యగా ఏర్పడింది. 'మిశ్రమ ట్రాఫిక్'— గల వెనుకబడిన దేశాలలోకెల్లా మన భారతదేశంలో కొన్ని ప్రత్యేక రోడ్డు సమస్యలున్నాయి. మనదేశంలో రోడ్డు ప్రమాదా లెక్కువ. బొంబాయి, కలకత్తా, ఢిల్లీ వంటి ప్రముఖ నగరాలలో, రోడ్లలో హడావిడిగా సంచారం యెక్కువకావడం, ప్రమాదాలు సంభవించడం విపరీతమై పోతున్నాయి. మనదేశంలో ప్రతి పదివేల మోటారు బండ్లకు 70 మంది మరణిస్తున్నారు. అయితే ఇంగ్లాండులో 16 మంది, అమెరికాలో 8 మంది మరణిస్తున్నారు. పట్టణ ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు యెక్కువవు తున్నాయే గాని తగ్గుముఖం పట్టడంలేదు. ఢిల్లీలో 1956 సం. లో జరిగిన ప్రమాదాల్ని 1957 సం. తో పోల్చి చూస్తే, నూటికి 70 వంతులు పెరిగాయి. ట్రాఫిక్ సమస్య కొత్తదేమీకాదు. అయితే, ఇది తీవ్రరూపం దాల్చడం ఆందోళన కల్గిస్తున్నది. మనదేశంలో ప్రముఖపట్టణాల్లో ప్రమాదాలు తగ్గించేందుకు సర్వవిధాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. డ్రైవర్లకు మంచిశిక్షణ ఇవ్వడం, బండ్లవేగం పరిమితం చేయడం, మోటారుయంత్రాలు సక్రమంగా వున్నదీ లేనిదీ తనిఖీ చేయడం, జనసమ్మర్దం గల రోడ్డులో రద్దీ తగ్గుటకు తగు ఏర్పాటు చేయడం, రాకపోకల నిబంధనలను అమలుపరచడం, ఆటోమేటిక్ ట్రాఫిక్ కంట్రోలు పద్ధతులు ఏర్పాటుచేయడం, ప్రమాదాలు సంభవించుటకు ఆస్కారంగల చోట్లలో కట్టుదిట్టాలు ఏర్పాటుచేయడం మున్నగు చర్యలు తీసుకోబడుతున్నాయి.

హైదరాబాదు నగరంలో :

1956 నవంబరు 1 వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత హైద్రాబాదు నగరంలో ట్రాఫిక్ యెక్కువైంది. బండ్లు, జనాభా పెరిగిపోవడంతో జంట నగరాల్లో రాకపోకల రద్దీ యెక్కువైంది. ఈ పరిస్థితిని కంట్రోలుచేయడం గడ్డుసమస్యగా తయారైంది. హైద్రాబాదు నగరంలో సుమారు 20 వేల కార్లు, 5 వేల లారీలు, బస్సులు, 270 టాక్సీలు, 59 ఆటోరిక్షాలు, 10 వేల సైకిలు రిక్షాలు, 3 వేల జట్కాలు, యెద్దులబండ్లు, 10 వేల లాగుడుబండ్లు మున్నగునవి ఉన్నాయి. సైకిళ్ళు, రిక్షాలు, హైద్రాబాదులోవున్నన్ని మన

దేశంలోని యితర ఏ పట్టణంలోకూడా లేవు. ట్రాఫిక్‌ను సక్రమంగా కంట్రోలు చేసేందుకై ట్రాఫిక్ సలహా సంఘాన్ని యేర్పాటుచేయడం ఉత్తమమని భావించబడింది. ప్రభుత్వం కూడా ఇందుకు ఆమోదించింది. హైద్రాబాదు పోలీసు కమీషనర్ ఆధ్వర్యాన ఒక సలహాసంఘంకూడా ఏర్పడింది. ఈ సంఘం నెలకొకసారి సమావేశమై, ప్రమాదాల నరికట్టుటకు వలసిన చర్యలు గైకొంటుంది. నగర రోడ్డులను వెడల్పు చేయడం, ముఖ్యమైన క్రాస్–రోడ్లలో ఐలండ్స్ నిర్మించడం, వీధి లైట్లను అభివృద్ధిపరచడం, రోడ్లలో గుంటలు, ఇతర అవరోధాలు లేకుండా చేయడం, ఒకేవైపు దారులు ఏర్పరుచుట, మున్నగు వాటికి సంబంధించిన సమస్యల్ని ఈ సలహాసంఘం చర్చించి, తదనుగుణంగా చర్యలు గైకొంటుంది.

ఇట్టి చర్యలఫలితంగా హైద్రాబాదు, సికింద్రాబాదు నగరాలలో రోడ్డుప్రమాదాలు తగ్గుముఖం పట్టినాయి. 1959 సం. లో 121 ప్రమాదాలు జరిగితే 1960 సం. లో 103 ప్రమాదాలు జరిగాయి.

రోడ్డుపై నడవడం ప్రమాదరహితం కావాలంటే ఇంకా యెన్నోచర్యలు తీసుకోవాల్సి వుంది. ఇది ఒక సాంఘిక సమస్య. 'మిశ్రమ ట్రాఫిక్' స్వభావరీత్యా అనేక సమస్యల్ని కలిగిస్తున్నది. వీటిని మామూలు పద్ధతుల ద్వారా గాక ప్రత్యేక పద్ధతుల నవలంబించి పరిష్కరించాలి. అందుకని ఇంజనీర్లు, పోలీసులు, డ్రైవర్లు, కాలినడకన పోవువారు అందరూ కలిసి నేర్పరితనంతో వ్యవహరించవలసి వుంటుంది.

(3) ప్రయాణీకులకు ప్రమాదాలు

ప్రమాద మనేది కొన్ని సంఘటనల ఒత్తిడివల్ల సంభవిస్తుందని నిర్వచించటం జరిగింది. వీటివల్ల గాయాలుగానీ, ప్రాణానికిగాని ఆస్తికిగాని అనుద్దేశ పూర్వకంగానే నష్టం వాటిల్లుతుంది. ప్రమాదా లనేవి వాటి స్వభావాన్నిబట్టి, దారితీసిన పరిస్థితులనుబట్టి అనేక రకాలుగా విభజించబడ్డాయి. ఇంటి ప్రమాదాలు, రోడ్లు ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు....ఇలా అనేక రకాలు.

రైలులో ప్రయాణం జేస్తూండగా, వారి అజ్ఞానంవల్లనో, నిర్లక్ష్యంవల్లనో, ప్రమత్తత మూలంగానో సాధారణంగా ప్రజలు లోనయ్యే ప్రమాదాల గురించి యీ వ్యాసంలో చర్చించబడింది. ఈ ప్రమాదాలు ఇంటి దగ్గర, ఫ్యాక్టరీలలో, రోడ్లమీద జరిగే ప్రమాదాలతో పోలిస్తే అతిస్వల్పము, గణింపదగనివీ అయినప్పటికీ పూర్తిగా కొట్టిపారవేయటానికి వీల్లేదు. ఈ ప్రమాదాలను ప్రజలు గుర్తించి, వాటిని తప్పించుకోడానికి తీసుకోదగు వివిధ తీవ్రచర్యలను వారి కెరుకపరచినట్లయితే పెక్కు ప్రమాదాలను నివారించవచ్చు.

రైల్వేలు అనుదినం నడపటంలో సక్రమ మయిన నియమావళిని సూత్రాలను నిర్లక్ష్యంవల్లగాని, అజాగ్రత్తవల్లగాని ఇతర ఏ కారణంచేత నయినా రైల్వేసిబ్బంది ఆచరించనందువల్ల రెండు రైళ్ళు ఢీకొనటం, పట్టాలు తప్పటం జరిగి ఇటు రైల్వేపట్టాలు అధికంగా దెబ్బతినటమే గాకుండా ప్రయాణీకులు అనేకమంది మరణించటం జరుగుతూ వుంటుంది. ఈ జాగ్రత్తలు రైల్వేశాఖవారు తీసుకోవలసినవి గనుక, యీ వ్యాసంలో వాటి ప్రసక్తిని తేవటం జరుగలేదు.

టిక్కెట్ల కిటికీలవద్ద జనసమ్మర్దం :

మామూలుగా, టిక్కెట్లు ఇచ్చే కిటికీల దగ్గర, ఎవరికివారు ముందుగా తీసుకొని బయటపడాలనే ఆతురతతో నెట్టుకుంటూ ప్రయాణీకులు గుంపులుగా గుమిగూడటం మనం చూస్తూనే వుంటాం. రైలు వచ్చేవేళ అయ్యాకనో లేక రైలు బయలుదేరుతూ వుండగానో చివరి నిముషంలో టిక్కెట్లుకోసం వస్తారు. అందరూ ఒకేసారి తీసుకోవాలని చుట్టుముట్టడంతో ఆ పరిస్థితులలో ప్రమాదం జరగటం సర్వసామాన్యం. అందులోనూ యాత్రలు, పెద్దపెద్ద సభలు, ప్రదర్శనల సమయంలో ప్రమాదాలు సంభవించడానికి అవకాశాలు మెండు. ఆ విధంగా మూగటం ఫలితంగా కొన్ని సార్లు పెద్దవాళ్ళే ఊపిరాడక గిజగిజ లాడటం, పిల్లలు వత్తిడికి తట్టుకోలేక నలిగిపోవటం తటస్థిస్తూ వుంటై. రైలువేళకు తగినంత ముందుగానే రావటం, టిక్కెట్టుకోసం వరుసలో నిలబడి, తడవకు ఒక్కరే తీసుకునేట్టుగా ప్రజలు సంసిద్ధులై జాగ్రత్తవహిస్తే ఇటువంటి ప్రమాదాలు జరగటానికి ఆస్కారం వుండదు. బొంబాయి, కలకత్తా మొదలయిన పెద్దపెద్ద నగరాలలో టిక్కెట్లకోసం వరుసులో నిలబడే అలవాటును ప్రజలు అలవర్చుకున్నందుచేత పైన చెప్పినటువంటి ప్రమాదాలు జరగటం అరుదు. ఆ పద్ధతి సంతృప్తికరంగా పనిచేస్తోంది. చిన్న స్టేషన్లలోకూడా వరుసలో

నిలబడటం ప్రజలు అలవరుచుకునేట్లు జేసినయెడల ప్రమాదాలు వీలయినంతగా తగ్గిపోతాయి.

రైలులో ప్రయాణం చేసేటప్పుడు, ప్రయాణీకులు తమ అజాగ్రత్త కారణంగా తమకేగాక తోటి ప్రయాణీకులకుకూడా హాని చేసినవార మవుతున్నామే అని మనసులో పెట్టుకోవడం అవసరం. ఒక్కొక్క ప్రయాణీకుడు ప్లాట్‌ఫారంమీదనో, విశ్రాంతిగది లోనో వుండి అరటిపళ్లు అవీ తిని తొక్కలు ఎక్కడబడితే అక్కడ విసిరిపారవేస్తుంటాడు. అదిగానర రైలు తప్పిపోతుం దేమోనని ఆతురతగా పరుగెత్తే మరోప్రయాణీకుడు ఆ తొక్క మీద కాలువేసి జారిపడే ప్రమాదం వుంది. ఆ రకంగా పడటం వల్ల ఒక్కొక్కసారి శరీరానికి విపరీతమయిన గాయాలు తగుల టమేగాకుండా ప్రాణహానికూడా జరుగవచ్చు. తొక్కలు ఆ విధంగా నిర్లక్ష్యంతో ఎక్కడపడితే అక్కడ పారవేసేకంటే, ప్రతిస్టేషను లోనూ యేర్పరిచిన చెత్తకుండీలలో వేసినట్లయితే ప్రమాదాలు జరిగవు.

అలాగే రైలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అందరూ ఒకే సారి ప్రయత్నంజేసి తలుపుదగ్గర తేనిపోని పరిస్థితి సృష్టిస్తారు. పైగా అంతటితో ఆగితేనా, ఇతరప్రయాణీకులకు హాని కలుగ జేస్తున్నమనయినా లేకుండా తను ఎక్కిందే చూసుకోకుండా ఎలాగోలా తన సామానుకూడా చేరే ఉపాయం వెతుకుతుంటాడు. అది ఇదీ గాకపోతే సామానూ సరంజామా అంతా కిటికీగుండా విసరటం, వీలయితే కిటికీలోంచే తనూ ఎక్కటం జరుగుతూ వుంటాయి. ఇలాంటి చర్యలవల్ల కొన్నిసమయాలలో ఎవరికో ఒకరికి ప్రమాదం జరిగే అవకాశం వున్నది. పెద్దసామాన్లుకూడా ప్రత్యేకంగా ఏర్పాటు జేసిన పెట్టెలో వేయకుండా తనెక్కిన పెట్టెలోనే ఎక్కడో ఒకమూల ఇరికించటానికి సిద్ధపడుతుంటారు. ఇలా చేయటం మూలంగా త్రోవకు అడ్డంకులుగా వుండటంతో పాటు ప్రమాదాలూ జరుగుతయ్. ప్రయాణీకులు క్రమమయిన పద్ధతిలో పెట్టెలోకి ఎక్కటం, సామాన్లు ఎక్కడ పెట్టుకోవాలో అక్కడే పెట్టుకోవడం చేస్తే ఇలాంటి ప్రమాదాలు జరగటానికి తావుండదు.

రైలు బైలుదేరాక ఎక్కడం :

ప్రయాణీకులు, ముఖ్యంగా విద్యార్థులు, పిల్లలు, అప్పుడప్పుడు పెద్దవాళ్ళుకూడా రైలు నడుస్తూండగా ఎక్కటం, దిగటంలో ఆనందాన్ని కనబరుస్తూంటారు. ఇది పెద్ద దురలవాటు. జీవితానికే ముప్పుతెచ్చే తీవ్రమయిన ప్రమాదాలకు గురవుతారు. అలాగే కిటికీలోంచి అవయవాలను బయటపెట్టడము, తలుపుదగ్గర వేలాడటమున్నూ, కిటికీఊచమీద చేయిపెట్టడంకూడా ప్రమాదమే, కారణం, రైలుకదలికకు కిటికీ తలుపులు అకస్మాత్తుగా పడిపోయే అవకాశం వుంది. ఇవన్నీకూడా కొంచెంమాత్రం అప్రమత్తతతో వుంటే జరగకుండా చూడవచ్చు.

రైల్వేలైను బాగోగులు చూసుకునే సిబ్బంది ఎప్పుడూ లైనుకు ఇరువైపులా ఏదో ఒకపని చేస్తూ వుంటారనే విషయం గ్రహించ కుండా కొంతమంది ప్రయాణీకులు ఖాళీసీసాలు మొదలయిన వస్తువులు రైలు పోతూండగా కిటికీలలోంచి విసిరి పారేస్తారు. ఫలితంగా రైల్వే పనివార్లకు ప్రమాదాలు జరుగుతాయి. కాబట్టి ఏవస్తువయినా బయటికి విసిరేటప్పుడు, అది ఏ మనిషికీ తగులదు గదా అన్న జాగ్రత్త తీసుకుంటే అందరికీ మేలుచేసినవా రవుతారు.

అగ్ని ప్రమాదం :

రైల్లో ప్రయాణంచేస్తూ సిగరెట్లు త్రాగే వ్యక్తులు వాటిని ఆర్ప కుండానే కాల్చిన అగ్గిపుల్లలను, పీల్చేసిన సిగరెట్టు పీకలను పెట్టె లోనే పారేస్తారు. ఇలా వేయటంవల్ల అప్పుడప్పుడు అగ్ని ప్రమా దాలకు దారి తీయవచ్చు. అలాగే నడిచే రైలులో స్టౌవ్ వెలిగించటం కూడా ప్రమాదమే. సాధ్యమయినంతవరకు ఇవన్నీ మానుకోవాలి.

రైలు తలుపుల మెట్లమీద నిలబడి ప్రయాణం చేయటం అతి ప్రమాదకరమయినది. గ్రహపాటున కాలు జారిందంటే ప్రాణానికే ముప్పు వాటిల్లుతుంది. రైల్వేల చట్టంక్రింద అలా ప్రయాణం చేసినవారు శిక్షార్హులు.

ఎప్పుడూకూడ, ముఖ్యంగా రాత్రివేళలందు రైలుపెట్టె తలుపులు సరిగా మూసివున్నాయా లేదా, కిటికీ తలుపులు భద్రంగా వున్నయ్యా అని చూసుకోవడం ప్రధానం. తలుపులు సక్రమంగా మూయక, తెరిచివుంచినందువల్ల నడిచే రైలునుంచి ప్రయాణీకులు క్రింద పడిపోయినారని ఎన్నో వార్తలు చదువుతుంటాం.

కొన్ని సమయాల్లో తల్లితండ్రులు నిర్లక్ష్యంగా తెరిచిన తలుపు దగ్గర పిల్లల్ని ఆడుకోనివ్వటం, పోతున్న రైలు కిటికీలనుంచి తొంగిచూడనివ్వటం చేస్తారు. ఇవి హానికరమయినందున, రైలు పోతూండగా పిల్లల గురించి తగుజాగ్రత్త వహించి వుండాలి.

గార్డుపెట్టెలో ప్రథమ చికిత్సకు వినియోగించే మందులపెట్టె ఒకటి ఎల్లప్పుడూ వుంటుందని ప్రయాణీకులు గుర్తుంచుకోవాలి.

ప్రమాదం సమయాలలో వీటిని ఉపయోగించుకుంటే ఉపశమనం కన్పిస్తుంది.

కొంతమంది ప్లాట్‌ఫారమ్ దాటేటప్పుడు అడ్డదోవ అనే తలంపుతో రైలు పట్టాలమీది నుంచి పోతారు. ఇది పెద్దమరల వాటు. పోనీ, అలా వెళ్ళవలసి వచ్చినా అటు ఇటు రైలుగాని, వ్యాగన్లుగాని రావడంలేదు గదా అని పరికించి మరీదాటడం మంచిది. అలాంటి అవసరం వచ్చినప్పుడు ఓవర్‌బ్రిడ్జిలున్నచోట వాటిపైగాపెళ్ళటం ప్రమాదరహితం. మొదట్నించీ ఇదేఅలవాటును పిల్లలకు కూడా నేర్పాలి. అలాగే నదులు, కాల్వలపై రైలువంతెనలు దాటటంకూడా వీలయినంత వరకు మానుకోవాలి. తప్పనిసరి అయినప్పుడు, రైలు రానిసమయంచూసి, ఎంతో జాగ్రత్తగా బ్రిడ్జికి ఇరువైపులా, ముందూ చూసుకుంటూ దాటాలి.

సాధారణంగా రైల్వేలలో ప్రయాణీకుడు ఎదుర్కొనే ప్రమాదాలలో కొన్నిమాత్రం పైన పేర్కొనటం జరిగింది. పేర్కొనాలంటే పెక్కు వున్నాయి.

ఈ ప్రమాదాలను ఎక్కువగా జరుగకుండా నివారించవచ్చు. అవి నివారించే సమయం జరిగాక కాదు, జరగక మునుపే. ఇలాంటి ప్రమాదాలకు ఉత్తమ నివారణా పద్ధతి ఏమిటంటే, "ముందూ, ఆఖరునా, ఎల్లప్పుడూ రక్షణ" అనే నినాదాన్ని మనసులో పెట్టుకోవటమే.

పారిశ్రామిక విశేషాలు


(52 వ పేజి తరువాయి)

సహాయక ప్రైవేటు పారిశ్రామిక వాడలు

అనంతపురం, ఆదోని, తణుకు, రాజమండ్రి, విజయనగరం, చిత్తూరు, మెదక్ జిల్లా పటంచెరువులలో ఏడు సహాయక ప్రైవేటు పారిశ్రామిక వాడల స్థాపనకై ప్రభుత్వం ఒక పథకాన్ని ఆమోదించింది. ఇందుకై రు. 14.4 లక్షలు మంజూరు చేయటం కూడా జరిగింది. ఈ పథకం క్రింద స్థలానికీ, మానవశక్తికి అయ్యే వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తుంది. భవనాలు, యంత్రాలకు మాత్రం పారిశ్రామిక వేత్తలు భరించవలసి వుంటుంది. ఇందుకు కూడా రాష్ట్ర ఆర్థిక కార్పొరేషను నుండి ఋణ సహాయం లభిస్తుంది

బొగ్గు కంట్రోలర్ హైదరాబాదుకు రాక

బొగ్గు కంట్రోలర్ హైదరాబాదుకు వచ్చి ఫిబ్రవరి 23,24 తేదీలందు బొగ్గు సప్లయిలూ, వాగన్ల సప్లయిల గురించి రైల్వే అధికారులతోనూ, సింగరేణి కంపెనీ అధికారులతోనూ, పరిశ్రమలశాఖ అధిపతులతోనూ, ఆంధ్రప్రదేశ్ వాణిజ్యమండలితోనూ, పారిశ్రామిక వేత్తలతోనూ చర్చలు జరిపారు.



? ? ?
ప్రశ్నోత్తరావళి

ప్రశ్న : 148 శ్రీ కె. యల్. నారాయణ, సుద్దికర, కర్నూలుజిల్లా
శ్రీశైలం ప్రాజక్టు పని యెప్పటినుండి ప్రారంభమవు తుంది, ఎప్పటికి పూర్తి అవుతుంది? ఈ ప్రాజెక్టు వల్ల కర్నూలు జిల్లాకు విద్యుచ్ఛక్తి, నీటి పారుదల సౌకర్యాలు ఏ యే ప్రాంతాలకు లభిస్తవి?

సమాధానం : శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టును ప్రభుత్వం తృతీయ ప్రణాళికలో చేర్చింది. తృతీయ ప్రణాళిక తొలిసంవత్సరంలో దీని నిర్మాణం చేపట్టాలని సంకల్పం. ప్రాజెక్టుకు కలిపేరోడ్లు, భవనాలు మొదలయిన ప్రాథమిక పనులు ప్రారంభమై చకచకా జరిగిపోతున్నై. ప్రాజెక్టు నివేదికలో పేర్కొన్న నిర్మాణ కార్యక్రమం ప్రకారం, ప్రాజెక్టు నిర్మాణం నాలుగో ప్రణాళిక ప్రారంభంలో అయిపోతుందని ఆశించబడుతోంది. 1966-67 నాటికి 1,10,000 కిలోవాట్ల యూనిట్లు రెండు నెలకొల్పబడుతవి. వీటి ద్వారా కర్నూలు జిల్లా అన్ని ప్రాంతాలకు విద్యుచ్ఛక్తి సప్లయి చేయ సాధ్యమవుతుంది. ఇది విద్యుచ్ఛక్తి ప్రాజక్టే కాని, నీటి పారుదల పథకం కాదు.

ప్రశ్న : 149 శ్రీ మునగవలస రంగారావు పట్నాయక్, వేణమ్మపేట, శ్రీకాకుళం జిల్లా.

మా జిల్లాలోని వంశధార నదిపై ప్రాజక్టు నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం పరిశీలన జరిపించింది. ఇందు కెంత మొత్తం కేటాయించారు? మూడవ ప్రణాళికలోనైనా యిది నిర్మించ బడుతుందా? ప్రాజెక్టు, రిజర్వాయర్లు ఏ యే స్థలాలలో నిర్మించాలని ప్రభుత్వ ఉద్దేశం?

సమాధానం : 1960-61 బడ్జెటులో యీ ప్రాజెక్టుకై రు. 10 లక్షల మొత్తం కేటాయించబడింది. తృతీయ ప్రణాళికలో దీనికి కేటాయించింది రు. 290 లక్షలు.

వంశధార ప్రాజెక్టులో భాగమయిన నీరడి ఆనకట్ట పథకం 1961 ఫిబ్రవరిలో ప్రారంభించ బడింది. దీన్ని తృతీయ, చతుర్థ ప్రణాళికలలో ముగించాలని కార్యక్రమ ఉద్దేశ్యం.

వంశధార ప్రాజెక్టులో భాగమయిన నీరడి ఆనకట్ట పథకం 1961 ఫిబ్రవరిలో ప్రారంభించ బడింది. దీన్ని తృతీయ, చతుర్థ ప్రణాళికలలో ముగించాలని కార్యక్రమ ఉద్దేశ్యం.

ఇప్పుడు తలపెట్టిన యీ వంశధార ప్రాజెక్టు క్రింద (1) గొట్ట దగ్గర ఒక రిజర్వాయరున్నూ, (2) నీరడిదగ్గర ఆనకట్ట నిర్మించబడుతై.

ప్రశ్న : 150 శ్రీ యన్. చెన్నకేశవులు, బొటికలపాడు, ఉదయగిరి తాలూకా, నెల్లూరు జిల్లా.

నాగార్జున సాగరం ప్రాజెక్టు నీరు నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి తాలూకాకు లభ్యమవుతుందా? అయితే, ఏ యే గ్రామాలకు, ఎంత భూమికి అందుతుంది?

సమాధానం : కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్టు అంచనా క్రిందకు నెల్లూరుజిల్లా ఉదయగిరి తాలూకా రాదు. అయితే, రెండవ దశ పథకంగా మూసీనదికి దిగువన ప్రాజెక్టు నిర్మాణం చేపడితేనే ఉదయగిరి తాలూకాకు నీరు సరఫరా అవుతుంది.

ప్రశ్న : 151 శ్రీ కె. రామలింగం, మీర్ ఖాన్ పేట, ఇబ్రహీంపట్నం తాలూకా, హైదరాబాదు జిల్లా.

హైదరాబాదుజిల్లా ప్రణాళిక అనే పుస్తకంలో ఇబ్రహీంపట్నం తాలూకాలో ద్వితీయ ప్రణాళిక క్రింద "చిన్న మూసీ ప్రాజెక్టు"ను నిర్మించదలచినట్లు పేర్కొనబడి యున్నది. ఆ ప్రాజెక్టు నిర్మాణంపై పని సాగుతున్నదా, లేకపోతే ఎందుకు మానివేశారో తెలియ జేస్తారా?

సమాధానం : ఈ ప్రాజెక్టు ప్రస్తుతానికి వాయిదా వేయబడింది. కారణమేమంటే ఇప్పుడు నిర్మాణంలోవున్న ప్రాజెక్టు క్రింది జలాకర్షణ ప్రాంతంలో కొంతమేర ఆ ప్రాజెక్టువల్ల నీరు చొచ్చుకునిపోయే అవకాశం వున్నందువల్ల, కొత్తగా ప్రాజెక్టు ఏదయినా చేపట్టదలచినప్పుడు యీ విషయాన్ని సమగ్రంగా పరిశీలించి మరీ ప్రారంభించవలసి వుంటుంది. ★

ప్రగతి పథంలో

(జిల్లాలనుంచి అందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గూర్చిన సంక్షిప్త వార్తలు)

ఆదిలాబాదు

కళాశాల లేబరేటరీకి 1½ లక్షలు

ఆదిలాబాదు కళాశాల లేబరేటరీని, లైబ్రరీని విస్తృత పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం రు. 1½ లక్షలు మంజూరు చేసింది.

అనంతపురం

జిల్లా సమ్మేళనంలో ప్రదర్శన

అనంతపురంలో జరిగిన ప్రథమ జిల్లాస్థాయి సమ్మేళనం సందర్భంలో దాదాపు 80 స్టాల్సుతో ఒక ప్రదర్శన యేర్పాటు చేయబడింది. ప్రదర్శన 1961 జనవరి 16 నుండి 22 వరకు జరిగింది. వివిధ బ్లాకులు యేర్పరచిన స్టాల్సులో మడకసిర బ్లాకుకు ప్రథమ బహుమతి, సింగనమల బ్లాకుకు ద్వితీయ బహుమతి లభించింది.

ఈ జనవరిలో రు. 22,000 ల ఖర్చుతో నిర్మించిన ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తలుపులలో తెరువబడింది.

ఎ సి సి భటుల శ్రమదానం

ఈ ఫిబ్రవరి నెలలో కోనాపురం నుంచి మంగాపురం దాకా ఒక మైలు పొడవు రోడ్డును శ్రమదానం ద్వారా 375 మంది ఎ సి సి భటులు నిర్మించారు.

చిత్తూరు

విజ్ఞాన యాత్ర

చౌడేపల్లి పంచాయతీ సమితి జనవరి 17 నుండి మార్చి 4 వరకు యువక రైతులకు ఒక విజ్ఞాన యాత్రను ఏర్పాటు చేసింది. ఈ కిసాన్ దళం గూడూరు, పటంచెరు, అమరావతి, కర్నూలు జిల్లాలోని ఆదర్శ గ్రామమయిన 'పర్ల', బొంబాయి రాష్ట్రంలోని సిల్లాద్ బ్లాక్‌ను సందర్శించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలును గురించి వీరు ఆయా బ్లాకు సిబ్బందితో చర్చలు జరిపారు. ఈ జట్టు గుంటూరు, బాపట్ల, రాజేంద్రనగర్ లలోని వ్యవసాయ క్షేత్రాలను కూడా దర్శించి అక్కడ సాగుకు అమలు సరుస్తున్న ఆధునిక పద్ధతులను పరిశీలించారు.

వీరు నాగార్జునసాగరం ఆనకట్ట, నాగార్జునకొండ, శ్రీశైలం, మహానంది. అజంతా, ఎల్లోరా గుహాలు, దౌలతాబాదు ఫోర్టు కూడా చూశారు.

తూర్పు గోదావరిజిల్లా

మత్స్య అభివృద్ధి సంఘం

కేంద్రప్రభుత్వ మత్స్య అభివృద్ధి నిర్ణాయక సంఘం ఈ మధ్య రాజమండ్రికి వచ్చి వెళ్ళింది. ద్వితీయ ప్రణాళికలో తెరిచిన కృష్ణా-గోదావరి యూనిట్‌లో కొనసాగించిన పనిని పరీక్షించారు. కృష్ణా, గోదావరి నదులకు సంబంధించిన అనేక పరిశోధన, అభివృద్ధి అంశాలను గురించి యీ సంఘం వారు సిబ్బందితో చర్చించారు.

గుంటూరు

సామాజిక కేంద్రం

1961 ఫిబ్రవరి 5న నాదెండ్ల పంచాయతి సమితి బ్లాకులోని జగ్గాపురం గ్రామంలో శ్రీ పోపూరి పెద వెంకన్న సామాజిక కేంద్రం భవనానికి ప్రారంభోత్సవం జరిగింది. ఈ భవనం సమితి నిధులతోనూ, ప్రజావిరాళాలతోనూ నిర్మించబడింది.

హైదరాబాదు

సాంఘిక విద్యా కార్యకర్తలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సాంఘిక విద్యా కార్యకర్తల శిక్షణా పథకం క్రింద 1958 మార్చి నుండి 1960 డిసెంబరు వరకు హైదరాబాదులో 1000 మందికి పైగా సాంఘిక విద్యా కార్యకర్తలు శిక్షణ పొందారు.

ఖమ్మం

సాంఘిక సంక్షేమ పథకం

జిల్లా పరిషత్తు ఐదవ స్థాయీ సంఘం 1960-61 సంవత్సరంలో మెహ్యాల్డు కులాలవారికి ఉపకార వేతనాలు ఇచ్చే

నిమిత్తం సాంఘిక సంక్షేమ పథకం క్రింద రు. 30,000 లు మంజూరు చేసింది. హరిజనుల గృహనిర్మాణానికి జిల్లాలోని 11 బ్లాకులకు ఒక లక్ష రూపాయలు కూడా కేటాయించింది.

కృష్ణా

శిక్షణ శిబిరం

నూజివీడు తాలూకా హనుమాన్ జంక్షన్‌లో గ్రామ సహాయకుల శిక్షణా శిబిరం ఒకటి 17-2-1961 నుండి 19-2-61 వరకు నిర్వహించబడింది. వ్యవసాయం, పశుగణాభివృద్ధి, సేద్యం, సహకారం మొదలైన విషయాలలో 50 మంది గ్రామ సహాయకులకు శిక్షణ ఇవ్వటమయింది.

పొగాకు పంట పోటీ

1957-58 పొగాకు పంట పోటీలో కానూరు గ్రామానికి చెందిన శ్రీ ఉప్పులూరి అచ్యుతేశ్వరరావు ప్రథమ బహుమతి గెల్చుకున్నాడు. ఆయన లిసనాలంలో ఎకరానికి 14,000 పౌనుల పచ్చి ఆకు పండించాడు. మాగ వేస్తే యీయనకు వచ్చిన ఊకం 1,900 పౌనులు. మామూలుగా 750 నుంచి 1,5000 పౌనులు వరకూ వస్తూ వుంటుంది.

శ్రమదానంలో రోడ్డు నిర్మాణం

1961 ఫిబ్రవరి 1 నుండి 14 వరకు మోటూరు గ్రామంలో ఎ. సి. సి. సాంఘిక సేవాశిబిరం ఒకటి ఏర్పాటు చేయబడింది. తూర్పు కృష్ణా జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల నుంచి 480 మంది ఎ సి సి. భటులు, 20 మంది ఎ. సి. సి. అధికారులు పాల్గొన్నారు.

ఈ పథ్నాలుగు రోజుల్లోనూ మోటూరునుంచి సెరికల్లపూడి గ్రామం వరకు 3 మైళ్ళ పొడవున శ్రమదానంలో మట్టి రోడ్డు వేశారు. ఈ రోడ్డు మొత్తం రు. 9,000లు వ్యయం చేస్తుందని అంచనా.

అభ్యుదయ రైతు విరాళం

నందిగామ బ్లాకు పంచాయతీ సమితికి చెందిన అభ్యుదయ రైతు, శ్రీ నల్లని లక్ష్మయ్య, యీ ఫిబ్రవరిలో ముప్పాళ ప్రాథమిక పాఠశాలకు రు. 5000 లు విలువజేసే భవనాన్ని ధర్మం చేశారు.

మంచినీటి బావులు

కృష్ణా జిల్లాలోని వివిధ బ్లాకులలో 1960 ఏప్రిల్, డిసెంబరు నెలలమధ్య 130 బావులు కొత్తగా త్రవ్వబడినై.

కర్నూలు

పంటలకు విమానాలనుంచి మందు చల్లుట

మిడుతలు, తెగుళ్ళకు గురయిన పైరులకు విమానం నుంచి మందుచల్లే పద్ధతిని కర్నూలు తాలూకా మూసిడ్లపాడు, నిడుజూరు, గోపాలసింగవరం, కొత్తకోట గ్రామాలలో గుమిగూడిన రైతులకు ప్రదర్శించ బడింది. దెబ్బతిన్న 400 ఎకరాల వరిపైరుకు, 100 ఎకరాల వేరుశనగ పైరుకు ఒక విమానం మందును చల్లింది. విమానం మీదినుంచి చల్లినందుకు ఎకరానికి షుమారు రు. 13 లు అవుతుందని అంచనా. ఈ వ్యయాన్ని జిల్లా పరిషత్తు, జిల్లా వ్యవసాయశాఖ, ఆయా పంచాయతీ సమితులు భరిస్తాయి.

మహబూబ్‌నగరం

జిల్లా పంచాయతీరాజ్య సమ్మేళనం

ప్రథమ జిల్లా పంచాయతీరాజ్య సమ్మేళనం మహబూబు నగరంలో ఫిబ్రవరి 26న ప్రారంభించ బడింది.

పాఠశాల భవనానికి రు. 1,000 ల విరాళం

దుబ్బాక పంచాయతీ సమితి బ్లాకులోని చెల్లాపురం గ్రామానికి చెందిన శ్రీయుతులు పి. సోమయ్య. ఎ. బాలరెడ్డి, వెంకటరెడ్డి, ఎ. బాపురెడ్డి. అంగారెడ్డి, ఇతరులుకలిసి పాఠశాల భవన నిర్మాణానికి రు. 1,000 లు సమర్పించారు.

ఆదర్శ గ్రామసేవక్

జిల్లాలో కెల్లా ఐజ్బెర్ల సమితి బ్లాకులోని అలూరు ఆదర్శ గ్రామంగానూ, చంద్రశేఖరరెడ్డి ఆదర్శ గ్రామ సేవకుడుగానూ ఎన్నుకోవటం జరిగింది.

మెదక్

మహిళలకు శిక్షణ శిబిరం

దుబ్బాక పంచాయతీ సమితిలోని దుంపలపల్లి గ్రామంలో ఫిబ్రవరి 23, 24 తేదీలందు మహిళలకు శిక్షణాశిబిరం ఒకటి నడుపబడింది. చుట్టుప్రక్క గ్రామాల స్త్రీలు దీనికి హాజరయ్యారు. పొగరానిపొయ్యిలు, కనువుగుంటలు మొదలయినవి తయారు చేసే విధానంవారికి చూపబడింది. సాంఘిక విద్య,

ఆరోగ్యం, శిశు సంతోషం, పోషక ఆహారం మొదలయిన విష యాలపై ఉపన్యాసాలు ఇవ్వటం జరిగింది.

నల్గొండ

యాదగిరిగుట్ట ప్రదర్శన

యాదగిరి గుట్టలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక జాత్ర జరిగే సందర్భంలోనే ఫిబ్రవరి 23 నుంచి 27 వరకు వ్యావసాయిక, పారిశ్రామిక ప్రదర్శన యేర్పాటు చేయబడింది. సమాచారశాఖ ప్రదర్శించిన అంశాలలో ముఖ్యమైనది, పెబ్బజారునగర్ పంచాయతీ సమితిలోని మట్టంపల్లి మహిళా గ్రామపంచాయతీ కార్యకలాపాలను తెలిపేది. ఈ మహిళా పంచాయతీ గత సంవత్సరన్నరలో చేపట్టిన గ్రామ అభివృద్ధి కార్యకలాపాలను యాత్రికులు ఎంతో ఉత్సుకతతో తెలుసు కున్నారు. షుమారు 50,000 మంది ప్రజలు ప్రదర్శనను తిలకించారు.

నిజామాబాదు

పశు ప్రదర్శన

ఫిబ్రవరి మొదటి వారంలో నిజామాబాదులో నాల్గవ తెలంగాణా పశుప్రదర్శనం జరిగింది. దీన్ని నిజామాబాదుకు చెందిన వృద్ధ రైతు, శ్రీ సుంకట పెద్దశాయన్న, ప్రారంభించారు.

శ్రీకాకుళం

ప్రధాని నిధి నుంచి రు. 5000 లు

సోంపేటలో ఫిబ్రవరి 18న జరిగిన అగ్ని ప్రమాదానికి గురయిన బాధితుల సహాయార్థం ప్రధానమంత్రి సహాయనిధి నుండి రు. 5000 లు మంజూరు చేయబడినై.

విశాఖపట్నం

నూతన పరిశ్రమాలయం ప్రారంభం

నరసీపట్నం పంచాయతీ సమితిలోని కొత్తయెల్లారం అనే గ్రామంలో ఫిబ్రవరి 10వ తేదీన అంబరు పరిశ్రమాలయం తెరిచారు. ఇందులో 30 మంది స్త్రీలకు శిక్షణ లభిస్తుంది.

మత్స్య శీతల నిల్వమందిరం

విశాఖపట్నం రేవులో మత్స్యాలను నిల్వజేసే ఒక శీతల మందిరం తెరువబడింది. రు. 3 లక్షలు విలువజేసే ఈ మందిరం టి. సి. యం. వారు బహుమతిగా ఇచ్చారు. రాష్ట్ర మత్స్య శాఖ దీనిని నెలకొల్పడానికి రు. 3 లక్షలు ఖర్చు చేసింది. ఇందులో 500 టన్నుల చేపలను నిల్వచేయొచ్చు.

వరంగల్లు

బంజార కాలనీ

ములుగు పంచాయతీ బ్లాకులోని దుంపలగూడెం కాలనీ బంజార వాసులకు 246 మందికి ఇండ్లు కట్టుకునేందుకై కలప ఉచితంగా సప్లయి చేయటమయింది. కుటుంబానికి రు. 750 లు చొప్పున వీరికి తక్కావీ రుణాలుకూడా ఇవ్వబడినై.

మార్కెటు యార్డులో రైతులపాక

రు. 34,000 ల వ్యయంతో వరంగల్ మార్కెటు యార్డులో నిర్మించిన రైతుల పాకను ఫిబ్రవరి 17న తెరిచారు.

స్పెషల్ టూరిస్టు బస్

వరంగల్లులోనూ పరిసరాలలోనూ చూడదగిన స్థలాలను సందర్శించేందుకై వరంగల్లు ప్రాంతీయ యాత్రిక సమాచార కేంద్రం స్పెషల్ టూరిస్టు బస్సును ఏర్పాటు జేసింది. మొదటి సారిగా యీ బస్సు మార్చి 5న నడుపబడింది.

చిన్న మొత్తాల పొదుపు

గడచిన జనవరిలో యీజిల్లాలో జాతీయ పొదుపు పథకం క్రింద రు. 82,230 లు వసూలు అయింది.

పశ్చిమగోదావరి

మేలురకం విత్తనాల పంపిణీ

1960 ఏప్రిల్ 1 నుంచి డిసెంబరు 31 వరకు జిల్లాలోని వివిధ బ్లాకులలో 61,300 మణుగుల మేలిరకం విత్తనాలు పంచి పెట్టబడ్డాయి.

సహాయార్థం నాటక ప్రదర్శన

కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలలో చిన్న మొత్తాల వసూళ్ళను విరివిగా పెంచే ఉద్దేశంతో జిల్లా రెడ్ క్రాస్ సంఘం ఆధ్వర్యాన మార్చి 19,20 తారీఖులందు ఏలూరులో ఢిల్లీకి చెందిన నాట్య కేంద్రంవారు రెండు నాటక ప్రదర్శనలిచ్చారు.

★

సంగ్రహ ప్రకటనలు

ఆంధ్రప్రదేశ్ గనుల అభివృద్ధి కార్పొరేషన్ ప్రారంభం

ఆంధ్రప్రదేశ్ గనుల అభివృద్ధి కార్పొరేషన్‌ను 9-3-1961 న రాష్ట్రముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రభుత్వ సంస్థ అయిన యీ కార్పొరేషన్ కంపెనీల చట్టంక్రింద నమోదయింది. ప్రస్తుతానికి దీని పెట్టుబడి రు. 50 లక్షలు. ప్రారంభోత్సవ సమావేశానికి డైరెక్టర్లబోర్డు సభ్యులతోపాటు, రాష్ట్ర లఘుపరిశ్రమల మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు.

ప్రారంభోత్సవం కాగానే, కార్పొరేషన్ డైరెక్టర్లు ముందు చేపట్టవలసిన కార్యక్రమాన్ని రూపొందించుకొనేందుకు తొలిసమావేశం జరిపారు. డైరెక్టర్లబోర్డుకు పరిశ్రమలశాఖ కార్యదర్శి శ్రీ ఆర్. యస్. కృష్ణస్వామి, ఐ. సి. యస్., అధ్యక్షుడు. ఈ బోర్డులో ఇద్దరు సుప్రసిద్ధ భూగర్భ శాస్త్రజ్ఞులయిన ఆంధ్ర విశ్వవిద్యాలయ భూగర్భ-భౌతిక శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ యం. యస్. కృష్ణన్, భూగర్భశాస్త్ర ఆచార్యుడు, ఆంధ్రవిశ్వవిద్యాలయ కళాశాలల అధిపతి, డాక్టర్ సి. మహాదేవన్, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ టి. భాస్కరరావులు వున్నారు. అధికారులలో వాణిజ్యపరిశ్రమల శాఖ డైరెక్టరూ, గనుల శాఖ డైరెక్టరూ వున్నారు.

నర్సుల జీతాల సవరణ

నర్సింగు ఉద్యోగులకు ఆకర్షణీయమయిన జీతాలు ఇచ్చే ఉద్దేశ్యంతో, ప్రభుత్వం రాష్ట్ర నర్సింగు సిబ్బంది జీతాల స్కేళ్లు కరువు భత్యం కాక క్రింది విధంగా సవరించింది :-

1. నర్సింగ్ సూపరింటెండెంట్
   I వ గ్రేడు (గజిటెడ్) — రు. 250-10 310-15-400
2. నర్సింగ్ సూపరింటెండెంట్ II వ గ్రేడు,
   నర్సింగ్‌ట్యూటర్ I వ గ్రేడు — రు. 180-7½-210-10-300
3. నర్సింగ్ సూపరింటెండెంట్ III వ గ్రేడు
   హెడ్.నర్సులు, సిస్టర్ ట్యూటర్లు,
   సీనియర్ సిస్టర్లు, నర్సింగ్‌ట్యూటర్
   II వ గ్రేడు — రు. 150-7½-210-10-250
4. (ఎ) స్టాఫ్ నర్సులు (ఉన్నతగ్రేడు)
   రు. 80-4-110-5-150-7½-180
   (బి) మిషన్ ట్రెయిన్డ్ నర్సులు రు. 50-2-64-3-85

దిగువ పేర్కొన్న భత్యాలను మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

(1) రేషన్ భత్యం	నెలకు	రు. 30/-
(2) చాకలి భత్యం	నెలకు	రు. 3/-
(3) యూనిఫారమ్ భత్యం (ఏడాదికి)		రు. 100/-

1960 లో రాష్ట్ర పారిశ్రామిక ఉత్పత్తి

1960 సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ పరిశ్రమల ఉత్పత్తి యీవిధంగా వున్నది

ఎనుకలు, రసాయనిక ఎరువులు 10828 టన్నులు; వెల్డింగ్ గాసులు 1,35,30.000 ఘ. అడుగులు; గంజి 2020 టన్నులు; అగ్గిపెట్టెలు 67,000 గ్రోసుల పెట్టెలు; సబ్బు 324 టన్నులు; సిమెంటు రేకులు 26,000 టన్నులు; ప్రత్తినూలు 3,80.30 000 పౌనులు; ప్రత్తి వస్త్రాలు 20,49,000 గజాలు; జనుపనార 31.270 టన్నులు; రేయాన్ నూలు 42,60,000 పౌనులు; రేయాన్ వస్త్రాలు 50,20,000 గజాలు; సిమెంటు 7,10,757 టన్నులు; బొగ్గు 24,94,000 టన్నులు; కాగితం 34,944 టన్నులు; సిగరెట్లు 68,175 లక్షలు.

గణనీయమయిన సెన్సస్ పనికి పరిగణన

జనాభా లెక్కల సేకరణలో నిమగ్నులయిన అధికారులకు, ఇతర ఉద్యోగులకు వారు చేసిన గణనీయమైన కార్యానికి పరిగణనను లభింపజేసే తలంపుతో, కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సెన్సస్ పతకాలను ఇవ్వటంతోపాటు, వారివ్యక్తిగత నివేదికలలో మంచి రిమార్కులు వ్రాయాలని ప్రభుత్వం నిశ్చయించింది.

ఆంధ్రప్రదేశ్‌కు 354 వెండి పతకాలు, 708 కంచు పత

కాలు కేటాయించబడినై. ప్రతిభనుబట్టి యీ పతకాలు పొందటానికి సెన్సస్ పని చేపట్టిన అన్ని తరగతుల ఉద్యోగులూ అర్హులే.

వీటితోపాటు, మంచి బుద్ధికౌశల్యంతో సెన్సస్ పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులవిషయంలో, ఆపనిని వ్యక్తిగత నివేదికలలో గుర్తించడానికి వారి పై అధికారుల దృష్టికి కొనిరాబడుతుంది.

విద్యార్థులకు ఋణాలు

రాష్ట్రంలోని ఇంజనీరింగు, వైద్య, వ్యవసాయ, పశువైద్య కళాశాలల్లో తొలి సంవత్సరం చదివే విద్యార్థులకు వడ్డీ లేకుండా *అప్పులిచ్చే పథకాన్ని* ప్రభుత్వం ఇదివరకే అమోదించింది. ఈ సౌకర్యం తొలిసంవత్సరం విద్యార్థులకేగాకుండా అన్ని సంవత్సరాల విద్యార్థులకూ కల్పించడాని కనుగుణంగా ఆ ఉత్తర్వుకు, ఒక సవరణను చేయ నిశ్చయించింది. అయితే ఇందుకై ప్రస్తుత సంవత్సరానికి కేటాయించిన రు. 3 లక్షలు అధిగమించకుండానే అప్పులు ఇవ్వాలని షరతును చేర్చింది.

ఉప్పు తయారీకి లైసెన్సులు

1959, 60 సంవత్సరాల్లో ఉప్పు ఉత్పత్తి తగ్గటంచేత, తృతీయ ప్రణాళికలో ఉప్పు ఆధారంగా నెలకొల్ప దలచిన పరిశ్రమల అవసరాల నెదుర్కొనేందుకు ఉప్పు ఉత్పత్తిని అధికం చేయటం తక్షణం జరగాలనే ఉద్దేశ్యంతో, రాష్ట్రంలో కొత్తప్రాంతాలకు ఉప్పు తయారీకి లైసెన్సులు ఇవ్వరాదనే సాధారణ ఉత్తర్వులను సడలించాలా అనే విషయాన్ని భారత ప్రభుత్వం పరిశీలిస్తోంది.

కాబట్టి ఇందుకై, రాష్ట్రంలో కొత్తప్రాంతాలు కౌలుకు, లైసెన్సులివ్వడానికి నిజమయిన ఉప్పు ఉత్పత్తిదార్లు గల సహకార సంఘాల దరఖాస్తులను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది.

సిమెంటు కంట్రోలు వుండదు

సిమెంటు అమ్మకం, పంపిణీల పైన త్వరలో కంట్రోలు విధింపబడనున్నట్లూ, సిమెంటు పంపిణీకి పర్మిట్లు ఇచ్చే పద్ధతిని ప్రవేశపెడుతున్నట్టు ప్రజల్లో లేనిపోని ప్రచారం జరుగుతున్న సంగతి ప్రభుత్వం దృష్టికి వచ్చింది. నిరాధారమయిన యీ వదంతులు సిమెంటుకొరత యేర్పడిందనే కృత్రిమ వాతావరణాన్ని సృష్టించడానికి లేవ దీసిన వేగాని మరేవీకావు. సిమెంటు నిల్వలు సమృద్ధిగావున్నందువల్ల, ప్రస్తుతపరిస్థితుల్లో రాష్ట్రంలో సిమెంటు పంపిణీకి కంట్రోలు పద్ధతిని ప్రవేశపెట్టవలసిన అగత్యం లేదని ప్రభుత్వం యీ సందర్భంలో స్పష్టంచేస్తున్నది.

నేపాలుదేశ సుహృద్భావ బృందం

నేపాలునుంచి 15 మంది సభ్యులుగల ఒక సుహృద్భావ బృందం మార్చి 5న హైదరాబాదుకు వచ్చింది. నగరంలో చూడదగిన ప్రదేశాలను సందర్శించడంతో పాటు, వీరు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ షెడ్యూల్డు కులాలవారి నిమిత్తం నిర్వహిస్తున్న పాఠశాల బాలికల హాస్టలునూ, కళాశాల బాలుర హాస్టలునూ చూశారు. ఈబృందానికి ముఖ్యమంత్రి మధ్యాహ్నం ఆతిథ్యం ఇచ్చారు.

తిరుపతి-తిరుమల దేవస్థానాల ట్రస్టీలబోర్డు

శాసనసభ్యుడు శ్రీ పి. బసిరెడ్డి సమర్పించిన రాజీనామా వల్ల యేర్పడిన *ఖాళీలో తిరుమల-తిరుపతి దేవస్థానాల ట్రస్టీలబోర్డు* సభ్యుడుగా కడపజిల్లా జమ్ములమడుగు నియోజకవర్గ శాసన సభ్యుడు శ్రీ కుందా రామయ్యను నియమించారు. ఈయన 24-10-1963 వరకు యీ పదవిలో వుంటారు. ప్రస్తుతబోర్డు కాలపరిమితికూడా ఆ తేదీతో అంతమవుతుంది.

ఉస్మానియా సిక్కా కోర్టుఫీజు స్టాంపుల ఉపసంహరణ

1956 ఆంధ్ర కోర్టుఫీజు, వ్యాజ్యముల మదింపు చట్టంక్రింద ఫీజువిధింపు విషయాల నిమిత్తమై తెలంగాణా ప్రాంతంలో 1961 జూలై 1వ తేదీనుండి ఉస్మానియా సిక్కా కోర్టుఫీజు స్టాంపులను ఉపసంహరించుకుని, వాటిస్థానే భారత కోర్టుఫీజు స్టాంపులను వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించింది.

పంపింగ్ పథకం మంజూరు

గుంటూరు జిల్లా బాపట్ల తాలుకాలోని నరసాయపాలెం, కొత్తపాలెం, రమణయ్యపాలెం, చెరుకు మొదలయిన గ్రామాలకు నీటి పారుదల సౌకర్యాన్ని కల్పించేందుకై రమణయ్యపాలెం పంపింగు పథకం యీ సంవత్సరం అమలుపరచడానికి ప్రభుత్వం రు. 3,18,270 లు మంజూరుచేసింది.

వక్ఫుల బోర్డు ఏర్పాటు

మార్చి 4వ తారీఖునుండి రాష్ట్రానికంతటికీ కలిపి 11 మందితో ప్రభుత్వం వాక్ఫులబోర్డును యేర్పరచింది. ప్రిన్స్ ముఖరాంజా బహదూర్ బోర్డు సభ్యులలో ఒకరు.

హైదరాబాదు-ఆదిలాబాదు బస్సు సర్వీస్

మార్చి 12 నుండి హైదరాబాదు, ఆదిలాబాదుల మధ్య అదనంగా డీలక్స్ బస్ ఒకటి ప్రవేశపెట్టారు. ఇది హైదరాబాదులో మధ్యాహ్నం 12 గం.కు బయలుదేరి రాత్రి 7-45 కు ఆదిలాబాదు చేరుతుంది. ఆదిలాబాదులో మధ్యాహ్నం 2 గంటలకు బైలుదేరే బస్సు రాత్రి 9-45 కు హైదరాబాదు వస్తుంది. ఒక డీలక్స్ ఎక్స్‌ప్రెస్ ఇదివరకే యీ రూటులో తిరుగుతోంది.

★

ఉత్తరదేశంలో లఘుపరిశ్రమలు

ఆర్. ఇ. నారాయణస్వామి

రాష్ట్ర లఘు, కుటీర పరిశ్రమల మంత్రి, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ నాయకత్వాన యీ మధ్య నిర్వహించబడిన ఉత్తర దేశ పారిశ్రామిక విజ్ఞానయాత్ర (తొలిజట్టు) ప్రశంసించ దగినది. లఘు, కుటీర పరిశ్రమలు లాభదాయకం కావని కొంతమంది పారిశ్రామిక వేత్తల మనస్సులలో నాటుకుపోయిన అనుమానాన్ని రూపుమాపడానికి, అవి వాస్తవంగా ఎంత లాభదాయకంగా పనిచేస్తున్నవో ప్రత్యక్షంగా మేము చూడటానికి వీలయ్యేట్టు ఆయన యీ పర్యటన లఘు పరిశ్రమలకు భారత జపాను అని పేరుగాంచిన పంజాబుకు ఏర్పాటు జేశారు. లాభదాయకమయిన యీ చిన్న యూనిట్లను చూడటంవల్ల వాటి పరిజ్ఞానం, దాని మూలంగా వీటియందాసక్తి పారిశ్రామిక వేత్తల మనస్సులలో జనింపజేసినది.

అయితే క్రింద పేర్కొన్న కారణాల మూలంగా చిన్న యూనిట్లు లాభదాయకం కానిమాట వాస్తవమే,

1. ముడిపదార్థాల కొరత, లేక తగినంతగా కోటాలు కేటాయించకపోవడం, లేదా ముడిపదార్థాలు సమయం మించిపోయాక అందటమో.

2. సాంకేతిక పరిజ్ఞానం కొరవడటం, దానివల్ల నాణ్యం రాకపోవటమూ, వ్యర్థమున్నూ.

3. సక్రమమయిన నిర్వహణ విధానం, వ్యాపార దక్షత లోపించడం.

4. కొన్నిసార్లు, పెట్టుబడి నిమిత్తం మామూలు వడ్డీరేటుకు సరయిన సమయంలో డబ్బు దొరకక పోవడం;

5. ప్రభుత్వ విధానంలో వస్తున్న మార్పులు.

ఈ లోపాలు తొలగించబడుతాయనే నా నమ్మకం. లఘు పరిశ్రమల విషయంలో మన రాష్ట్ర మంత్రిగారి మనసులో పాతుకుపోయిన అత్యంతాసక్తిని, ఆయన 27వ తేదీ కొత్త ఢిల్లీలో కేంద్ర పరిశ్రమల మంత్రులు శ్రీ లాల్‌బహుదూర్‌శాస్త్రి, శ్రీ మానూభాయిషాలను కలుసుకొని చేసిన సూచనలనుబట్టి గ్రహించవచ్చు. ఆయన చేసిన సూచనలివి:

1. ముడిపదార్థాల కేటాయింపు, దిగుమతి కోటాలు ఇతర రాష్ట్రాలతోపాటుగా యీ రాష్ట్రానికికూడా సమంగా వుండటం.

(2) మన రాష్ట్రంవంటి వెనుకబడిన ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని.

భారీపరిశ్రమలకు అనుబంధంగా వుండే చిన్నచిన్న యూనిట్లను స్థాపించమని శ్రీ మానూభాయిషా సలహానిచ్చారు, రేడియో విభాగాలు. ఎలక్ట్రికల్ మోటార్లు, ఫిలమెంటు తయారీ, ఎలక్ట్రికల్ మోటార్లు. విడిభాగాలు, కార్డుబోర్డు తయారీ, పోత ఇనుప యంత్రాలు, యంత్రపరికరాలు మొదలయినవి ఉత్పత్తిజేయమని ఆయన ఉదాహరణతో సహా పేర్కొన్నారు. యంత్రపరికరాల యూనిట్టు స్థాపనకు పెట్టుబడి 10 లక్షల రూపాయిలయినా, విద్యుచ్ఛక్తితో గానీ, లేకుండాగానీ 100 మంది వర్కర్లతో పని చేయించినప్పటికీ అది లఘుపరిశ్రమలక్రిందనే వస్తుందని ఆయన అన్నారు.

మన మంత్రిగారికి వున్న ఆసక్తినిబట్టి, మన రాష్ట్ర ఆర్థిక రంగానికి లాభదాయకమయినదయితే ప్రతి విషయంలోనూ ఆయన కేంద్రంతో పోట్లాడయినా సాధిస్తారని నా నమ్మకం. ఇతర రాష్ట్రాలతో పోటీపడకుండా అధునాతన సాంకేతికమయిన పరిశ్రమలను, అందులోనూ నూతన తరహావాటిని ప్రోత్సాహ పరచటం ఆయన అభిమతం అయినట్లు నా భావన.

పరిశ్రమల సందర్శన :

ఆగ్రాలో "ఆర్వర్య పోత ఇనుపపరిశ్రమ" అనే యూనిట్ పోతఇనుముతో అశోక్ లేల్యాండు కంపెనీకి విడిభాగాలను, సైకిలు విభాగాలను ఎంతో సాంకేతిక నిపుణతతో తయారు చేస్తున్నది. ఈ పరిశ్రమకు ఆగ్రా యస్. ఐ. యస్. ఐ. అసిస్టెంటు డైరెక్టరు శ్రీ యస్. కె. బోసు బాగా తోడ్పడినారని మేమువిన్నాం.

ఢిల్లీ యస్. ఐ. యస్. ఐ. డిప్యూటీ డైరెక్టరు (ఫౌండ్రీ), శ్రీ యం. నారాయణస్వామిని నేను ఆయన కార్యాలయంలో కలుసుకోగా యీ రంగంలో ఫలప్రదంగా నడుస్తున్న పరిశ్రమలు బహు తక్కువ అనిచెప్పారు. ఇది ఇంకా పరిణామదశలోనే వుందట. ఇంతకుమునుపే దాన్నిగురించి కొంతవరకయినా తెలియనిదే ఆ పరిశ్రమను చేపట్టడం ప్రమాదం.

చిన్నచిన్న యూనిట్లు అశోక్ లేల్యాండ్, తాతా మెర్సిడ్స్-బెంజ్, సీమెన్స్, చికాగో, ఫిలిప్స్ మొదలయిన సువ్యవస్థితమైన సంస్థలను పూర్తిగా సంతృప్తిపరచగలిగే నాణ్యమైన పరికరాలు అధికమొత్తాలలో ఉత్పత్తి జేస్తున్నాయనటం అతిశయోక్తికాబోదు. ఉదాహరణకు ఫరీదాబాదులోని ఈస్టరన్ ఎలక్ట్రానిక్ కంపెనీ 'రాడార్ట్' రేడియోలను తయారుచేస్తున్నది. వీళ్ళే త్వరలో "పాకెట్ ట్రాన్సిస్టర్ రేడియో" లను రు. 120 లకే తయారు చేయబోతున్నారు. ఇవే యే ఇతరదేశానివో అయితే రు. 500, రు. 600 ఖరీదు అవుతాయి. వీళ్ల అమ్మకానికై సీమెన్ కంపెనీకి "సీమెన్" (Seimen) ట్రేడుమార్కులో రేడియోలు సప్లయి జేస్తున్నారు. అశోక్ లేల్యాండ్. తాతామెర్సిడ్స్-బెంజ్ సంస్థలకు రెండుమూడు యూనిట్లు విడిభాగాలను తయారు గావించుతున్నాయి. జలంధర్‌లోని బాల్కార్‌కంపెనీ అన్నిరకాల ధ్వనినిచ్చే యాంప్లిఫైర్లను తయారుజేస్తున్నారు. త్వరలో "ట్రాన్సిస్టర్‌సౌండ్ యాంప్లిఫైర్"లను. దిగుమతిజేసే వాటికయ్యే ఖరీదులో 40 శాతానికే తయారు జేయబోతున్నారు. వీరు "చికాగో", "ఫిలిప్స్" అన్న ట్రేడ్‌మార్కులలో తయారుజేసి ఆయా కంపెనీలకు అమ్మకానికై సప్లయి చేస్తున్నారు.

అమృతసర్‌లో సర్వజిత్ పరిశ్రమల కంపెనీ బోల్టులు, నట్లు, స్క్రూలు తయారుచేసి దిగుమతి చేసినవాటి ఖరీదులో 40 శాతానికి అమ్ముతూ వున్నారు. ఓసహాన్ ఇంజనీరింగు వర్క్సు (రిజిష్టర్డు) అనే మరో కంపెనీ "ఆటోమాటిక్ టీత్ కటింగ్" (Automatic Teeth Cutting) యంత్రాలనుతయారుచేస్తున్నారు.

కొన్ని లఘుపరిశ్రమలు ఒక నిర్ణీత పరిమితిలో పెట్టుబడితోనే అంతకంటె ఎక్కువ మొత్తాలను లాభాలుగా పొందుతున్నాయి. కనుక లఘు పరిశ్రమలు నెలకొల్పి బాగా రాణించడానికి అవకాశాలు మిక్కుటంగా వున్నవి.

ఆర్. సి. ఆసిలేటర్ రెసిస్టెన్స్ కెపేసిటెన్స్ బిడ్జి, రేడియో ఫ్రీక్వెన్సీ సిగ్నల్ జనరేటర్, ఆడో ఫ్రీక్వెన్సీ సిగ్నల్ జనరేటర్, వాక్యూమ్ ట్యూబ్ వోల్ట్‌మీటర్, జి. పి. ఆసిలోస్కోప్, ఎ. యస్. ఆసిలోస్కోప్ మొదలయిన కొలమాన సాధనాలను దేశంలో కుటీర పరిశ్రమల స్థాయిలో సహేతుకమయిన ధరలకు ఉత్పత్తి జేస్తున్నారని తెలుసుకోవటం మనకు ఆశ్చర్యకరంగానే వుండవచ్చు. ఉదహరణగా ఇటువంటి పరికరాలు అంబాలాకాంట్‌లో జనరల్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ తయారు జేస్తున్నది.

భారీ యంత్రాలు కావాలంటే స్టాండర్డు కంపెనీలయిన ఆర్. కె. యంత్ర పరికరాలు లూథియానా, అట్లాస్ ఇంజనీరింగు పరిశ్రమలు—బటాల, శారద ఫౌండ్రీ, ఇంజనీరింగు వర్క్సు—బటాల, గుప్త ఇంజనీరింగు వర్క్సు—బటాల, బాట్లా ఇంజనీరింగు వర్క్సు—బటాలను సంప్రదించవచ్చు.

లఘు, కుటీర పరిశ్రమల ఆర్థికాభివృద్ధి వాటి అనుబంధ స్వభావం మీద ఆధారపడి వుంటుంది. మనం ఏ యూనిట్‌కు ఆ యూనిట్‌ను విడిగా తీసుకుంటే అది లఘు లేక కుటీర పరిశ్రమ అవుతుంది. అలాగాకుండా యీ యూనిట్ల నన్నింటినీ కలిపితే భారీ పరిశ్రమగా రూపొందుతుంది. ఉదాహరణకు అమృతసర్‌లోని మెట్రోపోల్ సౌండ్ ప్రోడక్ట్స్ అనే కంపెనీ కుటీర పరిశ్రమల స్థాయిలో నడుపుతున్న ఇతరులనుండి విడిభాగాలను ప్రోగుచేసి మూడు చక్రాల సైకిళ్ళు, ఇతరం తయారు చేస్తున్నారు.

ఆలాగే మన బాపూజీ తన బుద్ధికుశలతతో లఘు పరిశ్రమల పరిశీలనకు జపాను గనుక ఒక విజ్ఞాన యాత్రను ఏర్పాటు జేయగలిగితే, ఎంతో లాభదాయక మవుతుందని నా ఉద్దేశం. ఖర్చులు పూర్తిగా ప్రభుత్వమే భరించలేకపోతే, యాత్రలో పాల్గొనేవారు 50 శాతం ఖర్చులు పెట్టుకుంటారు.

(లఘు పరిశ్రమలలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి జెందిందో పాఠకులు గమనించడానికిగాను కొన్ని కంపెనీలు, పరిశ్రమలు, ట్రేడుమార్కుల పేర్లు పైన పేర్కొన్నానేగాని, ఇతర ఉద్దేశంతోగాదు.)

(ఆంగ్లవ్యాసానికి అనువాదం)

విశేషాలు

బహిరంగ చెరసాలలు :

ప్రయోగ చర్యగా హైదరాబాదుకు సమీపంలోనూ, నాగార్జున సాగరం ఎడమ కాలువ ప్రాంతంలోనూ రెండు "బహిరంగ చెరసాలల"ను రాష్ట్ర ప్రభుత్వం తెరిచింది. ఈ విషయాన్ని మార్చి 13 న రాష్ట్ర ఆర్థిక, న్యాయ, జైళ్ళశాఖల మంత్రి శాసన సభలో వెల్లడించారు. హైదరాబాదు సమీపంలోని జైలు ఖైదీలు వ్యవసాయ క్షేత్రంలోనూ, నాగార్జునసాగరం ఎడమ కాలువ ప్రాంతంలోని జైలు ఖైదీలు త్రవ్వకం పనిలోనూ నియమింపబడ్డారు.

విద్యాధికుల సంఖ్యలో తిరుపతికి అగ్రతాంబూలం :

ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు పట్టణాలకు వాటి జనాభాలో 50 శాతం పైగా అక్షరాస్యులయిన ఘనత దక్కింది. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం నిలయమయిన తిరుపతి 55.32 శాతం అక్షరాస్యులతో ప్రథమ స్థానాన్ని, 53.22 శాతంతో అనంతపుర ద్వితీయ స్థానాన్ని ఆక్రమించాయి. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం అక్షరాస్యుల నిష్పత్తి 51.53 శాతం. నెల్లూరు పట్టణంలో 50.71 శాతం, విజయవాడలో 50.53 శాతం అక్షరాస్యులు వున్నారు. రాష్ట్రం మొత్తంమీద విద్యావంతుల సగటు శాతం 20.81.

తెలుగు చిత్రాలకు అవార్డులు :

ఏటా భారత ప్రభుత్వం ప్రాంతీయ చిత్రాలకిచ్చే బహుమతుల పథకం క్రింద 1960 సంవత్సరానికి "మహాకవి కాళిదాసు"కు రజిత పతకమూ, "సీతారామ కళ్యాణం"కు ప్రశంసా పత్రమూ లభించాయి.

ప్రఖ్యాత కళాకారులకు అఖండ సన్మానం :

1961 ఫిబ్రవరి 28 న రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీ స్థానం నరసింహారావు, శ్రీ వేదాంతం సత్యనారాయణలకు "సంగీత నాటక అకాడమీ అవార్డుల"ను సమర్పించారు.

తెలుగు నాటక రంగంలో అసమాన కళా నైపుణ్యం ప్రదర్శించినందుకు రాష్ట్ర అవార్డు పొందిన పద్మశ్రీ స్థానం ప్రఖ్యాత ఆంధ్ర నటకుడు. ఈ రంగంలో యీయన 38 సంవత్సరాలుగా అనన్య సేవ చేసి వున్నారు.

శ్రీ వేదాంతం సత్యనారాయణ సుప్రసిద్ధ కూచిపూడి నాట్య కళాకారుడు. ఉషాపరిణయంలో ఉషగానూ, భామాకలాపంలో సత్యభామగానూ యీయన పాత్రలు బహుళజనాదరణ పొందగలిగాయి.

తెలుగు రచయితకు సాహిత్య అకాడమీ అవార్డు :

1957 జనవరి 1 నుండి 1959 డిసెంబరు 31 వరకు తెలుగులో ప్రచురిత మయిన ఉత్తమ గ్రంథంగా శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారు రచించిన "నాట్యశాస్త్రం"ను కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వాహక సంస్థ ఎన్నుకున్నది. దీనికి 1960 అకాడమీ వార్షిక అవార్డుగా రు. 5000/— లు బహూకరించబడినవి.



ముఖ్యవార్తలు

21—2—1961

గత 21 మాసాలనుంచి ఒరిస్సాను పాలిస్తున్న కాంగ్రెసు — గణతంత్ర పరిషత్తు మిశ్రమ మంత్రివర్గం యీ రోజు రాజీనామా చేసింది.

22—2—1961

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రాష్ట్ర రవాణాశాఖామంత్రికి వ్యతిరేకంగా కొన్ని రిమార్కులు చేస్తూ తీర్పు ఇచ్చినదాన్ని పురస్కరించుకుని, ఆయన మంత్రి పదవికి రాజీనామాను సమర్పించారు. అయితే ముఖ్యమంత్రి రాజీనామాను ఆమోదించలేదు.

23—2—1961

నేడు రాష్ట్ర శాసనసభలో, బంజరుభూములను పంపిణీ చేసే విషయంలో పర్యవేక్షణ చేయడానికై జిల్లా లేదా తాలూకా స్థాయిలలో అనధికార సభ్యులతో సంఘాలను యేర్పరచమని చేసిన సూచనను ఉప ముఖ్యమంత్రి త్రోసిపుచ్చారు.

24—2—1961

రాష్ట్ర శాసనసభ ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యాబిల్లును నేడు ఆమోదించింది. ఈ బిల్లుప్రకారం వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని 6—11 సంవత్సరాల వయసు పిల్లలందరికీ విద్యాసౌకర్యం సమకూరుతుంది.

25—2—1961

ఒరిస్సా మిశ్రమ మంత్రివర్గం రాజీనామా ఇవ్వటంతో రాజ్యాంగంలోని 356 వ సూత్రం ప్రకారం అక్కడి పరిపాలనా విధులన్నింటినీ రాష్ట్రపతి సంక్రమింప జేసుకున్నారు.

26—2—1961

1961 మార్చి మొదలుకుని (అక్టోబరు తప్ప) ప్రతి నెలా ప్రభుత్వ కార్యాలయాలన్నీ మూడో శనివారానికి బదులుగా రెండో శనివారం మూసివుంచబడుతాయని ఆదేశించినట్లు నేడు ఒక ప్రభుత్వ పత్రికాప్రకటన విడుదల జేయబడింది.

27—2—1961

విజయవాడలో ఒకసమావేశంలో ప్రసంగిస్తూ కేంద్ర జల విద్యుచ్ఛక్తి సంఘం సభ్యుడు, డాక్టర్ కె. యల్. రావు, కొన్ని సాంకేతిక కారణాలమూలంగా దక్షిణాదికి గోదావరి జలాలను మళ్ళించడం సాధ్యంకాదని అన్నారు.

28—2—1961

తృతీయ ప్రణాళికా తొలిసంవత్సరపు బడ్జెటును లోకసభకు నేడే కేంద్ర అర్థికమంత్రి సమర్పించారు.

1—3—1961

రివెన్యూబోర్డును రద్దుచేసే విషయం గురించి ఇంకా అంత్య నిర్ణయం తీసుకోవటం జరగలేదని శాసనసభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి వెల్లడించారు.

2—3—1961

భారత దేశంలో 23 రోజుల తమ పర్యటనను ముగించుకొని ఎలిజబెత్ రాణి, ఎడింబరో ప్రభువులు కొత్తఢిల్లీనుంచి బయలుదేరి టెహరాన్‌కు వెళ్ళారు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసుసంఘం అధ్యక్షుడుగా ఎన్నికవగానే మంత్రిపదవికి అటవీ, పశుగణాభివృద్ధి శాఖామంత్రి, శ్రీ మళ్ళపూడి పళ్ళంరాజు సమర్పించిన రాజీనామాను రాష్ట్రగవర్నరు యీనాడు ఆమోదించారు.

3—3—1961

మురికిపేటలలో నివసిస్తున్న 4000 కుటుంబాలవారికి పునరావాసం కల్పించే ఉద్దేశంతో రాష్ట్రంలోని కాలనీలలోకల్లా పెద్ద ఎత్తున నిర్మించిన అజిత్‌నగరం కాలనీకి రాష్ట్ర ముఖ్యమంత్రి నేడు ప్రారంభోత్సవం జరిపారు. మురికిపేటల నిర్మూలన

పథకంక్రింద విజయవాడకు దగ్గరలో యీ కాలనీ రు. 48 లక్షల వ్యయంతో నిర్మించబడింది.

4—3—1961

ఈ ఏప్రిల్‌నుంచి రివెన్యూశాఖ అజమాయిషీలో వున్న ఆంధ్ర ప్రాంతంలోని మైనర్ ఇరిగేషన్ పనులన్నీ పంచాయితీ సమితులు, జిల్లా పరిషత్తులకు అప్పగించబడుతాయని, శాసనసభలో ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు.

5—3—1961

జాతీయ పశుగణాభివృద్ధి సంఘంవారు యేర్పాటు జేసిన అఖిల భారత పశువుల, కోళ్ళప్రదర్శనను యీ రోజు హైదరాబాదులో కేంద్ర పౌరనిర్మాణాల, గృహనిర్మాణాల, సప్లయిల మంత్రి, శ్రీ కె. సి. రెడ్డి ప్రారంభించారు.

6—3—1961

మార్చి 4 నుండి 11 మంది సభ్యులతో రాష్ట్ర వక్ఫులబోర్డును యేర్పరిచినట్లు ఇవాళ ఒక ప్రకటన వెలుపడింది.

7—3—1961

కేంద్ర హోంమంత్రి, శ్రీ గోవిందవల్లభపంత్, యీ రోజు ఢిల్లీలో స్వర్గస్థులయినారు.

8—3—1961

తన నారివే (మలగాసే రిపబ్లిక్)లో కాంగోనాయకుల 'శిఖరాగ్ర' సమావేశం ఆరంభమైంది.

9—3—1961

ప్రముఖ భారత పాత్రికేయుడు. శ్రీ కోటంరాజు రామారావు, రైలులో ప్రయాణంచేస్తూ ప్రమాదవశాత్తూ క్రిందపడిపోయి దివంగతులయినారు.

10—3—1961

ఈ రోజు వెల్లడించిన జనాభాలెక్కల ప్రాంతీయ ఫలితాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జనాభా 3,59,77,999.

11—3—1961

1961—62 కు అదనపు గ్రాంటుగా హరిజన హాస్టళ్ళకు, ఉపకార వేతనాలు మొదలయినవాటికి రు 9 లక్షలు మంజూరు జేయబడుతాయని శాసనమండలిలో రాష్ట్ర ఆర్థికమంత్రి అన్నారు.

12—3—1961

భారత రైల్వేలకు సంబంధిచిన సమస్యలను పరిశీలించడానికి 8 మందిగల ప్రపంచ బ్యాంకు నిపుణుల సంఘం కొత్తఢిల్లీ చేరుకున్నది.

13—3—1961

ఆంధ్రప్రదేశ్ తృతీయ ప్రణాళికలో అదనపు ఆహారధాన్యాల ఉత్పత్తి లక్ష్యం 24.04 నుంచి 28.64 లక్షల టన్నులకు పెంచినట్లయితే, ఎరువులు అధికంగా సరఫరా అయ్యే ఏర్పాట్లు జేయడానికీ, చిన్న నీటి పారుదల పథకాలకు, భూసార రక్షణకు అదనంగా నిధులను మంజూరు చేయడానికి ప్రణాళికా సంఘం ఆమోదించిందని శాసనసభలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి చెప్పారు.

14—3—1961

కాంగోలో శాంతిని నెలకొల్పడానికి భారత సాయుధ దళాల ప్రథమ జట్టు లియోపోల్డ్‌విల్లీకి బయలుదేరి వెళ్ళింది.

15—3—1961

ఉద్యోగాలలో ప్రవేశించడానికి హరిజనులకు, షెడ్యూల్డు కులాలు, తెగలవారికి ఎయః పరిమితి అంటూ వుండదని శాసనసభలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే వారికి ఉపకార వేతనాలుకూడ దక్కుతాయి.

16—3—1961

రాష్ట్రపతి ఆమోదముద్ర లేనందున హైదరాబాదు కౌలుదారీ, వ్యవసాయ భూముల చట్టం న్యాయసమ్మతం కాదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్‌బెంచి తీర్పు ఇచ్చింది.

17—3—1961

ఉగాది సందర్భాన హైదరాబాదులో సమాచార, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యాన సుప్రసిద్ధ తెలుగు నాటకం "కన్యాశుల్కం" ప్రదర్శించబడింది.

18—3—1961

ఈరోజు కొత్తఢిల్లీలో విడుదలజేసిన కేంద్ర ఆహారశాఖ వార్షిక నివేదిక ప్రకారం 1960 లో ఆహారధాన్యాలను నిల్వజేసే విషయంలో గణనీయమయిన అభివృద్ధి సాధించబడింది.

19—3—1961


గత మూడు మాసాలుగా కృష్ణా, గుంటూరు జిల్లాలలో వ్యాపించిన శిశు పక్షవాత వ్యాధి తగ్గుముఖం పట్టిందని విజయవాడలో ఒక అధికారి ప్రకటించారు.


20—3—1961

ఉన్నత విద్యాభ్యాసానికై విశేష ప్రతిభ కనబరచిన విద్యార్థులకు తగిన ఆర్థిక సహాయం ఇవ్వడానికి తృతీయ ప్రణాళికలో ఇతోధిక జాతీయ ఉపకార వేతనాల పథకం ఒకటి ప్రవేశపెట్టనున్నట్లు లోక్‌సభలో కేంద్ర విద్యామంత్రి ప్రకటించారు. ★

రచయితలు

1. శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు (హైదరాబాదు.)
2. శ్రీ త్రిపురనేని గోపీచంద్ (ఆల్ ఇండియా రేడియో, హైదరాబాదు.)
3. శ్రీ కె. వి. రమణారెడ్డి (విశ్వోదయ కళాశాల. కావలి.)
4. శ్రీ రా. సు. రాట్కవి (రామ్ నగర్, మహబూబ్‌నగర్.)
5. శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి (సీతానగరం, శ్రీకాకుళం జిల్లా.)
6. శ్రీ బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి (వేంసూరు, ఖమ్మంజిల్లా)
7. శ్రీ సుప్రసన్న (రిసర్చ్ స్కాలర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.)
8. శ్రీ కొంపల్లి మల్లిఖార్జునరావు (నకరికల్లు, నల్గొండ జిల్లా.)
9. శ్రీ ఆర్. ఇ. నారాయణస్వామి (కదిరి, అనంతపురం జిల్లా)
10. శ్రీ పమిడికాల్వ చెంచునరసింహ శర్మ (పెనగలూరు, రాజంపేట తాలూకా, కడప జిల్లా.)
11. శ్రీ బి. ప్రసన్న (తెలుగు పండితులు, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.)
12. 'కిన్నర' (హైదరాబాదు.)
13. శ్రీ గజపతిరాయవర్మ (జర్నలిస్టు, తాడేపల్లిగూడెం.)




ANDHRA PRADESH
JEWELLERY